భారతి

సాహిత్య మాసపత్రిక

డిసెంబరు : 1989 వెల : 5 రూపాయలు



పాతల్లపాడు శిలా శాసనము : శ్రీ బి.యన్. శాస్త్రి

కృష్ణశాస్త్రి వచన రచన : శ్రీ వేముగంటి నరసింహాచార్యులు

తెలుగులో బాలసాహిత్యం : డా. వెలగా వెంకటప్పయ్య

వ్యవస్థాపకులు

దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు

భారతి

మాసపత్రిక

*

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938-1972)

*

సంపుటము : 66 **డిసెంబరు 1989** **సంచిక : 12**

విడిప్రతి వెల ఐదు రూపాయలు

విషయానుక్రమణిక

స్వ వి ష యం

ఈ నెల భారతిలో అందిస్తున్న శ్రీ బి. ఎస్. శాస్త్రిగారి పాతల్లపాడు శిలాశాసనానికి సంబంధించిన వ్యాసం శాసన ప్రియులకు ఆసక్తికరంగా ఉండి కొత్త ఆలోచనలకు దారి తీయించగలదని మా నమ్మకం. చరిత్ర పరిశోధనలకు సంబంధించిన రచనల పట్ల భారతికి ప్రత్యేకమైన మక్కువ ఉన్న సంగతి పాఠకులకు తెలిసినదే.

కీ. శే. దేవులపల్లి కృష్ణశాస్త్రి పేరు వింటేనే చాలు రమణీయ శిల్ప రంజితమై సుశబ్ద శోభితమై అలరారే కమ్మని కవిత్వం ఎవరికైనా గుర్తుకు వస్తుంది. అయితే ఆయన వచన రచనల మనోహర పరిమళాల గురించి చాలమందికి తెలియదనే చెప్పాలి. ఈ కొఱతను తీర్చడానికి శ్రీ వేముగంటి నరసింహాచార్యులు ఈ మాసం సాహిత్యాభిమానుల కోసం భారతిలో ఒక వ్యాసం రాసారు. చదివితేనే కాని రసానుభూతి కలగదు.

తెలుగులో బాల సాహిత్యం గురించి డాక్టర్ వెలగా వెంక టప్పయ్యగారు రాసిన రచనను ఈ సంచికలోనే అందిస్తున్నాము. ఈ వ్యాసం సమగ్రమైందని చెప్పడానికి మనస్కరించక పోయినా ఈ ప్రయత్నం వెనుక ఉన్న నిజాయితిని మాత్రం శంకించలేము. మరిన్ని రచనలకు ఇది నాంది కాగలదు.

కీ. శే. కే. యస్. కోదండరామయ్యగారి "నరస నాయకుడు-అన్నమయ్యగారు" వ్యాసం ఎన్నో విషయాలను తెలుపుతుంది. ఇందు లోని అన్ని విషయాలతో ఏకీభవించలేకపోయినా రకరకాల ఆలోచన లను ప్రోదిచేసిన తీరును మాత్రం అభినందించక తప్పదు.

భారతిలో పడుతున్న కవిత్వంపై రకరకాల అభిప్రాయాలు అందుతున్నా వైవిధ్యం ఉందనే విషయంలో అందరూ అంగీకరిస్తు న్నారు. వాస్తవానికి ఫలానా కవిత్వం ఫలానా రకానికి చెందిందని వర్గీకరించడం ఉచితం కాదనిపిస్తుంది జీవితానుభవపు లోతుల్లోంచి వెలికివచ్చే అనుభూతికి రమ్యాక్షర రూపకల్పన జరిగితే ఏనాటికీ చావు లేని కవిత్వం పుట్టుకొస్తుంది

"అజ్ఞాత అంధకారంలో
జీవన ఖనిజాలున్నాయి
అనూహ్య నిశ్శబ్దం నించే
అద్భుతమైన కవిత కళ్లు తెరుస్తుంది-"

ఈ మాటలు ఎవరివో విదేశీయునివి. అతనూ మనలాంటివాడే. మాన్య మానవభావం ఎక్కడయినా ఒకటే!

అశేష శేముషీ ముషం మాషం

శ్రీ గడియారం శేషఫణి శర్మ

సుప్రభాత
కల రవాలతో ఆకాశవాణి!
కళ్ళు విప్పి చూశాడు,
కప్పుకున్న చుక్కల దుప్పటీ లాగేసి,
కిలకిలా నవ్వుతూ సూర్యకాంతం!

బద్ధకంగా
బయటకు నడిచాడు,
దరహాస రక్తరోచిస్సులతో
స్వాగతించింది విభూతిరేఖ.

"అశేష శేముషీ ముషం
మాషమశ్నామి"—
మనసులో విరుతించిందొక
మహా సంకల్పం!

తీరిగ్గా
మదరాసుని మింగేశాడు,
వేడి వేడిగా
మదరాసుని త్రాగేశాడు!

నెమ్మదిగా బయటపడుతున్న వాడిని
నిలదీసింది విభూతిరేఖ,
"మదరాసును తూచే తూకంరాళ్ళు
నావద్ద లేవ"న్నాడు.

ఉప్పెనై ఘోషించింది,
విభూతిరేఖ!
నిప్పుల గొంతుముడి విప్పి,
నిష్టురంగా శాసించింది,
విభూతి రేఖ!!

అంతే,
గిరగిర గిరగిర గిరాంగిరగిర,
అశేష శేముషీ ముషం
మాషం గిర గిర గిరాం గిర గిర!!

గిరగిర గిరగిర గిరాంగిరగిర
అరిగిపోయింది
మదరాసు!
కరగి కరగి
కాలువై పారింది మదరాసు!!

అటువైపు,
కాలువ గట్టున,
ఘర్మజలానికి ఖరీదు కడుతూ
విభూతి రేఖ!!

అక్షరాకాశం నా హృది

శ్రీ వఝల శివకుమార్

నిశ్శబ్దంలో శబ్దాల్ని ఖననం చేసి
శబ్ద సమాధుల్లో నిట్టూర్పులు వెతుక్కుంటూ
—శబ్ద సమాధి నా తల

రెప రెప లాడ్తూ రెండు దీపాలు
దృశ్యాల్ని మోసుకొస్తాయి.
దృశ్యాల చితిలో
అదృశ్యమైన వెతల్ని అన్వేషిస్తా
—దృశ్య స్మశానం నా గది.

ఆలోచన నా అంతఃశ్చేతన
తలమీది రెల్లుగడ్డి
గది కిటికీ చువ్వల్లోంచి గువ్వల్ని వదుల్తుంది.
అలజడి అక్షరాలైన గువ్వలు
ముడిపడి వెల్తురు గీతాలౌతాయి
—అక్షరాకాశం నా హృది.

శ్రీ బి. ఎన్. శాస్త్రి

పాతర్లపాడు శిలాశాసనము

శాసనము - ఆకారాదికములు :

నల్లగొండ జిల్లా ఆత్మకూరు మండల ప్రజాపరిషత్పరిధి లోని పాతర్లపాడు గ్రామము నంటియున్న తటాకము చివరి యంచున గల శివాలయము ముందున్న శిలా స్తంభముపై నాలుగు వైపుల చెక్కబడియున్న శాసనమిది. పాతర్లపాడు గ్రామము కాకతీ రాజన్యుల కాలమున రేచర్ల పిల్లలమర్రి రెడ్డిరాజుల యధీన మందుండెను. పిల్లలమర్రి బేతిరెడ్డి భార్య ఎఱకసాని. పిల్లల మర్రిలో తనపేర ఎఱకేశ్వరాలయమును నిర్మించెను. ఎఱకవర మున బేతేశ్వర, ఎఱకేశ్వరాలయములను ఇవటూరి సోమన నిర్మించి యుండెను. ఆ దేవాలయముల అంగరంగ భోగముల కెఱకసాని భూదానము లొసంగుచు శాసనము వేయించెను.

పాతర్లపాడులో నున్న త్రికూటేశ్వరాలయము ఎఱకసాని నిర్మించినట్టిదే. ఈ ఆలయమున సోమేశ్వర, అన్వేశ్వర, కామరేశ్వర లింగములు ప్రతిష్ఠింపబడినవి. ఎఱకసాని తండ్రి కామరి నాయకుడు. తల్లి అన్నెమాంబ గురువు ఇవటూరి సోమన. ఈ మువ్వురి పేర ఎఱకసాని త్రికూటేశ్వరాలయమును నిర్మించి యుండును.

పాతర్లపాడు శాసనము నల్లరాతి స్తంభముపై నాలుగు ప్రక్కల చెక్కబడియున్నది. శాసనము మొదటిప్రక్క 48 పంక్తులు, రెండవప్రక్క 43 పంక్తులు, మూడవప్రక్క 45 పంక్తులు చెక్కబడియున్నవి. నాలుగవప్రక్క వ్యాస గీతా శ్లోకములున్నవి. శాసన స్తంభము ఎత్తు 5½ అడుగులు, వెడల్పు 1½ అడుగులు.

మిత్రులు శ్రీ సూర్యకుమార్‌గారు నకిరేకల్లులోని వాసవి డిగ్రీ కళాశాలలో చరిత్రోపన్యాసకులుగ పనిచేయుచున్నారు. వారికి శాసనములు తీయుట యందాసక్తి మెండు. వారు కొణిదెన చోళుల గుఱించి పరిశోధన చేయుచున్నారు. వారొకమారు కొణిదెన చోళుల శాసనముల ప్రతులు కావలసి నావద్దకి వచ్చినారు. పాతర్లపాడు శాసన ప్రతిబింబములు తీయించి పంపుమని వారిని నేను కోరియుంటిని. వారు శాసన ప్రతిబింబములను తీయించి నాకు యిచ్చి మహోపకార మొనర్చినారు. వారికి నా కృతజ్ఞతలు. శాసనశిల నాలుగవ ప్రక్కనున్న వ్యాస గీతా శ్లోకముల భాగమును వారు తీయుటకు వీలైనది కాదని చెప్పినారు. శాసన ప్రధానభాగము మూడవ ప్రక్కతోనే పూర్తియైనది.

శాసనము మొదటిప్రక్క పానవట్టముతో గూడిన శివలింగము, ఆవు, సూర్యచంద్రుల ప్రతిమలు, కత్తి, డాలు చెక్కబడినవి. రెండవ, మూడవ ప్రక్కలందు చెక్కబడిన ప్రతిమలు స్పష్టాస్పష్టముగ నున్నవి. శాసనపంక్తులు చక్కని వరుసలలో చెక్కబడినవి. శాసనాక్షరములు గుండ్రతిత్తు అక్షరములు. శాసన పంక్తులందముగ కనిపించుచున్నవి. ఆంధ్ర దేశమున 13వ శతాబ్ద్యంతమున వాడుకలోనున్న తెలుగు లిపి ఈ శాసనమున వాడబడినది. శాసనాక్షరములు చుప్పల్లి[1] పెరూరు[2] అగా మోతుకూరు[3] పానుగల్లు[4], పిల్లలమర్రి[5] ఎఱకవరము[6] శాసనాక్షరములను పోలియున్నవి.


శాసనారంభ శ్లోకము, నాలుగవ ప్రక్కనున్న వ్యాస గీతా శ్లోకముల తప్ప తక్కిన శాసన భాగమంతయు తెలుగు వచనములో నున్నది.

శాసన విషయము :

ఈ శాసనము, శ్రీ మన్మహా మండలేశ్వర కాకతీయ కుమార రుద్రదేవ మహారాజు పృథ్వీరాజ్యము చేయుచుండ, శ్రీ మన్మహా మండలేశ్వరుడును, అత్తలూరు పురవరాధీశ్వరుడును నగు, యదువంశోద్భవుడును నగు భీమదేవ మహారాజు తన

---

1. శాసన సంపుటి 1, 2 భాగములు పుటలు 251-257
2. ,, ,, పుటలు 180-195
3. ,, ,, పుటలు 171-178
4. నల్లగొండ మండల సర్వస్వము పుటలు 797-798
5. ,, ,, పుటలు 817
6. అప్రకటితము



పాతర్లపాడు శిలాశాసనము మొదటి ప్రక్క

పాతర్లపాడు శిలాశాసనము రెండవ ప్రక్క


కుమారుడగు మల్దేమహారాజు వివాహ సందర్భమును పురస్కరించుకొని, పాతర్లపాటి మూలస్థాన సోమేశ్వర దేవర, అన్యేశ్వర దేవర, కామరేశ్వర దేవరల అంగరంగ భోగములకు, వృత్తులను దానమొసంగుచు వేయించినట్టిది త్రికూటేశ్వరాలయ మందున్న సోమేశ్వర, అన్యేశ్వర కామరేశ్వర దేవరలకు భీమదేవ మహారాజు వివిధ ప్రాంతములందున్న నీరు నేలలను, వెలిపొలములను, వివిధ భోగములకు, నైవేద్యములకు, పూజారులకు, దేవాలయ సిబ్బందికి, గుండయ బ్రహ్మయకు దానమొసంగుచు వేయించినట్లీ శాసన మందున్నది.

శాసనమున ప్రతాపరుద్రుడు, "శ్రీమన్మహ మండలేశ్వర కాకతియ్య కుమార రుద్రదేవ మహారాజులు పృథివీ రాజ్యము చేయుచుండంగా" అని పర్ణింపబడినాడు భీమదేవ మహారాజు శ్రీ మన్మహా మండలేశ్వర, అత్తలూరి పురవరాధీశ్వర, యదు వంశోద్భవ కులతిలక, షడాంగనాదూర సుజన మనోహ్లాద, బంధు జనాశ్రయ, భుజబలభీమ, బ్రహ్మరాక్షస, హారీత గోత్ర, శ్రీ సోమనాథదేవ దివ్యశ్రీ పాదపద్మారాధకాది బిరుదములతోను, ప్రశంసింపబడినాడు

శాసనమునందనేక గ్రామములు పేర్కొనబడినవి ఆయా గ్రామములందు భీమదేవ మహారాజు పాతర్లపాటి త్రికూటేశ్వరాలయ అంగరంగ భోగములకు ధూప దీప నైవేద్యములకు భూములను దానమొసంగినాడు. మొత్తం 21 గ్రామములందు భూదానము ఇవ్వబడినవి ఆ గ్రామములన్నియు సూర్యాపేట, హుజూర్ నగర్, మిర్యాలగూడ తాలూకాలలోనివి కొలది మార్పులతో నేడా గ్రామములు పిలువబడుచున్నవి. అవి 1) పాతర్లపాడు 2) నెమ్మికల్లు 3) కందగట్ల 4) పసునూరు 5) ప్రోలుపాక= పోలుమల్ల 6) చంద్రుపట్ల=చుదుపట్ల 9) పూంతులకథి= మూతకల్లు 8) ఏపూరు 9) పెట్టతాడుంబల్లి 10) కొత్తపల్లి 11) జురకచల్ల 12) పెనుంబాట=పెన్పావు 13) కుడికుడియ= కుడకుడ 14) పెనుంగొండవాతల 15) పిల్లలమర్రి 16) అడవి దామరచర్ల 17) గోపతి 18) దామలచర్ల 19) బూరుగుగడ్డ 20) పొనుంగోడు 21) ఆతుకూర=ఆత్మకూరు

దేవరల అంగ రంగభోగములకు, పరివారమునకు వివిధ ప్రాంతములందు భూదానము లొసగబడినవి అల్లే, కోమట్లు, గానుగవారు, గొల్లవారు, సాలెవారు, ఆయగాండ్రు, కరణము, వంటి అష్టాదశ ప్రజలు దేవాలయమునకు కట్టడి సుంకములు చెల్లించునట్లేర్పాటు చేయబడినది స్వస్థాన పరస్థానములందు వృత్తులు పెట్టబడినవి ఎర్రమయ్యంగారికి, తోటపనివారికి,

ఓగిరాలకు, శ్రీగంధమునకు, గుగ్గిలమునకు, అఖండ దీపములకు, పూవులు కోయువారికి (ముగ్గులు పెట్టువారికి, పంచమహా పక్షాలకు, సోమవారపు ఓగిరాలకు, నిడ్లు ఎత్తువారికి, నిడ్లు కట్టేవారికి, కరణమునకు, ఇద్దరు మద్దెలకాండ్రకు, ఆవజకానికి, కలశమునకు, ఇద్దరు వాసెకాండ్రకు, ఇద్దరు పాత్రలకు, సావాసికి, నలువురు సూయాణతలకు, నలువురు వీరముష్టులకు, మన్నగువారికి భూదానము లొసంగబడినవి



శాసన కాలము

ఈ శాసనము శకవర్షము 1212 వికృతి సంవత్సర కార్తీక శుద్ధ పౌర్ణమి గురువారము నాడీయబడినది. రేచర్ల, చెఱకురెడ్డి వంశీయుల శాసనములు క్రీ.శ 1295 వరకు గలవి నల్లగొండ మండలమున కనిపించుచున్నవి. మహా మండలేశ్వరుడగు భీమదేవ మహారాజు, పిల్లలమర్రి, పాతర్లపాడు ప్రాంత పాలకునిగా ప్రతాపరుద్రునిచే నియమింపబడి యుండవచ్చును. రుద్రమదేవి క్రీ.శ. 1288-89లో సంభవించిన యుద్ధమున దివంగతురాలయ్యెను. కాయస్థ అంబదేవ మహారాజు కాకతీ రాజన్యుల 72 మంది నాయంకరుల నోడించి, రుద్రమదేవి అంగరక్షకుడగు మల్లికార్జున నాయకుని సప్తాంగములను ఖండించినట్లు త్రిపురాంతక దేవాలయ శాసనము వలన తెలియుచున్నది. ఈ యుద్ధము క్రీ.శ 1289లో సంభవించినది. కాకతిరుద్రమ మరణానంతరము ప్రతాపరుద్రుడు క్రీ.శ 1289 ఓరుగల్లు సింహాసనమధిష్టించెను. ఈ శాసనము క్రీ.శ 1290వ సంవత్సరమున వేయింపబడినది.

పాతర్లపాడు శిలాశాసనము

శాసనము – మూలము

మొదటిప్రక్క

1 శ్రీ పాదాబ్జద్వయుంబాది శంభో బ్రహ్మ
2 చ్యుతాద్భిఃకృత పయదచ్చాః నం చతువ్వర్గఫల
3 ప్రాప్త కారణం॥ స్వస్తిశ్రీ శుభ శాసన శక వ
4 షంబులు ౧౨౧౨ అగు వికృత సంవత్సర కా
5 ర్తీక శుద్ధ ౧౫ గు। స్వస్తిశ్రీ మన్మహామండలే
6 శ్వర కాకతియ్య కుమార రుద్రదేవ మహారా
7 జులు పృథివి రాజ్యము చేయుచుండంగా
8 ను స్వస్తిశ్రీ మన్మహామండలేశ్వర అత్తలూరి
9 పురవరాధీశ్వర యదువంశోద్భవ కులతిలక క్ష

10 వడి దీవ పరాంగ నాదూర హయవత్సరాజ ఆ
11 ది మునీశ్వర ఉసియల్లదాత బల్లరెగండ బంధు
12 జనాశ్రయ సుజన మనోహ్లాది యకమల మా
13 ర్తాండ క్షత్రియ పవిత్ర తిమిర ఉర పోషణ మనుజ
14 ప్రాకార జోద్దంక బధు వజపిదంక రుద్రణరుదు భయ
15 ంకర బిరుద బ్రహ్మరాక్షస భుజబల భీమ ముల్లో
16 కర గండమార్తాండ ముకుంద నందన కుమార సంఘా
17 ణ్మాది శిష్టజన సంగ్రహ చాతుర్య్వా పరాయణ
18 రట్టర మనువరాజ భూరిశ్రవ వటక ప్రాకార కా
19 ముకపల్ల కొలిపాక గొవ కాంత త్రినేత్ర హరీత
20 గోత్ర శ్రీ సోమనాథదేవ దివ్యశ్రీ పాదపద్మారా
21 ధక పరబల సాధక నామాది ప్రశస్తి సైతులైన శ్రీ
22 మన్మహా మండలేశ్వర పెండ్లికొడుకు మల్దేవ మహా
23 రాజుల తండ్రి భీమదేవ మహారాజులు పాతబ్లపాటి మూ
24 ల స్థానము శ్రీ సోమనాథదేవర అన్నేశ్వర దేవర
25 కామరేశ్వర దేవరలకు అంగరంగ భోగాలకు పె
26 ట్టిన ప్రిత్తులు అన్నెలకాల్వ రె ౧॥ క్షాత్రపెదిమడి రె॥॥వె
27 లివొలము రాచపొలాన దేవరాయ ముఖ ౧కి ఒ౧ రె
28 ఖను బ్రాహ్మణచన్‌లు కాండున్ను తేమద్ది చిన్నము నీ
29 రునేల కార్తీన్క వైశాఖాలు రెంరెకం బ్రాహ్మణ చే
30 లు కాయాదు గొతరెంకి ఒ౧ కోమటివారు అంద
31 చింనము గానుగున చింనము ఒక గానుగు సుంకము
32 దీపాలకు గొల్లవారు ఇంద చింనము సాలెవారు మగ్గా
33 న చింన ము నలుపై మి ఇందచింనము శ్రీ మంగి
34 లెలు మూండుదాడ్లవారూ సుమగించిం నాలు కుం
35 మల వారు ఇందె చింనము అడ్డ
36 గు పట్టెలు వారు మగాడుపాడ్ల వారూను ముయ్యడ్డ
37 గు తూము నాయగాంఢ్రు రెండు సింనాలు కరణము
38 చింనము ఇక్రమానం పెట్టువారము అటపూర్వ్వా నను
39 అనాదిప్రిత్తులు పాంతబ్లపాటను పెలిపొలముకు
40 కుంటలో ఖ ౧న ౧౦.
41 ప్ప ఖ౧న ౧౦ పెలుమ గుడి న౧౦ జేనకాత్రట వెమెదను
42 ఖ౧న౧ పాడుంజేను ఖ ౧ తాడి తోంటను పూపుందోం
43 ట సంకదేవ
44 ఖ ౧ ప్రాంత చెఱువున మారెదు తిప్పరె ౧ అటరెట్ట
45 రె౧ గుడిముందటరెం నంకదేవరె ౧ ఇందుల చె
46 ఱువు నాడుందేమ రెం రెం విదియవాంయం రె౧౨వ
47 రెం కాట కొండలకాల్వ
48 వద చెఱువు నరె ౧ అంపరకాన ప్రిత్తులు

రెండవప్రక్క

1 అంతుకండను గ్రద్ద దెఱచేను ఖ౧ పెద చెఱ్వు
2 వెనక క ౧ నెంమికంటను బండతూప్పుణాన ఖ౧
3 భవు ఉ చెఱ్వున రెం। గడికుంటను భుండేలదేవి
4 ంతకదను ఖ౧ చింతల చెఱువున రెం కందగట్ల
5 ను పులుగుడుచేను ఖ౧ మాదిరి కాలువను
6 బంగ రెం ఆరికాలువను చేల నడుమ రెం
7 పు వంల్ల వాలు పడుమట ఖ౧సావేణి చెఱ్వ
8 బండకలుమ అలను తూప్పుణాన ఖ౧ పడమటి చెఱ్వ
9 రెం పసునూరను ఖ౧ ఆ చెఱ్వున రెం పసుండల
10 చెఱ్వ రె॥ ప్రాలుమదను ఖ౧ పడుమటి చెఱ్వున
11 రెం చంద్రుపట్ల ఖ౧ దక్షిణము చెఱ్వ రెం విరియా
12 ల ఖ౧ పెదచెఱ్వ రెం నూంతులకంట రెం ఏపూ
13 రను పొలకురేగద ఖ౧ ఇందు ఖ౧ తాడ్గన ౧౦
14 ముప్పల్దేవి చెఱ్వవాంగు పడుమట రె ౩ నిడుం....
15 ను రె ౧ ఎత్తుగాల్వరె ౧ రేగడ రెం॥ ఏటికాల్వ రె॥
16 అల కొఱ్వదుప్పకుంట రెం౦ మెట్టకాదుం
17 బల్లి ఖ౧ పడి కాల్వ రెం కొత్తపల్లి ఖ౧ పడుమటి చెఱ్వ
18 బూరకొచెల్ల ఖ౧రెం ఆపెనుంబాట రామ సము
19 ద్రాన రె॥ కుడికుడియ కోమటి చెఱ్వరె ౧ పిల్లలమ
20 ఱ్ఱి సబ్బసముద్రాన రెం పహిండిపల్లిని తొండలఱు
21 ఖ౧ గణపయ చెఱ్వున నదిమికాల్వ రె౧ పెనుం
22 ంగొండ వాడల ఖ౧ బేరిచెఱ్వ రెం అడవి వామర
23 చెఱ్వ రెం కొడంజెఱ్వ తలంకిల్ల తెయ్యాన ఖ౧ఱ
24 రి ఉత్తరాన ఖ౧ నామసము ద్రాన పడంతము
25 చేను రెం గరివిచేను రెం గోపతివి కడ్లాల వెనక
26 ఖ౧ దామరచెఱ్వ మూల రెం మునదరి చెఱ్వ
27 మూలమును మండచేను ఖ౧ చెఱ్వు వె ౧ గవా

28 తను రెం బూర్గుగడ్డను ఖ౨ పెద్దచెఱ్ను రె౨ శౌ
29 నుంగోటను ఖ౨పెద్దచెఱ్వున రె౨ వెరసి స్వ
30 స్థాన పర స్థానాల ప్రవృత్తులు వెలివొలము ఖ .౪౦
31 న౩ సీర్నెల కార్తీక వైశాఖాలు చెల్లేధిరె ౭౩॥
32 వల్నాను అంగ భోగానకు వెలివొలంఖ ౨౦
33 న ౩ సీర్నెల రె౪౭ దేవరాయము లోన సగ
34 ము ఇంతటి వల్నాను సోమనాథ దేవరకు
35 పడ్లిరాలు౨కి ఓగిరము బియ్యమూను=అ
36 ంనేశ్వర దేవరపడ్ల రం ౧కి చిన 1- కామరేశ్వర
37 ర దేవరపడ్ల రం ౧కి చిన 1- వెరసి అవసరము
38 ఒక్కటికి చేన ౧। లెక్క మూండు అవసరాలకు
39 న ౩॥। పిండివంటకు న। గుండయ బ్రంమ
40 యం గారికి న। అట వెరసినిత్యా న౪। లెఖ్ఖనె
41 ।౧ ఖ౬న ౭॥ లెఖ్ఖ ఎండాది పడి ఖ ౭౬న౧ంకూ
42 దలి ప్రాంత చెఱ్వు ఆఱుకట్ట రెంవరెడతి
43 ప్పరె ౧ అమగునరె । వడ్డగి చేను త్రై అంద

మూడవప్రక్క

1 యత్రంమయంగా
2 రికిరె। ఓగిరమునకు రె। పెరుగునకూ ఉదయ
3 మజ్జనము పాలకూ మాడలు ౪ం ఓగిరము ద
4 బ్బునకు చేను ఖ౩ రూకలు ౨ దేవత తోంటలో
5 వారికి డాలూమా ఖడ్డువ త్రజేడి తోంటలో
6 తూప్పు౯ మామిడ్లు ౨ అమట్టిరి వారి తోంటలోనై
7 బుతిమామిడ్లు ౨ ఇంతవట్టు ఓగిరము అవసరా
8 లకె దేవర చెఱ్వున విడాలకు రె॥ శ్రీ గంధానకు
9 రె॥ గుగ్గిలానకు రె। అంగవస్త్రాలకూ గొసగు
10 లకూ ని గడ్డకూరె। పదినాలుగు అఖండ దీ
11 పాల లెఖ్ఖను మూండు గుడ్లా ను ౧౨ కొల్పు
12 దీపం ౧వెరసి ౧౩కి దీప ౧కి నూనె మూండు సే
13 ల౯ల లెఖ నిత్య న॥- సో ౩నెలం౧కి న ౧౮। త౧లెఖ్ఖన
14 గండాదీపనూనె ఖ ౧ంన ౧న 1=క ఎ దీమ
15 ద తాడివనము గుడిముందట రె॥। అమగున
16 ౨౧ కాప్రెడిమ్మి రె॥। దీపగంటానకుగు ఉఉత్త
17 రావ రె। పువ్వులు గోసేవారికి పడియ దోలా
8 నరె॥ గుడ్లు తిరిగి రాకసవు ద్రా వానులలు
9 కానురిరి యా ముగ్గు పెట్టేవారికి దేవర చె
0 ఱ్వన రె౯తంచమహా పక్వాలకూ గడ్డి కండి
21 చేతల చెఱ్వున రె॥ అంద సోమవారపు ఓ
22 గిరాలకు రె॥ దేవరాయము వల్నతొండెల
23 కునిడ్లు ఎత్తేవారికి ।౬ మాడలు నిడ్లు గట్టేవా
24 రికి ।౧౬ ౨ కరణానకు జీతములాఖు మా
25 డలు ఇంతది మిందం గంత వట్టు లధికపడ్లు
26 రికి ।౧౬౨ క కరణానకు జీతము ఆఖు మా
27 డలు ఇంతటి మీందం గలంత వట్టు అధికపడ్లు
28 రంగభోగానకు వెలివొల ముఖ ౨ంసీరు నే
29 ల రె౪౦॥। వల్నం మద్దెలకాంద్రు ఇద్దఱకూ ఈ
30 ందుల చెఱ్న నిడుంచెను రెం ఆవఱకానికి కాల
31 శానికి పడియ పౌలాన రె ౧। వాపెకాంద్రు
32 ఇద్దఱకూ మోగరతకూ కొడకొండల కాల్వ
33 రె౨ పాత్రలిద్దఱకు అంనోజు కాల్వరె ౧॥
34 పీరిక దేవరచెఱ్న రె॥ సావానికి అందరె ౧ సూ
35 యాణతలు నల్గురకూ ఆతుకూర పెద్ద
36 చెఱ్ను రె౭నెంమి కంట చవుట చఱ్వునరె౧। వేలుపు వ
37 ల్నవాటను సాహిణి చెఱ్వున రె౨ బండ్లు ఇద్ద-
38 కం దేవరాయమువల్న ఎనిమిది మాడలు
39 ఇంతటి మీందం గలంతవట్నకు భోగమువారిని
40 ఎలిది ఇంతవట్టు అరయను వీరముట్టు నలుగు
41 రకూ నేలకు ఖ౪ లెక్క ఎండాదికి ఖ ౪౮ కెరె-
42 దేవర చేలుడుని కాంపులను కొలవంగ వా
43 నీవను ఉన్నపట్టలేడు రాజ్యాలవారు దేవర శ్రీ
44 తుల వల్నను కానికగట్నమని పుట్టించిన వా
45 రు నాయక నరకానం బడువారు.

వాస్తవ దృక్పథం!

*యుగయుగాల నుంచి
అర్థంకాని మానవ కథనం
నిన్న మొన్నటి డార్విజమ్ చెబుతుందా?
చెప్పినంత మాత్రాన అందులో నిజం వచ్చి చేరుతుందా?
డి.యన్.ఏ. యే జీవరహస్య కీలకమై కూచొంటుందా?
ఎంజైమ్‌లని పేరు పెట్టినంతమాత్రాన చైతన్యశక్తి
దాగిఉంటుందా?
భ్రమరకీటక న్యాయానికి
ఎప్పుడూ శృంగభంగమే! ఇది తిరుగులేని మాట!!
పచ్చకామెర్ల కళ్ళకి
లోకమంతా పచ్చగానే కనిపిస్తుంది! ఇది అందరికీ
తెలిసిన వాస్తవం!!

అసలు ఈ ప్రకృతి
ఒక మ్యాథమ్యాటికల్ ఎక్స్ లాంటిది!
అడ్డంగా ఎనిమిది అంకెను గీచి
అనంతమని కూడ చెప్పే శక్తి ఉన్నటువంటిది!
అలాగే మానవ ప్రవృత్తి కూడా మరో ఎక్స్ లాంటిది
అయితే ఆ ఎనిమిదికీ యీ ఎనిమిదికీ చాలా తేడా ఉంది
గణితాలు గుణాంకాలు ఏం చెబుతాయి....
అన్నీ ఊహలే! కల్పనలే!!
మూలమే ఎంపిరికల్ అయిపోతే....
సిద్ధాంతం ఫార్మాలిటీ అయిపోతుంది! అదంతే!!
ఒక ఎక్స్ పరమాత్మ
ఇంకో ఎక్స్ ప్రత్యగాత్మ
రెండింటికీ అభేదముంది! విభేదముంది!
రెండింటికీ తారతమ్యముంది! సామ్యముంది!
అపార రససాగర మొకటి
అణుమాత్ర పాదరస బిందువొకటి!
మూల బృందావనం మంత్రాలయంగా
మృత్తికా బృందావనం మరో ఆలయంగా ఉన్నట్లు!
మానవజాతిగా
మానవునిగా ఉన్నట్లు!
అసలు మనిషి తెరవెనుక ఉండి
కంప్యూటర్ మనుషులను నడుపుతున్నట్లు!
వాస్తవం నాకే తెలుసునని
వాదోపవాదాలు లేవదీసి బ్రహ్మరథం పడితే
గుదిబండై కూచొంటుంది!
ముందర కాళ్లకు బంధంవేసి బొక్కబోర్ల పడవేస్తుంది!
మనిషి నిమిత్తమాత్రుడు
అతి సామాన్యుడు
కాలం కరుణిస్తే మహాత్ముడౌతాడు
విధి అనుకూలిస్తే మహితాత్ముడౌతాడు
ఈ కాలం విధి దైవం అదృష్టం నసీబ్ కిస్మత్
అన్నీ కూడ ఎక్స్‌కు రూపాంతరాలే!
మనిషి పరిధిలో వీటి శాతం ఎందుకు మారుతూ
ఉంటుందో
ఎట్లా మారుతుందో ఎవరు మారుస్తారో అంతా
సైకోట్రానిక్స్!
ఈ లెక్కన ఎక్స్ ఎక్స్‌కీ తేడా ఉంటుంది
పూర్తి వివరాలు స్టాటిస్టిక్స్ చెప్పలేక నిశ్శబ్దంగా
ఉండిపోతుంది
వ్యక్తిగతమైన ఒక చిన్న ప్యారామీటర్‌ను
అర్థం చేసుకోడానికి అవస్థ పడుతున్న సైన్స్
సంస్థాగతమైన ఒక మాస్ ఫ్యాక్టర్‌ను
ఎలా అర్థం చేసుకొంటుందని?
హ్యూమన్ సెన్స్‌కే కొలమానాలు దొరకట్లేదు
దొర్లు దండాలు పెడుతోంది టెక్నాలజీ
ఇక సూపర్ హ్యూమన్ పవర్సు గురించి ఆరా తీస్తుందని
ఎందుకయ్యా ఆశపడ్డం?
నిజమే, హోప్ ఉండాల్సిందే!
గోల్ చేరుకోవలసిందే!
ఆకాశానికి నిచ్చెనలు వేసా?

సముద్రానికి మొలతాడు కట్టా?
కార్యకారణ మీమాంస
క్లైయిమాక్స లేని సస్పెన్స్ లాంటిది!
క్రియా కార్మికతత్త్వం
అంత త్వరగా బోధపడని క్వాంటమ్ మెకానిక్స్‌లాంటిది!
అయిన్‌స్టీన్ బుర్రలకు కూడ అందనివవి!
పురాణ పురుషుడు పికాసోకు కూడ అర్థంకాని విచిత్ర
చిత్రాలవి!

బహిర్వ్యక్తిని గురించి
శాస్త్రం గిరులు గీస్తుంది కాని
అంతర్వ్యక్తిని గురించి అసలు మాట్లాడదు!
ఫిజియాలజీని గురించి
లెక్చర్లు దంచే బైండు పుస్తకాలు
సైకాలజీని గురించి మారు మాట్లాడవు!
మనిషే మనిషికి అర్థం కావడంలేదు
ఇక మనిషికి తెలియని మనిషి పుట్టుక ఎప్పుడో అతనికి
తెలుస్తుందా!

అసలు ఆత్మ మనసు అనేవి ఉన్నాయో లేవో
తెలియడం లేదు

అలాంటి స్థితిలో "సర్వజ్ఞుండను" నేనని అనుకోవడం
ఏమాత్రమైనా చెల్లుందా?

వేదం తత్త్వం
శాస్త్రం చరిత్ర దేసకోసం?,
తర్కం వాదం
గణితం ఈ కవిత్వం అంతా ఎందుకోసం?
మానవ సంస్కృతిని ఉద్దీపింప జేయాలనే!
మనిషిని ఉన్నతుణ్ణి చేయాలనే!
తెలియందొకటుందని తెలుసుకోడానికే!
తెలియజెప్పడానికే !
అదేనాటికీ తెలిసిరాదని తెలుసుకోడానికే!
తెలివిగా నడచుకోవడానికే!!
తెలిసిరాని ఆ పనితనాన్ని గుర్తించి
తెలివిగా మన నిమిత్తమాత్రాన్ని గుర్తించి

నిబ్బరంగా పయనించాలి!
నిండుగ సాగిపోవాలి!
అదే రాచబాట!
వేదాల వెల్లివిరిసిన పూదోట!!
అదే తరతరాల తల్లి వేరు!
యుగయుగాల గంగాధార!! *

—డాక్టర్ గుమ్మనూరు రమేష్‌బాబు

నీవు గాక మరెవ్వరు?

సమాజ శ్రేయస్సుకు నడుం బిగించి
అభ్యుదయ కవిత్వానికి ఆధారమై
లోకం బాధను నీది చేసికొని
నాకం చేరినది నీవుకాక మరెవ్వరు?

ఛందస్సుల విష పరిష్వంగాన్ని వీడి
ఛాందసుల నమ్మకాలను వమ్ముచేసి
సాహిత్యాన్ని సామాన్యుని పరంజేసి
సార్థకత సాధించింది నీవుగాక మరెవ్వరు?

శ్రమజీవుల సౌఖ్యం కోసం
కలం పట్టి గళం విప్పి
ఇలాతలంలో కవులకు ఇలవేల్పువై
యుగకవివై భాసించింది నీవుగాక మరెవ్వరు

శ్రీ పాటిబండ్ల శ్రీమన్నారాయణ

కన్నడ మూలము : మహాకవి డా॥ కె. వి. పుట్టప్ప

ఆంధ్రీకరణము : శ్రీ శంకరగంటి రంగాచార్యులు

అంగుళము నకు గళము

(గతసంచిక తరువాయి)

(ప ద్య నా ట క ము)

ద్వితీయ దృశ్యము

కర్మము

(తరంగ తరంగములుగా వ్యాపించిన పర్వతారణ్యములు, కఠినముగా, ఎత్తుగా గిరిపంక్తి అవిశ్రాంతమన్నట్లు దిగంతగామియైనది. పూర్వాహ్ణపు తరుణాతపము తరంగిత హరితవర్ణ పర్ణార్ణవము మీద పరచుకొన్నది - హిమబిందువులు ధరించిన వృక్షశేఖర పల్లవరాశి తళతళ లాడునట్లు. అడవి దట్టముగా పెరిగి ముండ్లును, తీగలును, పొదగా అల్లుకొన్న ఒక కందర ప్రాంతమున అశ్వత్థామ ప్రవేశించును. ఏకలవ్యుని వలెనే యువకుడు. మల్లగోచి బిగించి, వేటగాని వేషమున నున్నాడు. చేత విల్లు; వెన్నున అమ్ములపొది; గుడ్డల కంటుకొన్న ముండ్లను విడిపించుకొనుచు, నడచివచ్చును. అతని నడుమువరకును మిక్కిలిగా పెరిగినది అడవి. చెట్ల చీకటిలో నడుమ నడుమ దూరివచ్చిన ఎండముక్కలు అతని శరీరముమీద పడినప్పుడంతయు ఆయుధకాంతి మెరయును.)

అశ్వత్థామ - (నిలిచి చుట్టును చూపులు సారించి)

ఔబ్బ! ఎటువంటి కీకారణ్య మియ్యది!
దారి కనరాని ఈ పుండ్ల అడవిని దూరి
దూరి, పేలికలయ్యె నా బట్టలన్నియును. (పైకి చూచి)
ఏమి చెట్లో ఇవ్వి, వ్యోమమ్ము చుంబించు;
భీమవృక్షములు కద! (వెనుదిరిగి చూచి పిలుచును)
ఆర్య, ఈవైపు, ఈవైపు; ఎడమకు తిరుగుడు;
ఆ వేత్రపుంజంపు దక్షిణమ్మునకు.
అటుకాదు, అటుకాదు, అవైపు పల్లమ్ము.
హా! అవును! అవును! అదె దారి! రారండి!

(అవైపు చూచుచు నిరీక్షించును. ఆచార్య ద్రోణుడు పొదల నడుమ దూరి దూరి ప్రవేశించును. సమున్నత విగ్రహము. చింతా గంభీరమగు ముఖముద్ర. శిరోవేష్టనము లోపలినుండి వెంట్రుకలు వ్రేలాడుచున్నవి కవచము తొడిగికొన్నాడు. మల్లగోచి బిగించినాడు. ఉత్తరీయము కొంత అస్తవ్యస్తమై వచ్చిన దారికి సాక్షిగా నున్నది. బ్రాహ్మణ్యపు చిహ్నములతో తేజస్విగా అగుపించును.)

ద్రోణుడు - (నిలబడి చుట్టును చూపు పరపి, కొడుకువైపు పులక నవ్వు మొగముతో చూచి)

దారి లేనెడ దారి అరయుచుంటివి, వత్స!
పుట్టు గుణమది నీకు నర చరణ సంచార
చిహ్నమేదియు నీకు అగుపడదు ఇచ్చోట!

(పైకి చూసి, కిలకిల నవ్వి)

ఎండయును అడుగునిడ భయపడుచునున్నదీ
కానన ప్రదేశంపు కారుచీకటిదైన
కంటకమయంపు మానసపు కోపమ్మునకు
వెనుకాడి. ఇవి యేటి వెదురు పొద లబ్బబ్బ!
ఏముగ్ర కంటకపు వేత్రపుంజమ్ములు!
ఇవియేమి దూలగొండి వనమ్ము లయ్యయ్యో!
నా కాళ్ళు వాచుకొనుచున్నయవి ఘోరముగ!
దారి నీరపు చల్లదనమున జలూకములు-
పట్టి పీల్చును - నెత్రు తిండ్లు!
ఎట్టులును మంచి దారికి లాగికొని వచ్చితివి నీవు నన్ను!

(వంగి కాలినుండి దేనినో తీసి విసరుచున్నట్లు నటించి, లేచి)

పరివారమును పిలుచుకొని వత్తమన్నచో
వద్దంచు వారి నా కొండకడ వదలితివి!
ఇపుడు దారిని తప్పి,
దారి లేనెడ దారి నరయుచుంటివి!

పుట్టుతోడనె వచ్చినది కాదె నీకు ఈ
వక్రమార్గానుసరణమ్ము!

అశ్వత్థామ - (ఇంచుక నగుచు)
ఆర్యా, ఇది హస్తినాపురపు టుద్యానంపు
వెలిపరిధి అనుకొంటిరా? ఇద్ది కాననము!
పరివారమును పిలిచికొని వచ్చినంత మా
త్రాన, మీ కడవి పథవేదికగ మారుటకు
సీమంత మటు దారి తీయుచుండిర వారు?
మీరిచట ఉండండి.
కాననము చుట్టినట్టి శిలాగ్రమునందు
కూరుచుండండి. మునుముందునకు పోయి,
తిన్ననగు దారి కని నే మరలి వచ్చెదను.
వేగిరము వచ్చెదను. (అడుగుపెట్టి నిలిచి)
క్రూర జంతువులుండు; ఈ కత్తి మీ వద్ద
పెట్టుకొని ఉండండి.

(కత్తిని బండమీద పెట్టును. అది శబ్దము చేయును. అడవిలో దూరి మరుగవును)

ద్రోణుడు - (ముందుకు పోయి, కత్తియున్న ఆ బండ నెత్తి
కెక్కి, కూర్చుండి, చింతామగ్నుడై నిట్టూర్చును)
ఎంత చల్లదనమ్ము కలదు ఈ కాననపు
హృదయమున! అడవియైనను వేయిరెట్లు మం
చిది కదా ఈర్ష్యాగ్ని గుండమగు మా పుడమి
కన్న! ధర్మంపు సంకటపుటొక చింతాగ్ని
లో మాడు నా ఈ మనమ్మునకు శూన్యపు
దేశమ్మె వర్షించుచుండె శాంత్యమృతమ్ము!

(కొంచెముసేపు కనులరమోడ్చి, శాంతిని అనుభవించును)

క్షత్రియ కుమారకుల కొజ్జగా నుండుటయు,
ప్రేలు మందును నూరుటయు - రెండు నొకటియే.
సోలినది నా ఉసురు ఈ కౌరవ పాండవుల
దాయాది మాత్సర్య దావాగ్నిలో వేగి-

(ఏమిటో ఆలోచించి, ఒక నిర్ణయమునకు వచ్చినట్లు)

ఈ అహంకారమే మూలమన్నింటికిని!
లేకున్న నే నేల ఆ అర్జునుని గురువునై
ద్రుపదరాజును తెచ్చి నా పదమ్ముల చెంత
పడవేయునటు చేసి, నా హృదయ గర్వ భూ
తమ్మునకు చోటిచ్చి, అతని దాక్షిణ్యంపు
పాశమ్మునకు లొంగుచుంటి? ముల్లోకాల
నిను మీరువాని లేనట్లుగా, నీకు విలు
విద్య గిరపెదనంచు బాసలాడుచునుంటి?
ఇప్పుడో పట్టినది అతనికి కీర్తి శని;
పేరు! పేరు! పేరు!
తనదొక్క పెద్ద పేరు!
ఇంకెవ్వడును తనకు ఎనలేరనెడి పేరు
తనది కావలెనంచు అతనికి పైత్యమ్ము!
ఏమహంకారమో ఈ రాజపుత్రులకు!
పేరనెడి బింకమ్ము! రక్తంపు పంకమ్ము!
సమర భూత ప్రీతి! సకల జగతికి భీతి!
పేరంట పేరు; బురద నీరు! నెత్తురు బురద
నీరు!

(జుగుప్సతో చింతామగ్నుడగును. కనులు మూసి నిట్టూర్చును. ముఖము ముడుతలు పడును. మరల కనులు తెరచి)

గర్వంపు పొట్ట పెంచునది విద్యయా? - అవిద్య.
నాశ మొనరించు నెయ్యది అహంకారమ్ము
నది విద్య - తక్కినది సర్వమ్మును అవిద్య.
విద్యయను పేరి సాకున నే నవిద్యను
పోషించు గురువుగా నైతి గద!
మరియేమి? ఆ అహంకారపుటొక వేష
మే కదా కీర్తియను పేరి ఆ పేరాస!
పేరంట పేరు? అది యేమవిద్యయొ మాకు!
ఈ జన్మమంచు ఈ పేరు;
మరు జన్మలోన మరియొక పేరు.
భరత ఖండమ్ములో నేడు నే ద్రోణుండ!
రాబోవు జన్మ నే దేశమంచే పేరొ?
రక్తంపు నీరమ్ము పారించి సాకి సం
రక్షించెదము కదా ఈ మాయపేరన్న
స్వప్నంపు వృక్షమ్ము! నేను ఆ బురద నీ
టను పొరలుచుంటి కద ఈనాడు!-
మాతృ సేవాతత్పరుడు, తండ్రి లేనట్టి
అనద పిల్లడు. అట్టి ఆ అడవి బోయ బా
లుని బొటనవ్రేల్ కోసి, ఆ రక్తపంకమున
తన కీర్తి పంకజము మెరయించవలెనంట!
పోమ్ము, నీవే మల్లయుద్ధమ్ము చేసి గెలుము;
అతనితో పోరాడి అతనినే చంపుము!

అనిన, అది ఆతనికి అవమాన కరమంట!
ఊరు పేరును లేని వ్యాధ బాలకునొకని
ద్వంద్వ యుద్ధమున కెటు పిలుచు పాపమ్ము, ఈ
పార్థివ కులాంభోధి చంద్రుండు - పార్థుండు!
(అపహాస్యపు నవ్వు విరియజేసి)
ఏమి గర్వమొ! అహంకారమున కొక కోర
కద తాను?

(కొమ్ము ధ్వని పర్వతారణ్యములు మారుమ్రోగునట్లు విని పించును. ద్రోణుడు సావధానుడై లేచి నిలుచుండును; ఆలించును)

ఏమిదీ తూర్యరావమ్ము, అనురణితమగు
అచలగహ్వర గుహాకంఠములి?
ఎచట పోయెను బాలకుడు?
దారి తప్పెనొ? లేక మాయ దారిని చనెనొ?

(కొంచెము సేపు ఊరకుండి, అరణ్య నీరవతను, నిర్జనతను, బృహత్తును మనస్సుకు హత్తుకొనునట్లు సంవీక్షించి)

ఆః నిజము భీమకాంతమ్ము ఈ కాంతార
దేశమ్ము! సింహభవ్యమ్ము; వ్యాఘ్ర మనోహ
రమ్ము! మృగసుందరము! ఫణిమహాభైరవము!
శశలలితము! విహంగ మధురమ్ము! ఏమి రు
ద్రమ్ము, రమణీయమ్ము ఈ రుద్ర కాననము!

(కొమ్ము మ్రోత, పటహ ధ్వని, భటుల జయనాదములు - కొంత కొమ్మన్న దిక్కునుండి వినవచ్చును. ద్రోణుడించుక మొగమెత్తి నిలిచి, కుతూహల వయనుడై, తదేక దృష్టితో చూచుచు నిలుచును. అశ్వత్థామ శీఘ్రగతిని ప్రవేశించును.)

వత్స, అవియేమి కాహళము మ్రోగుచునుండె?

అశ్వత్థామ - (నిట్టూర్పు నిగిడించును)
మనకు వినబడు మ్రోత ఏకలవ్యుని రక్ష
క భటులది. చాటెడిని మన రాక?

ద్రోణుడు - ఎట్లెరింగిరి వారు మన రాక.

అశ్వత్థామ - చెట్టు చెట్టును ఎక్కియుండి రాతని భటులు.
కానలో దారి వెదకుచు సాగగా నేను-
"నిలుము, ముందుకు చనకు."
అను చరచె నొక గొంతు.
వెరపునకు కాదు, వెరగునకు నిలబడి చుట్టు
చూచితిని! ఎవరు కనరాలేదు. చప్పుడుకు
చోద్యమందుచు ఒకటి రెండడుగులను వేసి,
నంతనే, మరల, "నిలు. ముందుకు చనకు నీవు.
ముందు కరిగిన నీవు పీనుగౌదువు నిజము-"
అంచాన పెట్టినది - వనకంఠ నిస్వనము.
వింటికి శరమ్ము సంధించి పోరాతగా
సిద్ధపడి నిలిచితిని. నేను నిలిచినప్రక్క
గల పెద్దచెట్టు తల వంగినటు శబ్దమ్ము
వినిపించె. కనులెత్తి కంటినొకనిని, వ్యాధ
వీరవరు. నేను చూచుచునుండ, తరుశిరము
నుండి ఒక క్షణములో దిగె. క్రింది కెగిరె. నా
వద్ద కరుదెంచె. "ఎవ్వరు నీవు? మిత్రుడవొ?
శత్రుడవొ?" అంచరచె. నగుచు ప్రత్యుత్తరము
నిచ్చితిని. "శత్రులకు శత్రుడను, మిత్రులకు
మిత్రుడను!" ఆనందవీచి నొకదాని తన
మొగములో తొణకించి ప్రశ్నించెః
"ఏన్గూరి నుండి అరుదెంచు విలుగురువులా?"
మొదట ఎఱుగకపోయినను పిదప ఎఱిగితిని.
ఏన్గూరు మన హస్తినాపురికి ఆటవిక
జనులు పెట్టిన పేరటంచు!
"నే వారిప్రక్కవాడని చెప్పితిని అతనికి.
కైమోడ్చి ఇట్లనెను: "రండి, సరియగు దారి
చూపింతు. మారాజు ఆజ్ఞయైనది మాకు
మీ పదమ్ములు కన్నయంతనే తోడ్తేర."
నేనంటి: విల్లొజ్జ లిటలేరు. క్రింద గల
కనుమలో గలరు. కాననమందు దారి త
ప్పెను మాకు. నే వారి నొకచోట కూర్చుండ
బెట్టి, దారిని వెదకుటకు సాగి వచ్చితిని."
వెంటనే మొలనున్న కాహళిని నోటవిడి
ఊదె కానన మదర.
ప్రసవించినవొ వృక్షవృక్షంపు గర్భములు
అనునట్లు పుట్టి, పరుగిడి వచ్చె నచ్చటకు
వ్యాధభట బృందములు. ఆవతిచ్చె నతండు
ఒక్క పల్యంకికను కొని తేర. మనల న
ద్దానిలో కూర్చుండబెట్టుకొని పర్వతా
గ్రమ్మునకు మోసికొని వెళ్ళుటకు. వాళ్ళుటకు
చనిరి. నే నిచ్చటికి అరుగుదెంచితి, నార్య.

ద్రోణుడు - నీవు వారలకీ ప్రవేశంపు గుర్తులను
చెప్పితివ?

అశ్వత్థామ - చెప్పితిని.

ద్రోణుడు - అట్లైన నీవింక వెనుదిరిగి పొమ్ము మన
వారు విడిసిన యెడకు. నేనొక్కడనె పోదు,

(ప్రశ్న దృష్టితో ఆశ్చర్యపడుచు నిలబడిన వానిని చూచి)
ఒక రహస్యమ్ము కల దా ఏకలవ్యుతో!

అశ్వత్థామ - (తండ్రి మొగము చూచుచు, తన కనులతో కనులు
కలుపక అటు నిటు చూచు నెపమున వంచించుచున్న
ద్రోణుని కనులలో కన్నీటి చుక్కలు కని)
ఆర్యా, మీదు రహస్యమున కేను భంగమ్ము
తేను. మీతో వచ్చినను నేను దవ్వుందు.

ద్రోణుడు - (అసహనముతో)
నాతోడ వచ్చి నీవేమి చేతువు, చెప్పు!
ఏది నడచునొ, దాని నడ్డగించెద వేమి?
నాకీవు తను రక్షకునిగ నుందువ, ఏమి?
నన్ను నే రక్షించుకొనజాలుదును, పొమ్ము!

(మొగము త్రిప్పి, కాహళి వినిపించిన దిక్కుకు చూచును)

అశ్వత్థామ - (స్వగతము) ఇదియేమి, ఆర్యునిది ఈ వర్తనమ్ము?
అప్రసన్నుండుగా నున్నాడు! ఏదియో
ఒక గుహ్యసంకటము గుండె తొలుచుచునుండె!
చెప్పనేరడు; నన్ను వంచించుచున్నాడు.
ఈ ప్రయాణమ్ము నాదేశించినప్పుడే
నాకు కలిగెను శంక! ఏదియొ అమంగళ
మ్మునకు కైకొనియె నీ కాననపు యాత్రనవి!
ఎట్లైన తెలిసికొందును, ఏది ఏమైన
తెలిసికొనకుండ మానను! (తండ్రివైపు చూచి)
ఆర్యా, మిము నేను
రక్షించుటకదెట్టి? బల్లిదుడ? రక్షించు
టకు కాదు, సేవించుటకు వత్తు మీవెంట.

ద్రోణుడు - (కొడుకువైపు చూడక, దృఢ కంఠస్వరముతో)
కైంకర్యమున కుండెనా ఏకలవ్యుండు
పొమ్ము, పద, నీవు మన విడిది గల చోటికి.

అశ్వత్థామ - ఏల కళవళమంది నట్లుంటి రో, ఆర్యా?
దేహమస్వస్థమ్మొ? (కొంత ఆగి)
లేకున్న మానసమొ?

ద్రోణుడు - వత్సా, నీకు శుభమ్ము కలుగవలెనని ఆశ
ఉన్నచో, నన్నొకనినే విడిచి, తిరిగి పో.

అశ్వత్థామ - కోపింపకుడు, ఆర్యా. మీ యాజ్ఞ మేరకే
నే పోదు. కాని నేనారించినట్టి త
ప్పేమి? అది తెలిసికొనియే వెళ్ళిపోయెదను.

ద్రోణుడు - (కొడుకును చురచుర చూచుచు)
నీదేమి తప్పు లే; దీ నాదు హృదయమున
చెలరేగినట్టి ఒక ఝంఝయే కారణము.
ఆ వ్యాధి కిప్పుడు నిర్జనతయే భేషజము;
మౌనమే పథ్యమ్ము!

అశ్వత్థామ - క్షమియింపు డార్యా, నే నితరుడను కాను కద.
ఎద్దియో గూఢశోకమ్ము మొన్నటినుండి
తొలచుచున్న యది మీ ప్రాణమూలమ్ములను!
చూచాయగా తెలిసె; తేటతెల్లము కాదు.
నిక్కమ్ము చెప్పండి. కాళ్ళబడి వేడెదను.
ఏదియొ అమంగళమ్మునకు తలపెట్టితిరి
ఈ దుర్గమారణ్య మార్గ ప్రయాణమ్ము!

ద్రోణుడు - (నిట్టూర్చి) నీవన్నదది నిక్కమైనప్పటికి కూడ..
అనివార్యమది వత్సా.

అశ్వత్థామ - (ఉద్వేగముతో) చెప్పుదేమది, ఆర్యా.
నిక్కమైనట్టులే తోచు నా సందియము:
ఆ అర్జునుండా దానికి కారణమ్ము?

ద్రోణుడు - (ఉదాసీన వాణితో, కాని దృఢముగా)
విధి కారణమ్ము! ఆహొడు ఆ అర్జునుని
చేత ఆ ద్రుపదరాజునకు అవమానమ్ము
కలిగించినందుచే ఆతనికి నేడేను
ఋణియగుచు కైకొంటి నీ హేయకార్యమ్ము!
నా అహంకారంపు టాచలమె ప్రసవించె
పార్థుని అహంకృతి క్రూరరూపపు టీర్ష్య!

అశ్వత్థామ - (ఉగ్రుడై, అక్షరములను ఒకటొకటిగా
నుచ్చరించుచు)
ఏకలవ్యుని కని అసూయ చెందినవాడొ,
ఆ నీచ హృదయుండు?

ద్రోణుడు - (నిట్టూర్చి) ద్రుపదరాజును గెల్చి,
నా గర్వమునకు బలిపెట్టినప్పటి సాంద్ర
సంతోష సమయమున, నేను నుడివితి నిట్లు:
"అర్జునా, నినుమెచ్చి ఈ బాస చేసితిని.

ముల్లోకముల యందు నీకు సరిలేనట్లు
నీకు నా విలువిద్యనెల్ల దానమ్మిత్తు!
నీ పేరు నాకాశ శిఖరముల కెత్తెదను.
అదికాక, దాని రక్తాక్షరమ్ముల తోడ
అష్టదిగ్గజ లలాటముల చెక్కించెదను,
ఆచార్య ద్రోణునికి ఇక లేడు శిష్యుండు,
విను మీరు శిష్యుండు - అను కీర్తియె కిరీట
మన నిను కిరీటి యనిపింతు!" నేనానాడు
వచియించి నట్టి దానినె గట్టిగా పట్టి
ఆ బోయ కుఱ్ఱవానిని చూచి ఈసుగొనె,
ఇష్టమే లేనట్టి నన్నూ ఈ క్షుద్రంపు
కార్య మొనరించుటకు బలవంతమున పూన్చె.

అశ్వత్థామ - (నిట్టూర్చి) ఇపుడేమి చేయుదురు ఆ బోయబాలునికి?

ద్రోణుడు - (నింగికేసి చూచుచు)
ఏమైన ఒకదాని. నా బాస నిలుచునటు.
అర్జును నసూయాగ్ని కాహుతి లభించునటు.

అశ్వత్థామ - (దృఢ ధ్వనితో) చెప్పండి, ఏమి ఒనరింతురని?
లేకున్న నేను వచ్చెదను మీ వెన్నంటి.

ద్రోణుడు - (కనలి) వచ్చి నీవేమి చేతువు?

అశ్వత్థామ - (దృఢముగా) అడ్డగించెదను అన్యాయమ్ము.

ద్రోణుడు - ద్రోణుడే అడ్డగించగలేని దానిని అ
దెట్లడ్డగించు, చెప్పుము, ద్రోణపుత్రుండు?

అశ్వత్థామ - (కుపితుడై) ఆ రాజసుతుల కూటికి కూలియై మీరు
నరక నక్రపు నోటి కిచ్చుచుంటిరి మెడను.

ద్రోణుడు - (గంభీరవాణితో, సావధానముగా)
పట్టి అన్నపు ఋణమునకు కాదురా, వత్స,
కూటి గాలము పట్టియున్నదా విధి చేయి!
గెంటుచున్నది ఎల్లరిని తనదు లీలకై.
అట్లు కాకున్నచో మనల నెటనుండియో
పిలుచుకొని వచ్చి, ఈ నృపుల సేవకుగాను
త్రోయుచుండినద, దైవేచ్ఛా స్వరూపంపు
టీమనదు కర్మపాశమ్ము! వత్సా! నీవు
ఉద్వేగ పడవలదు; దైవమొక సత్పథము
సూచించినది నాకు. ఆ దైవమును నమ్మి
కర్మమ్ము నొనరింతు, తనియునటు లర్జునుడు,
చెల్లునటు నామాట. అదికాక, ఆ ఏక
లవ్యునికి ఏదియును పెనుకీడు మూడనటు.

అశ్వత్థామ - కర్ణునికి పరశురాముడు చేసినట్లుగా....

ద్రోణుడు - ఛీ, ఛీ, అటులు కాదు, నాదు ఆలోచనము!
కాని నీవా పరశురాము నిందింపకుము.

అశ్వత్థామ - మరియేమి? స్తోత్ర మొనరింపగావలెనేమి?

ద్రోణుడు - నీవింక అర్భకుడవు; వదికాక అజ్ఞుడవు!

అశ్వత్థామ - భక్తితో సేవించినట్టి శిష్యునికి శా
పమ్మిచ్చినట్టి ఆ పరశురాముడు మహా
ప్రాజ్ఞుండు!

ద్రోణుడు - ముందు జరిగెడు దాని యోగంపు
దృష్టితో ఎఱిగి నడచెడు నతడు నిక్కము మ
హా ప్రాజ్ఞుడే నాకు!

అశ్వత్థామ - ఏమి యోగమ్మొ? మరి యేమి దృష్టియొ? నాకు
మిముబోంటి గురువరుల మార్గమె అచింత్యమ్ము!

ద్రోణుడు - వత్స! వీరుడు కైదువుల నూరవలె నిజము.
నూరినంతనె నూరినట్టి ఆ కైదువుల
నన్నిటిని - సమయంపు టౌచితిని, పాత్రంపు
టౌచితిని, హితాహితంపు టౌచితిని, మరి
భగవదిచ్ఛ నెఱుంగకయె, తూచకయె, యెడద
హత్తించుకొనకయే, మెరయు కైదువు నిశిత
కాంతికి పరవశించి, దానిని ప్రయోగింప
వలయుననె తలచుటది నిజము పిచ్చితనమ్ము.
కవిరాజు తనలోని ఉపమానముల నెల్ల
ఒక్క కావ్యమునందె, ఒక్కసారియె ప్రయో
గించుట తెలివిలేనితనము! కబ్బము చెడును
కద అట్టులొనరింప!
కైదువును నూరువానికి దాని విఱుచుటయు,
సమయమ్మునకు తగినయట్టు లద్దాని తీ
వ్రత నింత తగ్గించి, దివ్య లీలా నియమ
మున కనువు పడునట్లు చేయుటయు, ననివార్య
మైనచో ఆ కైదువును ముందు వచ్చునొక
రణ లీల కోసమ్ము ఒరపెట్టి, ప్రక్కకిడు
టయు తెలియవలె, వత్స. (ఇద్దరును కొంతసేపు
మౌనముగా నిలుతురు) చింతింపకుము, వత్స.
నీ మిత్రవరుని కా ఏకలవ్యుని కేదియు
పెనుకీడు మూడని విధాన నేనా సవ్య
సాచి కిచ్చిన యట్టి వాగ్దానమును తీర్చి,

వత్తు. నీవిక పొమ్ము మన విడిది; కీవు నా
తోడ వచ్చిన, వినుము, రెట్టించు నిక్కమ్ము
నా ధర్మ సంకటము!

అశ్వత్థామ - అర్జునుని కిచ్చినటు లిపుడు నాకిచ్చితిరి
వాగ్దాన, మేకలవ్యుని కేదియును కీడు
మూడనటు.

ద్రోణుడు - పెనుకీడు మూడనటు.
(జయనాదములు, కొమ్ము మ్రోత కలిసి వినవచ్చును)
వారు వచ్చెడు మునుపె నీవు వెడలుట లెస్స.
కనినాక తిరిగి చననీడు నిను ఏకలవ్యుడు,
(అశ్వత్థామ కాళ్ళీడ్చుకొనుచు పోవును)
కర్తవ్యమును చేతు; వలసినది కానిమ్ము!
సర్వజ్ఞుడును, సర్వశక్తుడును, దైవమ్ము!

(జనుల జయనాదములు సమీపించును. 'జయము నా రాజా' 'శుభము నా రాజా', 'జయహే', 'శుభహే', అన్న ఘోషలు వినిపించు దిక్కుగా నిలిచి చూచును).

(తెర పడును)

తృతీయ దృశ్యము

యజ్ఞము

(మొదటి దృశ్యము నందున్నట్లే జలపాతము, బండలు, శిలా వేదిక, ద్రోణప్రతిమ - ఇత్యాదులు. సంజె ప్రొద్దు. సూర్యుడు పశ్చిమ దిగంతమునకు అనతి దూరమునందున్నాడు. నిలువుబండల నీడలు తూరుపునకు నిడుపుగా పడినవి. ద్రోణ విగ్రహమున కెదురుగా ఆచార్య ద్రోణుడు నిలబడినాడు. అతని మెడలో అడవి పూలతో కట్టబడిన ఒక హారము వ్రేలాడుచున్నది. తన ప్రతిమను చాలసేపు తదేకముగ చూచి, గర్వమున తలనూచును. తిరిగి తలనెత్తి, దూరముగ చూచి, ఏకలవ్యుని నిరీక్షించును.)

ద్రోణుడు - ధన్యుడవు, ఏకలవ్యా, నీవు ధన్యుడవు,
నిక్కముగ. ఎందరెందరొ బాలకులను నే
కాంచితిని, విలువిద్య కరపితిని. నేకాన
శ్రద్ధలో నీ సాటివాని నిప్పటిదాక.
నా గొప్పదనము నాకును చూపితివి నీవు;
గురుకృపా మహిమమ్ము జగమునకు చాటితివి.
నాకు గురువైతి. (దూరమున ఏకలవ్యుడు వచ్చుట కని)
అదె పర్వతారణ్య చై
తన్యమ్మె రూపమ్ము దాల్చి వచ్చినయట్లు
వచ్చు నా ఏకలవ్యుడు, గాత్రశవ్యుండు!
అతడు పట్టిన చాపమది దివ్య; మాతని ఉ
పాసనా శక్తి రూపమ్ము! ఆ, అతడు
ఎంతటి వినయశాలి! నన్ను దెంతగ ఆద
రించె! అది యెంతగా మ్రొక్కి, నను పూజించె!
నా హృదయ తిమిరాంధ కూప దుష్కార్య
సంజాత పాపఘూకమ్ము ఆతని హృదయ
సరళ గౌరవదీప్తి కతి భయమ్మును చెంది
కనులు మూసెను, సిగ్గుపడి క్రుంగిపోయినటు.
ఆ నాగరక నృపకుమారుల వినయమెపుడు
ఫలవాది. నేకాన నిటువంటి నిష్కామ
యోగమును, భక్తి తాత్పర్యమును! అతని కృ
తజ్ఞతయొ, శరధివలె అమేయపరిధి! నాడు,
అతడు వచ్చిననాడు, నేనొసంగినదైన
ఏమి? స్వల్పమ్ము! ఆ స్వల్పమ్ము నుండి ఎటు
వంటి భూమమ్ము సాధించినా; డర్జునుని
ఈసు త్త ఈసుకా, దండుకు భయమ్ము హృద
యంపు కారణమైన స్థైతము సకారణము!

(ఏకలవ్యుడు ధనుర్ధారియై మొలకనగవును చిలుకుచు ప్రవేశించును. నిండిన అంబులపొది వెన్నున ఉండును.)

ఏకలవ్యుడు - (సగర్వముగా) ఆచార్య, తెచ్చితిని చాపమ్ము;
అనతిని ఇమ్మేమి చూపవలె?

ద్రోణుడు - చూపు నాకో వత్స,
కనులార కాంచెదను నీవు వర్జన చేసి
నట్టి నీ కోదండ కౌశలము?

ఏకలవ్యుడు - నీవొసగి
నట్టిదా కౌశలము. నాదెట్టులగు నార్య?

ద్రోణుడు - మనదు భక్తిని మెచ్చునట్టి ఆ సచ్చిదా
నందమె జగద్గురువు, ఏకలవ్యా, వేరు
గురువు కలడా? మనుజ గురువు, నిజము, నిమిత్త
మాత్రుండు.

ఏకలవ్యుడు - (ఆచార్యుని మెచ్చి చూచుచు)
అట్లైనచో అట్టి చిచ్ఛక్తి
ప్రవహించు పాత్రుడగు నాతడును పూజ్యుడు, ని
మిత్తమాత్రుండు నైతము-పూజ్య, చెప్పండి.
దండిగా లేకున్నచో నీరు పరుగులిడి

వచ్చునా మనము కోరిన చోటికి? ఈవాన
తిమ్మ, చూపింతు నీ నేర్పిన ధనుర్విద్య.

ద్రోణుడు - (చింతామగ్నుడై ఏమో నిర్ణయించి, పైకి చూచి)
అగుపించునేమి, ఆ గగన విహగము నీకు?

ఏకలవ్యుడు - (తదేకముగా చూచి) మేఘాల వెనుకగా మరుగయ్యెనా చుక్క!

ద్రోణుడు - మరుగైన నేమి కనులకు? చెవికి మరుగ, ఆ
వినవచ్చు నిస్వనము?

ఏకలవ్యుడు - (విని) ఆః! ఎంత మధురమ్ము!
అది చాతకమ్ము నిక్కమ్ము. బాల్యమునుండి
ఆ నిస్వనమ్ము నెన్నియొసార్లు విన్నాను.
అయ్యతో పాటేను తప్పటడుగులువైచి
కొండకొమ్ముల తిరుగువేళలందున తనువు
పులకింప విన్నాను. ఇంకెన్నియోమార్లు
దానికి ప్రతిధ్వనిని చేయునట్టులు పిలిచి,
పిలిచి, బలు ఎగతాళి చేసినా నద్దాని.
కాని అలింతు నెపుడదియె మొదలన్నట్లు!

ద్రోణుడు - (నింగివైపు చూచుచు)
బాణప్రయోగమ్ము చేసి కెడపుము దాని.

ఏకలవ్యుడు - (అదిరిపడి వెనుకంజ వేసి)
కాదు కాదాచార్య! కాదు కాదాచార్య!!

ద్రోణుడు - కనిపించకున్ననేమి? వినిపించు కద కూత.
శబ్దవేధిని ఎఱుగుదువు కదా, చూతమ్ము.

ఏకలవ్యుడు - ఇదియేమిటాచార్య? మీరు తెలియని వారి
వలె పలుకుచున్నారు?

ద్రోణుడు - (చాటుగా నవ్వుచు) చూతమ్ము నీదు వి
ద్యా శక్తి, శరము సంధింపుమోయీ, శిష్య.

ఏకలవ్యుడు - అపరాధమే లేని ఆ సాధు విహగమును
చంపుటకు కాదు, ఆచార్య, నాకావిద్య
మీ రొసంగినది. కోపించుకొను మంత్రాధి
దైవతము. అదిగాక, దివ్య విద్యాబలము
తో పాపకార్యమ్ము నొనరింప ధర్మ దే
వత ఋతచ్యుతుడనగు నను కాంచి ఉగ్ర రూ
పమ్ము ధరియించు. అంతియేకాక, నా కాత్మ
హాని యొదవుట వలన సర్వనాశమ్మగును.
తమకదంతయు తెలియు, కాని నా కిది నేడు
మీరు పెట్టు పరీక్ష కాద, ఓ గురుదేవ?

ద్రోణుడు - (తటాలున ముందరికి వచ్చి, ఏకలవ్యుని ఆలింగించుకొని)
పుణ్యవంతుడ వీవు ఓ ఏకలవ్య!
బ్రదికితివి,
నీవు బ్రదికి నన్ను కూడ బ్రదికించితివి!-
నీకు కాదు పరీక్ష; నాకు నైతము సుమ్ము!
వత్స, నీకెటు తెలియు నేనెదుర్కొనుచున్న
ఆ పరీక్షను? దాని నెట్లు చెప్పుదు నీకు? (నిట్టూర్చును)

ఏకలవ్యుడు - గురువు కింకేదియొ పరీక్ష? తన శిష్య
నభ్యుదయమే కదా?

ద్రోణుడు - శిష్యులిద్దరు తమలోన పోరాడిన?
ఒకని ఉన్నతికి మరియొక డీసు చెందిన?

ఏకలవ్యుడు - ఛీ! ఈసె నీచమ్ము! అదికాక ఒక గురువు
కిద్దరును శిష్యులన వారలు సహోదరులు.
సోదరుడు సోదరుని ఉన్నతికి పొంగవలె;-
అతని ఉన్నతి ఇతని ఉన్నతియె కాదేమి?
అతని బలమితని బలమును కాద ఏమి?
అతని అభ్యుదయమది ఇతనిదియు కాదేమి?

ద్రోణుడు - అటువంటి శిష్య బడసిన గురువు సుకృతి కద!
అట్టి సుకృతము నాకు లేకపోయినదయ్య!

(నిట్టూర్చి అంతఃసంకటమును ప్రకటించును)

ఏకలవ్యుడు - ఆచార్య నిటువంటి సంకటమ్మున కేను
కారణము కాకుండుదును గాక.

ద్రోణుడు - (అధోముఖుడై) కాదీవు; నీవలన నొదవెనా కారణము!

ఏకలవ్యుడు - ఆచార్య, నీదు కృప:
నా యెదదలో నింతకూడ తావే లేదు
అటువంటి హేయంపు టీసునకు.

ద్రోణుడు - ఎఱుగుదును, వత్స; అందులకొఅకె ఈ బాధ.

ఏకలవ్యుడు - దాని పరిహారమ్ము నా యధీనమ్ములో
నున్నచో, నీ పాద సన్నిధిని నాదు స
ర్వస్వమ్మును సమర్పణము సేతు, గురుదేవ.
అదె కాక....

ద్రోణుడు - నీ యధీనమ్ములో నున్నయది. కాని....

(మాటలు పూర్తిచేయక ఊరక దూరగత దృష్టియై నిలుచును)

ఏకలవ్యుడు - (దృఢవాణితో) నాదు సర్వస్వమ్ము నీ యడుగు
అందిడితి.
ఏదియో నీ కోర్కి, ఆనతిమ్మాచార్య.

ద్రోణుడు - (కోపించుకొని, ఏకలవ్యుని కని)
కటికవానిని వెంబడించు గొఱ్ఱియవోలె
నడువకుము, ఓ ఏకలవ్య.

ఏకలవ్యుడు - (నవ్వుచు) కటికవాడవు నీవు కావు, గొఱ్ఱను నేను
కాను, ఓ గురుదేవ.

ద్రోణుడు - (తనపై తాను కోపగించుకొని)
నీవు గొఱ్ఱెవో, కావో? నేను నిక్కమ్ముగా
కటికవాడను! నన్ను నమ్మియుండిన నీదు
కుత్తుకను ఉత్తరించెడి క్రూరకార్యమ్ము
చేపట్టి ఇచ్చటికి వచ్చితిని.

ఏకలవ్యుడు - ఆ బాధ్యత అదేమిటో, నీడి, గురుదేవ.
నేను సిద్ధమ్ము నీవిడిన బరువును మోవ!

ద్రోణుడు - ఆనాడు నీవు ఆ పాండు పుత్రునికి
శబ్దవేధీ మహావిద్యను ప్రదర్శించి,
గురి చేసితివి నన్ను ఈ ధర్మ సంకట
మ్మునకు.

ఏకలవ్యుడు - అసూయను చెందెనా నన్ను గాంచి ఆ
క్షత్రియోత్తముడు?

ద్రోణుడు - నేనొక్క సందర్భమున
అతని కిచ్చినమాట తప్పయ్యె నీవల్ల!

ఏకలవ్యుడు - (బెదరి) నేనెరుగ నాచార్య అటువంటి పాపమ్ము.

ద్రోణుడు - నీవెరుగవైన నాకైనయది వాగ్దాన
భంగమ్ము.

ఏకలవ్యుడు - ఏమి వాగ్దానమ్ము? ఎట్లయ్యె భంగమ్ము?
ఆనతిండాచార్య. అందులకు పరిహార
మున్న పరిహారమ్ము; లేకున్న ప్రాచితము!

ద్రోణుడు - ముల్లోకములయందు నీకు సరిలేనట్లు
నీకు నే విలువిద్య నేర్పెదను అన్నయది
అర్జునుని కేనిచ్చినట్టి వాగ్దానమ్ము.
నేనె గురువని నాకు శిష్యత్వమును ఒప్పి
నీవర్జునుం డసూయాగ్రస్తుడగునట్లు
నీదు విలువిద్యను ప్రదర్శింప, నీవల్ల
సంభవించెను నాదు వాగ్దానభంగమ్ము.
నేనిచ్చినట్టి వాగ్దానమ్మునకు భంగ
మేర్పడని విధముగా, ముల్లోకములయందు
అర్జునుని అద్వితీయత నిలుచునట్లుగా,
నీవించుకంత శక్తిని త్యాగమొనరించు
టయె దాని కుచితమగు పరిహార; మేను కో
రిన దాని నీవు గురుదక్షిణగ భావించి,
నా కొసంగుటయె ప్రాయశ్చిత్త మందులకు!
నోరు విప్పి వచించు నీ క్లేశమును నేను
తప్పించుకొన, పరీక్షించు నెపమున, నిన్ను,
నీ కానతిచ్చితిని ఆకాశమున విహా
రము చేయుచుండిన విహంగమ్ము, బాణమ్ము
సంధించి గురిపెట్టి కొట్టి చంపుమటంచు.
నీవేదయైన అంగీకారమును చూపి,
ఏమారి, విద్యను ప్రదర్శించు గర్వమున
ధర్మమును విడనాడి తప్పటడుగును వేసి,
యున్నచో, సులభముగ నా యాశ నాకు తీ
రుచునుండె. ఆ కైవమ్మునకు నీవు చి
క్కుత, నన్ను కూడ కితవత్వమ్ము గురికాక
కాపాడి, బ్రోచితివి.

ఏకలవ్యుడు - ముందు నాకేది దారి?
ఆనతిండార్యం ఇచ్చిన గురువు కిచ్చుటది
త్యాగమా? పరమ సంపద అదియె, పురుషార్థ
సాధనము! నీవద్ద నేర్చి తధ్యాత్మమ్ము.
పుచ్చుకొనుటంతయును ఇచ్చుటకె కద, అర్ఘ్య-
పూర్ణమ్ము నీక పడసెద మెట్లు పూర్ణమ్ము?
బలి యేమి వలయు నా దక్షిణను చెప్పు, విడ
నాడి దాక్షిణ్యమ్ము.

ద్రోణుడు - సిగ్గుపడుచుండె నా అల్పమ్ము చెప్పగా
నా నాల్క.

ఏకలవ్యుడు - నా గురువు
నాల్క చెప్పినదె గురువగును; కాదల్పమ్మ
దెప్పటికి.

ద్రోణుడు - అది నిజమె. అల్పమ్ము కాదేను
వాంఛించు దక్షిణ.

ఏకలవ్యుడు - ఏకలవ్యం దొసగు
కానక్క కల్పత్వమ్ము దూరముండును గాక.

ద్రోణుడు - నేను విను కోరు దక్షిణ నీదు ప్రాణమ్మ
కన్న మిక్కిలి తీపి.

ఏకలవ్యుడు - ధర్మమ్మొ? సత్యమ్మొ?
పౌరుషమొ? ప్రాణమునకన్న తీయనిదేది!

ద్రోణుడు - వ్రేలు! బొటనవ్రేలు!

ఏకలవ్యుడు - (కొంత ఆగి) ఆఁ?

ద్రోణుడు - (ఒత్తి చెప్పును) దక్షిణగ దక్షిణకరంపు బొటనవ్రేలు!
నీదు విలువిద్య కుసురైన బొటనవ్రేలు!
బాణమును పట్టి నారికి చేర్చు బొటవ్రేలు!-
కిమ్మన వదేలయ్య? ఖేదమా, ఓ వత్స!

ఏకలవ్యుడు - (తల అల్లాడించి) ఖేదమ్మ కాదు, గురుదేవ,
కడచిన రాత్రి
కన్నట్టి కలనొక్క-దాని తలచుచునుంటి.
వినుమార్య! సర్వమ్ము నీకు నేనర్పింప
నిర్ణయించితిని - ఈ వ్రేలు పెద్దది కాదు.
పెద్దవ్రేలైన నైతమ్ము!- (దరహాస మొనరించును)
ఆ అర్జునుడు
తృప్తుడగునేమార్య నాదు ఒక వ్రేలితో-
గతరాత్రి కంటి కలలో నొక్క నీలాంగు;
పడగలెత్తిన రెండు పాములాతని బాహు!
లడిగె నాతడు తనకు మెడయె బలి వలయునని.
కొమ్మంటి నేను! మెడనే బలిగ ఇడినతడు
ఒక వ్రేలినీయ వెనుకాడునే? నిక్కముగ
అది నాకు గడ్డిపోచకు సమానము గదా?

ద్రోణుడు - వాగ్దానమును తీర్ప నా ఆశ; ప్రేమించు
నీ కుత్తుకను కోయుటకు నేను రాలేదు! (చింతించి)
జీవులది కర్మజటిలత, ఏకలవ్య, ఈ
కుటిల కార్యమ్ములకు మమ్ముల నియోగించు
భగవదిచ్ఛా దివ్యలీలా ఫలమ్మనకు!
గతరాత్రి నీకనిన కల ఏమిటో! చెప్పు.

ఏకలవ్యుడు - విదుర తిరుగుచునుంటి కలనొక్క కానలో.
వినిపించె నొక లేడి గొంతు. పరుగిడి కంటి
దానిపై పడనున్న పులిని. కత్తిని తీసి,
పట్టి, ఎగిరితి దానిపైకి. రంగులబుగ్గ
పైకి చిమ్మెడి రీతి కుప్పించి వచ్చి నను
కరచుకొనె పులి. దాని పొట్టకే గురిపెట్టి
పొడిచితిని - దాని నెత్తురు బుగ్గవలె చిమ్మ.
వెంటనే పులి మాయమయ్యె. దాని శరీర
మున నుండి పుట్టి నిలిచెను ఒక్క నీలాంగు;
రతని తలమీద నర్తించినది ఒక నెమ్మి.
పడగలెత్తిన పాములవి బాహువుల పోలె
ఊగినవి, భుజదేశమున పొడమి. కనినంత
మానె వైరము నాకు. సంచరించిన దాత్మ
పూజ్యభావమ్ము. ముదమంది, చేతులు మోడ్చి,
అడిగితిని:
"నీవెవరవు మహాత్మ?" "నేను నీ పరమాత్మ!"
అనుచు నవ్వెను. "నీదు గొంతు కౌగిలి పట్ట
రూపొంది, తీఫణులు నా బాహువులు!" భయము
నకు బదులు నాకు మోహము పొంగె, అతనిపై.
"కొనుము, కైకొనుము నా సర్వస్వమును!" అనుచు
అతని గుండెను హత్తుకొంటి - గాఢమ్ముగా
కఱచుకొని, చుట్టుకొనె నాదు కుత్తుకను ఆ
సర్ప బాహుద్వయము. సమ్మోద పులకితుడ,
నానందచకితుండనై మేలు కాంచితిని.
ఆ స్వప్నముననుండి!

ద్రోణుడు - నీ స్వప్న వృత్తాంత
మాలించి, నా వెంద్రుకలు నిక్కపొడిచికొనె.
దేవకార్యమున కీ వర్పితాత్ముడవయ్య.
భగవదర్పితమైన మరణమును జీవనము
పగిది శ్రేయస్కరము.

ఏకలవ్యుడు - (ధ్యానమునుండి లేచినవానివలె)
వీరవరు కార్ముకపు
నారి సంధింపబడి, సమరమ్ములో పోరు
కర్మమయ శరమువలె, అమ్ములపొదింజొచ్చి,
వెన్నెక్క, తాల్మితో తనవంతు కోసమై
వేచియుండెదు నట్టి బాణపుట కర్మమును
సార్థకము, అది కూడ కృతకత్యమగు నార్య.
మొదట నారిని చేరు నారాట మా సవ్య
సాచికి! వీరవరు చేయి పట్టిననాడు
నారి చేరుదు నేను. వేచియుండుట కూడ
కర్మమ్మె, భగవన్నిషంగము ప్రవేశించి
న అనంతరమ్ము! అమ్ములపొదిని చొచ్చి ఆ
శివుని వెన్నెక్కుటది ముఖ్యమ్ము కద! గురూ!

రమ్ము! కామ్ము దక్షిణను దీని! జయమగుత
ధర్మమ్మునకు భగవదిచ్ఛకును జయమగుత!
మీదు వాగ్దానమ్ము చెల్లింపబడుగాక!
అర్జునుని చిరవాంఛ అది ఫలించును గాక!

(అమ్ములపొదిలో నున్న ఒక పెద్ద మొనగల బాణమును సావధానముగ లాగి, తీసి, శాంత గమనమున ద్రోణ ప్రతిమ వద్దకు సాగి పోయి, మోకరిల్లి)

కై కొనుము, గురుదేవ, నీకు దక్షిణ ఇద్ది,
దక్షిణకరంపు బొట్టనవ్రేలు! దీవించు,
కాపాడు, నీదు పసిబాలకుని!

(కుడిచేయి బొటనవ్రేలిని శిలావేదిక మీద పెట్టి, ఎడమచేతి బాణముతో దానిని కత్తిరించును. నెత్తురు చిమ్మి మడుగు కట్టును. ఆ మడుగు నడుమ బొటనవ్రేలి ముక్కను విడిచి పైకి లేచును. నెత్తురు కారు గాయమును ఎడమచేత మూసి, చాటుచేసి, విషణ్ణుడై కూర్చున్న ద్రోణుని దిక్కు తిరిగి)

ఔషధము పెట్టి వేగమె వత్తునాచార్య.

(అనుచు నిష్క్రమించును. అతడు పోయిన వైపునకు కన్నీరు వించి, రెప్ప వేయక చూచుచుండి, అతడు కనుమరుగైన తరువాత ద్రోణుడు ప్రయాసా పూర్వకముగ లేచి నిలబడును. ద్రోణ ప్రతీక వద్దకు అల్లన నడచి వచ్చి, మడుగ కట్టిన నెత్తురును, దాని మధ్య గల వ్రేలిముక్కను, ముఖమున దుఃఖ ముప్పొంగి కనిపించునట్లు చూచి, నిలబడును)

ద్రోణుడు - క్షత్రియ కుమార, నీ ఈర్ష్యాగ్ని తనియ విదె
బోయ బాలకుని బొట్టనవ్రేలు బలి!

(అని దానిని తీసికొనబోవుచున్నట్లు, కూర్చుండి వంగును. వంగి అట్లే మ్రాన్పడి, బెదరి కేక వేయును)

అయ్యయ్యో, ఏకలవ్యా!

(కేక వేసి, వెనుకగా వ్రాలి, తన చేతిమీద ఒరిగి కూర్చుండును)

ఏకలవ్యుడు - (చేతికి మందుపెట్టి, కట్టు కట్టుకొని, వెరగుపడి, పరుగిడి వచ్చును)
ఏమయ్యె, నేమయ్యె, నాచార్య! ఆచార్య!
ఎందుకిటు కూర్చుండితిరి మ్రాన్పడిన రీతి!

ద్రోణుడు - (ఆయాసపడిన వానివలె తలనెత్తి, శిష్యుని కనుచు, ప్రయాసతో విరళ విరళాక్షరములుగా మాట్లాడును)
అంగుళమునకు గళము!
వత్స, నీ అంగుళమునకు నాదు ఈ గళము!

ఏకలవ్యుడు - ఏమయ్యె నాచార్య, ఏమయ్యె, ఏమయ్యె?

ద్రోణుడు - (కొంత స్థిమితపడి, లేచి నిలబడి, తనతోపాటు లేచి నిలబడిన ఏకలవ్యుని భుజము మీద కరమూని, మడుగుగా నేర్పడియున్న రక్తమును చూపుచు)
వత్స, కనిపించునేమందులో? కని, చెప్పు.

ఏకలవ్యుడు - ఏమింక కనిపించు నాచార్య?
రక్తమ్ము, అంగుళము!

ద్రోణుడు - జాగ్రత్తగా కనుము.

ఏకలవ్యుడు - (చూచి) కనిపించుచుండె నంబరపు ప్రతిబింబమ్ము
తేలాడుచున్న తెలిమబ్బు గమి నీడలును.

ద్రోణుడు - నే కంటి నన్యమ్ము బీభత్స దృశ్యమ్ము!
నీవు చన, లేచి అరుదెంచి, ఆ రక్తమ్ము
వద్ద కూర్చుంటి. నీ వ్రేలి ముక్కను తీయ
వలెనంచు కొంచెమ్ము వంగితిని. కనిపించె
నా రక్తదర్పణమునందు నా ప్రతిబింబ
మానాదు ముఖ వికారమును ప్రతిబింబమున .
కని వెరగుపడియుండ, ముష్టిఖడ్గము పట్టి,
భీమ హస్తమ్మొకటి నిట్టనిలువుగ వ్రాలి
కత్తిరించినది నా ప్రతిబింబపు గళమ్ము!
తెగి పొరలినది శిరము!
కాంచితిని
రుండమ్ము లేని మొండెమ్ము!
కాంచి నిను పిలిచితిని!
ముందేమి కానున్నదో నాకు!
విధి యెరుగు.
నీదు అంగుళమునకు బలిగ కైకొనునంచె
తోచు నావిధి నాదు గళము!

ఏకలవ్యుడు - నా కలను గూర్చి విని దాని తలచుచునున్న
మీ కిద్ది వట్టి నేత్రభ్రాంతి, ఆచార్య.
అందుల కదెందులకు ఇంత ఉద్వేగమ్ము?

ద్రోణుడు - భ్రాంతి కన్నులకైన, ఈ భ్రాంతి మూలమ్ము
నేత్రమ్ము కాదయ్య నీ రక్తమా బంధ
కంజనమ్మును పెట్టియున్నది: ఇకముందు రా
బోవు దానిని ఇపుడె చూపినది ఈ రాయి.
రాయైన నేమి? తాను కూడ విశ్వచిత్
విన్యాసమే కదా? సర్వవిత్ ఆ విశ్వచిత్,
సూచించినది నాకు తనలోన ఉన్న అని

వార్యమ్ము!
అట్లె కర్మక్రమము: మెయికి మెయి; చెయికి చేయి;
అంగుళమునకు గళము! (నగారా వినిపించును)

ఏకలవ్యుడు - ప్రొద్దుపడె నాచార్య.
వరుసలుగ పరుగులిడు కొండ కోనల మీద
గగన తీరమునందు దిగుచుండె నదిగొ రవి.
ఆః! రక్తపు వసంతమును చల్లినట్లుండె
సాయం సమయకాంతి; నిండుచున్న యది ని
శ్శబ్దతా శాంతి ఈ అస్తమయ సమయపు స
మస్తగిరి మస్తకారణ్య ప్రదేశముల!
మీరు పొందచట వేచినయట్టి పల్లకికి.
అమ్మ వచ్చెడివేళ. ఈ నెత్తురామె దృ
ష్టికి పడకయుండునటు కడిగి అరుదెంచెదను.

(తునుకయై పడియున్న వ్రేలివంకకు ద్రోణుడు చూచును)

తెచ్చి ఇత్తును దాని పైతమ్మె సవ్యసా
చికి సాక్షిగా నుండ!

ద్రోణుడు - వద్దు, వత్సా, వద్దు.
ఇంక నతడంత నైచ్యమ్మునకు దిగలేడు!
(ఆయాసపడుచు చెప్పును)
నీ తల్లి చూడకుండును గాక, ఓ వత్స,
ఈ వ్రేలిముక్క, నా కొదవకుండునుగాక
శోక సంతప్త మాతృ క్రూర శాపమ్ము!

ఏకలవ్యుడు - దాని తీసుక పొదలు అల్లిబిల్లిగ అల్లు
కొన్నట్టి కోనలోనికి విసరి వేసెదను
పురుగులకు విందుగా నీవు నడుమాచార్య,
నీదు వెన్నంటియే నే వత్తు; కర్జమ్మె
పూర్తి చేసిన పిదప వేగిరము అరుదెంతు.

(ద్రోణుడు బయలుదేరును. ఏకలవ్యుడు దృశ్యపు టంచువరకును అతనిని సాగనంపి వెనుదిరుగును. వ్రేలి నొప్పికి అతని ముఖము కొంత ముడుచుకొనును)

మనసు బెదరుటలేదు. కాని మెయి బెదరెడిని
ఈ పచ్చిగాయంపు మంటకు. తనువు నొచ్చి
నన కూడ ఆత్మ ఏదో తృప్తి చవిచూచి
సుఖియించు! గురువు కోరిన దక్షిణ నొసంగి
తనియ చేసితిననియొ! ధర్మ సంకటమునకు
చిక్కినట్టి గురూత్తముని దానినుండి త
ప్పించి నటువంటి ఒక త్యాగ సాహస కార్య
మొనరించితి నటన్న వీరసుఖమొ? దివ్య
లీలార్థమై నేను నను యజ్ఞ మొనరింప
మనసులో నిశ్చయించితి నన్న ఉత్తమ స
మర్పణాభావ జనితామృతానందమొ?
ఆత్మ ఏదో తృప్తి చవిచూచి సుఖియించు!

(సూర్యాస్తమయమును అనిమేషుడై చూచుచు)

ఆః, ఈ అస్తమానమ్మదెంత సుందరతమము!
దిగ్వధూఫాలస్థలీ కుంకుమాంకమటు
గగనాంచలమ్ములో కాలూని నిలువబడి
అందాలు చిందు సాయం సూర్యబింబమ్ము!

(మైమరచి చూచుచు నిలుచును. ఏకలవ్యుని తల్లి వెనుకనుండి ప్రవేశించును. కొడుకు తన్ను గమనింపక నిలుచుండుట కని)

అమ్మ - ఇదియేమిరబ్బి నీవొక్కడవె ఉన్నావు?
విల్లొజ్జ ఏడిరా?

(ఏకలవ్యుడు తటాలున మేలుకొనినవానివలె తిరిగి చూచి, బెదరి, అదరిపడును. తన వలచేతిని తటుక్కున మూసికొని, తల్లివైపొక సారియు, మడుగై నిలిచిన నెత్తురువైపు ఒకసారియు బెరుకు బెరుకుగా చూచును)

ఏకలవ్యుడు - (తనకుతానే)
అయ్యో, వచ్చియె వచ్చెనమ్మ! ఇంకేమిగతి?
ఏమైన ఒక్క నెపమును చెప్పి ఆ యమను
రక్తంపు మడుగు కనుటకు మున్నె యుక్తిమై
వెనుదిరుగునట్లుగా ఒనరించనే వలెను. (తల్లితో)
అమ్మ, నీవేమిటికి ఇచటి కేతెంచితివి,
సాయంతనంపుటీ మసక చీకటిలోన?

(తల్లికి నెత్తురు మడుగు కనిపించనట్లు మెల్లగా అడ్డము వచ్చి, నిలుచును)

అమ్మ - సంజెప్రొద్దుకు నీవు పిలుచుకొని వత్తునని
చెప్పితివి కద నీదు విల్లొజ్జ, నోరబ్బి?
ఫలమూలముల సిద్ధ మొనరించి కాచికొని
కనులు కాయలు కాచె. చీకటి పడక మున్నె
పిలుచుకొని పోవుటకు ఏతెంచితిని.

ఏకలవ్యుడు - అమ్మ,
ప్రొద్దు మునిగెడు ముందె తాను దిగుటవి మంచి
దని నేను పర్వతపు పాదపు బిడారమున
కప్పుడే వీడుకొంటిని నాదు గురుదేవు.

అమ్మ - మరచితివ మరియాద? వెంట చని పంపి ఏ
తెంచుటను?

ఏకలవ్యుడు - (తొందరపడుచు) ఇప్పుడే వెళ్ళెదను. వెన్నంటి
వత్తునని చెప్పితిని.

(హఠాత్తుగా తిరిగి చూచి, మరల బెదరినట్లు చూచును)

అమ్మ - (చేతితో చూపుచు) ఏమిరా, ఇది, అబ్బి?
తడబడుచు నుడివెదవు? బెదరుకొని చూచెదవు?

(అతని ఉడుపుల మీదనున్న రక్తపు మరకలను చూచును)

ఏకలవ్యుడు - (ఉదాసీన ధ్వని నభియించుచు)
ఏమి లేదమ్మ, నీవేగుమమ్మ ఇంటి;
కే వత్తు వేగమే, పిడొక్కని గురూత్తముని.

అమ్మ - (చేత చూపి) ఇది యేమిరా అబ్బి ఈ నెత్రు మరకలు?

ఏకలవ్యుడు - ఒజ్జ పరికించెనమ్మ నాదు విలువిద్య.
చాల దగ్గరనున్న పందిని వధించితిని.
దాని రక్తపు మరకలు. ఇంకేమి కాదమ్మ.

అమ్మ - (ఆ వంక చూచి) అది యేమిరా అబ్బి ఆ కెంపు
నీరమ్ము?

ఏకలవ్యుడు - (నవ్వు నటించుచు)
నీదు పుత్రోత్సవపు టందపు వసంతమ్ము!
(అక్కడకు వెళ్ళదలచిన తల్లినాపి)
వేడ్క కంటిని తల్లి నీకేమి పిచ్చియా?
పూజ కంచని పోసినట్టి తీర్థోదకము.
బండపైగల గుంతలోన పడియగ నిలిచి
సంజకెంజాయ ప్రతిబింబించుచున్నయది!
ఆః! నిక్కమమ్మ రక్తమువోలె మెరసెడిని!
ముసలి కనులున్న ఎంతటి వారలును భ్రాంత
చిత్తులౌదురు గదా!

(తల్లి ఏకలవ్యుని త్రోసుకొని, ముందుచని, నెత్తురు మడుగుగా నున్నచోటికి చేరును. నిర్ఘాంతపోయి, చూచుచు నిలబడును. ఏకలవ్యుడు నిలబడిన చోటినుండి కదలక భ్రాంతుడై అరచి చెప్పును)

దేవతకు బలియిడ్డ మృగరక్తమో తల్లి!
నీరని వినోదమున కూరకంటిని కదా?
రా, పోద, మదె ప్రొద్దు మునుగుచుండెను, చూడు.

అమ్మ - (వంగి చూచి ఉద్వేగముతో)
ఇదియేమిరా అబ్బి, కత్తిరించిన వ్రేలు!
ఎవరిదిర? (రోదన ధ్వనితో) నీదేమి? అయ్యయ్యో!

ఏకలవ్యుడు - (పరుగిడి వచ్చి, తల్లిని పట్టుకొని)
అమ్మ, ఓ యమ్మ, ఉద్వేగమ్ము చెందకుము!
బొటవ్రేలు నిక్కమ్ము! అచరకుము! బెదరకుము!
నాదె! ఇంకెవరిదియు కాదమ్మ! కాదమ్మ!

అమ్మ - (శోకాధిక్యమువలని కోపముతో శాపరౌద్రురాలై)
ఎవరికో బలినాదు ఈ పసివాని అంగుళము,
బలియగును గాక ఆ పాపాత్ముని గళము!

ఏకలవ్యుడు - (అరచును) వద్దమ్మ! వద్దమ్మ! నిలునిలుము,
నిలుమమ్మ!

అమ్మ - తరుగుకొని పోవుచున్నదిర నా కన్నకడుపు!

ఏకలవ్యుడు - కారానిదైనదే, అక్కటా! నా మహా
త్యాగమ్ము వ్యర్థమై చన్నదే, అక్కటా! (తల్లితో)
అమ్మ, బలి యిచ్చినది కాదమ్మ, గురువు నను
చేయుచుండ పరీక్ష, ఆకస్మికమ్ముగా
నిశితబాణము తాక కసికుమని తెగె వ్రేలు!

అమ్మ - నన్ను మాట్లాడ చేసినది, ఓరబ్బి, వా
త్సల్య సంజ్వలిత మాతృ క్రూర కోపమ్ము!

ఏకలవ్యుడు - తొందరపడితివమ్మ.
నను కూడ తాకకుండగ పోదు నీదు ఈ
శాపమ్ము! (నిట్టూర్చును)
చీకట్ల కప్పు దిగుచున్నదదె.
తడవు చేసిన నీకు కనబడదు మార్గమ్ము.
నీవిచ్చినట్టి శాపమ్మునకు గురుదేవు
క్షమవేడి ....
పాదమ్ములంటి చనుదెంచెదను.
అమ్మ, ఇంటికి పొమ్ము.
నొప్పకుము-అలుగకుము; కాళ్ళబడి వేడెదను!

(అనుచు కాళ్ళు తాకును. అమ్మ మౌనముగా కొంతసేపు గ్రుడ్లప్పగించి చూచి, నిట్టూర్చి, కన్నీళ్ళు కన్నుల నుబుకుచుండగా, బయలుదేరును. ఏకలవ్యుడు లేచి నిలబడి, దృష్టి బాహువులతోనే తల్లిని పట్టుకొని నడపునన్నట్లు ఆమె పోవుటనే చూచుచు నిలుచును. చీకటిలో కనుమరుగైన తర్వాత, ద్రోణ ప్రతిమవైపుకు తిరిగి నిలుచును. చీకటి కవిసి దృశ్యము మిక్కిలి

అస్పష్టమగును. ఆకాశమున తారకలు మెరయును. పడమటి వింగి కొనలో 'వెండి' తళతళలాడును. నిర్జనమై, జలపాతము వినా నిశ్శబ్దమై, నిశ్చలమగును. కనపడినను కనపడకున్నట్లు ఏకలవ్యుని ఆకృతి గోచరమగుచుండును. బండమీద పడియున్న వ్రేలిముక్కను లోయలోనికి విసరి పారవేయును. జలపాతపు నీటిని చిమ్మి నెత్తురును కడుగును. ద్రోణ ప్రతిమకు సాష్టాంగ దండప్రణామ మాచరించి, పద్మాసనము వేసికొని, కూర్చుండును. చీకటి దట్టముగా అలమి మేదినిని మ్రింగివేయును. నీరు పడు చప్పుడు చెవికి; మినుకు మినుకుమను చుక్కలు కనులకు; ఏకలవ్యుడు సంపూర్ణముగా ఇరులలో కరగిపోవును. గిరివిపిన భూమ్యాకాశములను నింపునట్లు (ప్రార్థనాగానమొకటి వినిపించును.)

అంతరతముడీవు, గురూ,
హే ఆత్మ తమో హారీ!

జటిల కుటిల తమ అంతరంగ బహు
భావ విపిన సంచారీ!

అంతరతముడీవు, గురూ,
హే ఆత్మతమోహారీ!
జన్మ జన్మ శతకోటి సంస్కార
పరమ చరమ సంస్కారీ!

అంతరతము డీవు, గురూ,
హే ఆత్మ తమోహారీ!
పాప పుణ్య నానా లలిత రుద్రలీలా
రూపారూప విహారీ,

అంతరతము డీవు, గురూ,
హే ఆత్మ తమోహారీ!

(తెర పడును)

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

(అయిపోయింది)

త్రికాలం

శ్రీ ఎం. ఎస్. ఎం.

పెద్దపులి వంటి—
చలికాలం వచ్చింది
నీరు మంచుగడ్డ అయింది
నిప్పురవ్వ ఆరిపోయింది

ఎండాకాలం ఆగమనం జరిగింది
నీరు వేడి ఎక్కింది
మంచు కరిగిపోయింది
నిప్పురవ్వ ఎర్రనైంది

వానలకాలం సిద్ధం
అనుకున్న పనులు అబద్ధం
ఏ సమయంలో ఎక్కడ
కురుస్తుందో తెలీదు
నిప్పురవ్వ నల్లపడింది
మంచుగడ్డ నీరయింది

* * *

ఒక గుడిసెలోని కుటుంబం
ఎండాకాలంలో రోడ్డుమీద
ప్రక్కలు వేసి ఎదమర్చి
నిద్రపోయింది

చలికాలంలో అందరూ
గుడిసెలో దూరారు

వరదల రోజులు వచ్చాయి
గుడిసె కొట్టుకుపోయింది
అంతా గంగమ్మపాలు

ప్రకృతి ప్రతికృతి చిత్ర
విచిత్రం సైకిలు చక్రం

నా స్వప్నం - ఒక స్వప్నం

శ్రీ మణిగోపాల్

నా భారతావనిలో-
పంచనదులు కలిసేచోట
ప్రపంచశాంతి మృగ్యం!
దహించబడుతూన్న మానవత్వం
దేశానికి పట్టిన దౌర్భాగ్యం!
రొమ్ముల్లోని ప్రాణాలు
అరచేతుల్లో బిగుసుకుంటున్నాయ్!
దమ్ముల్లేని రొమ్ముల్లో
కృపాణాలు దిగుతున్నాయ్!
అక్కడ ప్రజల జీవితాలు
ముద్రణా యంత్రాల్లో నలుగుతున్న కాగితాలు!
ప్రతి యింటి గడప ముందు-
రుధిరంతో కళ్లాపి జల్లి వేసిన ముగ్గు
బాధితుల శరీరంలో నలిగిన ఎముకల నుగ్గు!
ప్రతి రాత్రీ నా స్వప్నంలో-
పల్లకీల్లో తరలివెళ్తున్న నా సహోదరులు!
పులకిస్తూ విడిది చేస్తున్న రాజభవనాలు!!
నా కన్నుల పండుగ జేస్తున్నాయ్....
హఠాత్తుగా-
నా స్వప్నం - స్వప్నంలా నిలిచిపోయింది!?
వాస్తవం నన్ను చూసి వికటాట్టహాసం చేసింది!
ఇప్పుడు నా ఎదురుగా-
పల్లకీల్లో వున్నవారు అలంకరించింది శవపేటికలు!
రాజభవనాలనుకున్న విడుదులు శ్మశాన వాటికలు!

ఆ దృశ్యాలు-
నా వెన్నుసు జలదరింపజేస్తున్నాయ్!
అదృశ్యాలు-
నా స్వాప్నిక శాంతియుత ప్రపంచాలు!!
రేకులు రాలిపోతున్న కుసుమం-
నా దేశం!
కాకులు పొడుస్తున్న కళేబరం-
నా దేశం!!
పరాజయం పొందిన శాంతి కపోతం-
నా దేశం!!!

'మానవుడు'

శ్రీ ఆదిశేషయ్య

'గ్రహణం' పట్టిన సూర్యచంద్రులను చూసి
కృంగిపోతాడు - పట్టు, విడుపు స్నానాలు జేసి
వెలుగు చీకట్ల సార్వభౌములకి
తన కృతజ్ఞతలు తెలియజేస్తాడు
కాని,
తప్పుజేసిన తోటి మానవుణ్ణి
నిరంతరం నీడలా వెన్నంటి కాటేస్తాడు
గ్రహపాటు లెమ్మని - క్షమించడు - పొరపాటును దిద్ది-
ఓదార్చడు

శ్రీ వేముగంటి నరసింహాచార్యులు

కృష్ణశాస్త్రి వచన రచన

దేవులపల్లి కృష్ణశాస్త్రి మహాకవిగా అందరికీ పరిచయమే. కవితను కమనీయ శిల్పంగా మలచి ఆంధ్రులకు అందించిన విషయం మనందరికీ విదితమే. పదాలకు రంగూ, రుచీ, పరిమళం ఉంటాయని తెలిపిన అపూర్వకవి కృష్ణశాస్త్రి. పద్యాన్నీ, పాటనూ రమణీయ శిల్పరంజితంగా తీర్చిదిద్దడంలో ఎంతటి నైపుణ్యం కనబరచాడో వచనాన్ని కూడా అందమైన శిల్పంగా చెక్కడంలోనూ అంతటి నేర్పు చూపించారు కృష్ణశాస్త్రి.

స్ఫటిక పాత్రలోని మంచి గంధంలో మల్లెపూలను తడిపి, ఆ గంధసారాన్ని చినుకు చినుకుగా చిలకరించినట్లు ఉంటుంది కృష్ణశాస్త్రి వచన రచన. తీయని మామిడిపండ్ల రసంలో ఏలకుల పొడీ, పచ్చకప్పురపు పిరమూ కలిపి మన నోటికి అందించినట్లుగా ఉంటుంది ఆయన వచనశైలి.

కృష్ణశాస్త్రి ఎన్నో మనోహరములైన వ్యాసాలు సంతరించారు. కవులను గూర్చి, మహావ్యక్తులను గూర్చి, కవితా ప్రశస్తిని గూర్చి, ఇంకా ఇతర విషయాలను గూర్చి చక్కని వ్యాసాలు వ్రాశారు. ఏ విషయాన్ని గూర్చి వ్రాసినా శాస్త్రిగారి విజ్ఞాన భాండారపు తలుపు తెరచుకొని అందులోని మణులూ, మాణిక్యాలూ మనముందు కుప్పలుగా వచ్చిపడి కనులకు మిరుమిట్లు గొలుపుతాయి, ప్రతి వ్యాసమూ కృష్ణశాస్త్రిగారి సహజ సుందర పదవిన్యాస విలాసంతో లాస్యంచేస్తూ మన మనస్సులను ఆనందతుందిలం చేస్తుంది. విశ్వమానవ జీవిత క్షీరసాగరం మథించి వెలికితీసిన సుధానవనీతం శాస్త్రిగారి వచన రచనా సముదాయం.

కృష్ణశాస్త్రి 'కవి పరంపర' అనే వ్యాస పరంపరలో నన్నయ, తిక్కన, శ్రీనాథుడు, పెద్దన, వేమన, తిరుపతి వేంకట కవులు, వేంకట పార్వతీశ్వర కవులు, గురజాడ మొదలైన కవులనూ, వారి కవితా విశేషాలనూ ప్రశంసిస్తూ వ్యాసాలు వ్రాశారు. నన్నయ కవితను నిర్వచిస్తూ "ఆయన కవితా వాహిని గంగానది. అది ముక్తాహారమే కాక పాతాళమునుంచి పరమ పదముదాక నిశ్శ్రేణిలాగా కనపడుతుంది" అంటారు. గంగానది అనడంలోనూ, ముక్తాహార మనడంలోనూ నన్నయ కవితలో ఒక గంభీరభావం, ఒక పవిత్రతా, ఓజస్సూ స్ఫురిస్తాయి.

నన్నయ, తిక్కనల కవితా స్వభావాలను తెలుపుతూ ప్రకటించిన ఈ క్రింది వాక్యాలు కృష్ణశాస్త్రిగారి పరిశీలనా దృష్టీ, ప్రతిభాస్ఫూర్తీ గోచరిస్తాయి.

"నన్నయ వైకుంఠాన్ని భూలోకంలో అవతరింపజేస్తాడు. తిక్కన భూలోకాన్ని స్వర్గం దగ్గరికి ఎత్తడానికి యత్నిస్తాడు. ఒకరిది ఎక్కువగా దూరదృష్టి. రెండవవారిది ఎక్కువగా తీక్ష్ణ దృష్టి."

నన్నయ కవితను వర్ణిస్తూ కృష్ణశాస్త్రి ఈలా అంటారు.

"ఒకసారి భాద్రపదంలో భాగరథి లాగా ప్రవహిస్తుంది. ఒకసారి హస్తినాపుర రాజవీధిలో మత్త మాతంగంలాగా నడుస్తుంది."

భాగరథిలాగా అనడంలో నన్నయ కవితలోని భావ గాంభీర్య సౌభాగ్యం, మత్తమాతంగంలాగా అనడంలో హృద్యమైన పద్యాల నడక గోచరిస్తాయి. ఈ ఉపమాన సౌందర్యం అనుపమానం కదా! తిక్కన కవితాస్ఫూర్తినే కాక ఆయన మూర్తిని కూడా చిత్రించి చూపారు కృష్ణశాస్త్రిగారు. తిక్కన రూపాన్ని ఇట్లా ఊహించారు.

"తిక్కనగారు పొడుగ్గా ఉంటారు శరీరచ్ఛాయ దబ్బపండులా ఉండొచ్చు కోటేరు వేసిన ముక్కు. విశాలమైన నుదురు. బలమైన గడ్డం. బిళ్ళగోచీ పంచె. ముళ్ళ అంగరఖా. శుభ్ర సుందరాలైన వస్త్రాలు. నుదుటిమీద గంధాక్షతలు. ఇంత అన్నిటికంటె గొప్పవి ఆ కళ్ళు. ధగధగా కత్తి మొనల్లాగా మెరుస్తూ చల్లని అనురాగంతో నిండిఉంటాయి సూర్యచంద్రుల్లాగ" శాస్త్రిగారి ఈ ఊహకు జోహారు చేయాలనిపిస్తుంది.

ఈలాగే శ్రీనాథుని మూర్తినీ, పెద్దన రూపాన్నీ బొమ్మ గట్టి చూపారు కృష్ణశాస్త్రిగారు.

పెద్దన, నన్నయ్యల వ్యక్తిత్వాలను గూర్చీ, మనుచరిత్ర, భారతాలను గూర్చీ చక్కని మాటలను చెప్పారు శాస్త్రిగారు. "పెద్దన తాన్‌సేన్. నన్నయ హరిదాసస్వామి. మనుచరిత్ర మధువు. భారతం అమృతం" ఈ పోలికలు ఎంత ధ్వనిమంతములో రసజ్ఞులు గ్రహించగలరు. వేమన కవితను కృష్ణశాస్త్రి వివరించిన తీరు చమత్కారంగా ఉంది.

"వేమన మాట నుసికట్టని నిప్పుకణం. తగలగానే చుర్రుమంటుంది. వేమన మాట రెక్క ముడువని భరతపక్షి. కాలాలు దాటి ఇంకా ఎగిరి వస్తూనే ఉంది" వేమనను గురించి శాస్త్రిగారు ఈలా అంటారు. "ఇతడు (వేమన) వీథిలోనూ, విపణిలోనూ, మందిరాల్లోనూ, మఠాల్లోనూ, జనసమ్మర్దమున్న చోటా ఒక్క నిముషం వెన్ను వాల్చకుండా హమేషా తిరుగుతూ, వీణ్ణి ఒక తన్ను తన్నీ, వాణ్ణి ఒక మొట్టు మొట్టి, ఒకణ్ణి దగ్గరగా పిల్చి, బుజ్జగించి, ఒకణ్ణి కన్నుగీటి ఎగతాళి చేసి అలా మాట్లాడుకుంటూ పోయినట్లుంటాడు." ఈ మాటలు వేమన కవితను స్ఫురింపజేస్తున్నాయి. వేమన కవితలోని వాడిని ధ్వనింపజేస్తున్నాయి.

వేంకట పార్వతీశ్వర కవుల కవితారీతి ఈలా వెలయింపబడినది. "ఆవేశం వచ్చినప్పుడు ఒకరి కళ్ళు అగ్నికణాల్లాగా తళతళ మంటాయి. రెండవవారి కళ్ళు శ్రావణ మేఘాల్లాగా తడి తడిగా ఉంటాయి."

బసవరాజు అప్పారావు ప్రకృతిని గూర్చి కృష్ణశాస్త్రి ఈలా వర్ణించారు.

"కాస్త గాలి తగిలితే ఒక్కొక్క ఆకే కదిలి, అన్ని ఆకులూ కలిసి, అంతా నిలువునా ఒక పాటయైన రావిచెట్టులాగా ఉండేవాడు బసవరాజు."

ఈ మాటల్లోని చమత్కారం సహృదయైకవేద్యం. బసవరాజు పాట నెత్తుటి జీర అంటుకున్నట్లు ఉంటుందట. అతని పాట వేడి వేడి నిట్టూర్పు అట. బసవరాజు కవిత్వాన్ని వివరిస్తూ కృష్ణశాస్త్రి అంటారు. "అతని కావ్యాలన్నీ చదివాక నిట్టూర్పు విడువకుండా, కన్నీటితో చెక్కిలు తడియకుండా ఉండలేము. ఆ కన్నీటి కెంతటి శక్తి ఉంది? ధూళీ దూగరా లేకుండా, శుభ్రంగా, శాంతంగా, సుందరంగా, వాన వెలసిన తరువాత చెట్టులా చల్లని ఆవేశంతో రవంత ఊగుతూ నిలబడతాము" ఒక కవి కవితా విశేషాన్ని ఇంత చక్కగా, చిక్కగా చిత్రించడం ఒక్క శాస్త్రికే సాధ్యం.

"కవి-సమాజం" అనే వ్యాసంలో కృష్ణశాస్త్రి కవికీ, సమాజానికీ ఉండే అవినాభావ సంబంధాన్ని చక్కగా నిరూపించారు. "కవి ఉన్నాడు. చుట్టూ సమాజం ఉంది. సమాజం సముద్రం అయితే కవి కెరటం" అనడంలోనూ, "ప్రజలూ, కవీ అందరూ పడుగూ పేకలాగ అల్లుకుపోతారు. ఒకరి బ్రతుకు ఒకరి బ్రతుకుతో పెనవేసుకొనిపోతే, ఒకరి గుండె ఒకరి గుండెను ఒరుసుకుంటుంది" అనడంలోనూ ప్రజలకూ, కవికీ ఉన్న అనుబంధం విశదంగా తెలియజేయడం జరిగింది. ప్రజ నిత్యయాత్రికుడనీ, సంప్రదాయం ప్రజకు దారిబత్తెమనీ, ప్రజలలో నిలచిఉన్న సంప్రదాయాలతో కవికి పరిచయం ఉండాలనీ, ప్రజల కలిమి లేములతోనూ, కష్టనిష్ఠూరాలతోనూ సంబంధం కలిగి వాళ్ళ జాతి సంప్రదాయాలు కూడా వివేచనంతో, చనువుతో, గౌరవంతో ఎరిగి ఉండాలని శాస్త్రిగారు ఉగ్గడించారు.

సాహిత్యరంగంలో కృషి చేసేవాళ్ళకు చుట్టూ ఉన్న మానవ జీవితంతో ఎంత సంబంధం ఉంటే అంత మంచిదనిన్నీ, ఆలా ఉంటే కావ్యానికి వస్తువుగా అనుభవమున్నూ, సృష్టింపజేసే చైతన్యమున్నూ లభిస్తాయని వక్కాణించారు కృష్ణశాస్త్రి. "కళ - జీవితం" అనే వ్యాసంలో.

"సాహిత్యం - శబ్దం" అనే వ్యాసంలో శాస్త్రిగారు కవిత్వంలో శబ్దం అనే అంశాన్ని ఈలా నిర్వచించారు.

"కవిత్వంలో శబ్దం కిటికీవంటిది. దానిలోనుంచి వెనకాల ఉన్న దూర లోకాలూ, గగన ఖండాలూ, తోపులూ, తోటలూ కనబడతాయి" ఈ మాటలో శబ్దానికున్న శక్తి ఎంతటిదో చక్కగా తెలుపబడినది. అందుకే కృష్ణశాస్త్రి "ఒక్కొక్కచోట శబ్దం అఖండం చైతన్యంతో, శక్తితో పచ్చి మంత్రంలాగే అవుతుంది" అని అరవిందుల మాటలను ఉటంకించారు.

"ఎక్కడికక్కడే మూడు కాలల ముడిలాగ కనపడతాడు కవి" అంటూ కవిని గూర్చి తెలుపుతూ, ఆ వాక్యాన్ని ఇలా వివరించారు శాస్త్రిగారు. "ఎప్పటికప్పుడే ఎక్కడికక్కడే కవి ఒక రిజర్వాయరులాగ ఉంటాడు. ఇది వర్తమానం. ఇంకి పోగా ఖర్చయిపోగా మిగిలిన ప్రవాహంలాగ పూర్వకాలం అతనిలో పడుతుంది. ఇది గతకాలం. ఎప్పటికప్పుడు ఎక్కడికక్కడ పైనుంచి వర్షాలు పడతాయి. అతనిలోనుంచి భవిష్యత్తులోకి ఒక ప్రవాహం ప్రవహించిపోతుంది. ఇది భవిష్యత్తు."

ఈ నిర్వచనంతో ఈ వివరణలో ఎంతటి పరిశీలనా దృష్టీ, ఎంతటి ప్రతిభాపుష్టీ భాసిల్లుతున్నదో సహృదయులు గ్రహించగలరు.

కవి కరుణామయుడై ఉంటాడు. కరుణ వేదనగా మారి కవితా సృష్టికి కారణమౌతుంది అనే విషయాన్ని కృష్ణశాస్త్రి ఈలా అంటారు. "ఒక్కొక్క కవికి ఒక్కొక్క సిలువ ఉంటుంది. తనదైన నరకవేదనా, ఇతరులది కూడా తనదై పోయిన వేదనా అతణ్ణి స్తిమితంగా ఉండనీయవు. వాటిని లోపల ఇముడ్చుకొని లోక సంగ్రహార్థం చల్లని, చక్కని, తీయని కావ్యాలవిస్తారు" ఈ వాక్యాలను చూస్తే శ్రీశ్రీ మహాప్రస్థానానికి చలం వ్రాసిన యోగ్యతాపత్రంలోని ఈ క్రింది మాటలు గుర్తుకు వస్తాయి.

"కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ. ప్రపంచ బాధ అంతా శ్రీశ్రీ బాధ."

రచయితలు మానవ జీవితంతో సంబంధాన్ని కలిగి ఉండాలనే అంశాన్ని కృష్ణశాస్త్రి "కళ - జీవితము" అనే వ్యాసంలో ఈలా వివరిస్తారు. "సాహిత్యరంగంలో కృషి చేసే వాళ్ళకి చుట్టూ ఉన్న మానవ జీవితంతో ఎంత సంబంధం ఉంటే అంత మంచిదనీన్నీ, అలా ఉండే కావ్యానికి వస్తువుగా అనుభవమున్నూ, కల్పనకు పురికొల్పే కరుణయున్నూ, సృష్టింపజేసే చైతన్యమూన్నూ లభిస్తాయనీన్నీ ...." ఈ మాటలు ఎంతటి యధార్థములో వేరే చెప్పనవసరములేదు.

'మహావ్యక్తులు' అనే వ్యాస సంపుటిలో వీరేశలింగంగారిని గూర్చి వ్రాస్తూ వీరేశలింగం వ్యక్తిత్వాన్నీ, జీవిత లక్ష్యాన్నీ, అమోఘ కృషినీ కొద్ది మాటల్లో బంధుర భావస్ఫూర్తిగా వ్యక్తీకరించారు.

"వీరేశలింగం ప్రజ.... వీరేశలింగం కేవలం ప్రజ కూడా కాదు. వీరేశలింగం మానవత. అప్రతిహతమైన ఆయన బలమంతా ఆ మానవతలోనే ఉంది. ప్రబుద్ధమైన నవయుగ ప్రజాశక్తి అణువునంటి ఆ అర్భకమూర్తిలో ఇమిడి ఉండి క్రుద్ధ గౌతమిలాగ, రుద్రప్రభంజనంలాగ అటంకాలన్నిటినీ తుడిచిపెట్టి సాగిపోయింది" ఈ మాటలు అల్పాక్షరాలలో అనల్పార్థ రచన కదా! కృష్ణశాస్త్రి ఇంకా ఈలా అంటారు. "భయంకరమైన, తీవ్రాతితీవ్రమైన ఆ కార్యోత్సవంలో ఆయనకు మరణించడానికి తీరిక లేకపోయింది" ఎంత గొప్పగా చెప్పారు.

బ్రహ్మర్షి రఘుపతి వేంకటరత్నం నాయుడుగారిని గురించి కృష్ణశాస్త్రి ఈ విధంగా ప్రకటిస్తారు. "నాయుడుగారి హృదయము శత తంత్రీమహతి. ప్రతి వాయు నిహతికిని కంపించిపోయెడిది. ప్రతి శిష్యునితోడి యనుభవములే కాక ప్రతి కావ్యములోని యనుభవములను నందనానిలములై వారి మనస్సునుజ్ఝూత లూగించెడివి" ఈ పలుకులు నాయుడిగారి శిష్య వాత్సల్యాన్నీ, విజ్ఞాన విభవాన్నీ వ్యంజింపజేస్తున్నాయి.

"మెచ్చుకుని వెన్ను చరచగలడు. నొచ్చుకుని వెన్ను చీల్చగలడు." ఈ మాటలు ప్రకాశంగారిని గూర్చి చెప్పబడినవి. ఇవి ఆయన వ్యక్తిత్వాన్ని వ్యక్తపరుస్తున్నవి.

"వక్త-శ్రోతలు" అనే వ్యాసంలో వక్తను గురించి వక్కాణించిన మాటలు చమత్కృతిమంతములుగా ఉండి వక్త లక్షణాన్ని విలక్షణంగా వెల్లడిస్తున్నాయి.

"వేయిమందితో కర్రతో చేడీయుద్ధం చేయవలసినవాడు వక్త. పదహారు వేలమంది వివిధ విధాలవాళ్ళ మనస్సులకు ఒకేసారి చక్కలిగింత పెట్టవలసిన దక్షిణ నాయకుడు వక్త. మెదడుతో ఉప్పట్టీ, చెడుగుడూ, కుందబంతీ, కోతికొమ్మచ్చీ అంచీలమీద ఆడగలిగే నేర్పరి వక్త"

మన దేశంలో లక్షలాది జనం ఆకలితో అల్లాడుతున్నారనే సంగతి మనకు తెలిసిందే. ఎందరో కవులు ఆకలిపై ఆవేదనతో కవితలు వ్రాశారు. కృష్ణశాస్త్రి ఆకలిని గూర్చి కవితా వాసన గుబాళించే ఈ క్రింది మాటలు గమనించదగినవి.

"మన దేశంలో ఆకలి లేదు. మనం శిలలం. మనం మృత్తు. మనం మృత్యువు. వేనవేలేండ్లు అసత్య ప్రచారాలు, అధర్మాచారాలు, అసంబద్ధ వైరాగ్యాలు మనకు ఆకలి లేకుండా చేశాయి" ఈ వక్త్రాంశం ఆకలితో బాధపడుతున్నప్పటికీ ప్రజల చైతన్యరాహిత్యాన్నీ, స్తబ్ధతను ధ్వనిమంతంగా తెలుపుతున్నది. శాస్త్రిగారు ఇంకా ఈలా అంటారు. "ఈ దేశంలో అయిదేళ్ళవాడు చివరలు కిందికి వంగిన పెదవులతో, దీర్ఘముఖంతో పాకుతూ బతుకంతా భూత భవిష్యద్వర్తమానాలు కర్మ సిద్ధాంతానికి ఒప్పచెప్పి ఊరకుంటాడు" ఎంత జాలిగొలిపే మాటలవి.

కృష్ణశాస్త్రి రావిచెట్టును వర్ణించిన తీరు ఈలా ఉంది.

"రావిచెట్టు మాత్రం ఎప్పుడూ నిద్దురపోయేది కాదు. ఎంచేత అంటారు! ఒక నిముషమైనా కన్ను మూయనిది రావిచెట్టొక్కటే. రావిచెట్టు ఆకులు దాని కనురెప్పల్లా ఉంటాయి." ఒకసారి తోలుబొమ్మలాడేవాళ్ళు వచ్చి రావిచెట్టుకింద మకాంవేసి మరునాడు అక్కడ విరాటపర్వం తోలుబొమ్మలాట సాగించారు. విరాటపర్వం కథతో సంబంధం కలుపుతూ శాస్త్రిగారు ఎంతో సరసంగా రావిచెట్టును ఈలా వర్ణించారు.

"సమయాన్నిబట్టీ, కథనుబట్టీ రావి సవ్వడి మారేది. ద్రౌపది కష్టాలకు ఉసురుసురని నిట్టూర్చడం, వలలుడు చేష్టలకి

గలగలమని నవ్వడం" రావిచెట్టుకు మనుష్యత్వం కల్పించి చిత్రించిన ఈ మాటలు కృష్ణశాస్త్రి ప్రతిభకు చక్కని తార్కాణ.

"వీధి అరుగు" అనే వ్యాసంలో పల్లెకూ, పట్టణానికీ ఉన్న తారతమ్యాన్ని కృష్ణశాస్త్రి మిక్కిలి మనోజ్ఞంగా తెలిపారు.

"పల్లె తల్లివంటిది. పట్టణం ప్రియురాలివంటిది. అన్నం పెట్టడం, చల్లని అంకంమీద పవళింపజేసుకోవడం, గారాబంగా పెంచుతుంది పల్లె. ఆకర్షించడం, ఎప్పటికప్పుడు ఆవేశాలతో కదలించివేయడం - గాఢంగా ఊపేస్తుంది పట్టణం. "నీకేం కావాలి" అంటుంది పల్లె. "నాకేమిస్తావు" అంటుంది పట్టణం. అంతేకాదు. పల్లె కుటుంబంలాగ, సంసారంలాగ ఉంటుంది. పట్టణం సంతలాగ, విపణిలాగ ఉంటుంది."

పాతిక సంవత్సరాల తెలుగు కవిత్వాన్ని వివరిస్తూ చివరలో ఈలా ఉగ్గడించారు.

"నిజంగా నాయకుడు కవే. ఈ కొత్త యుగసంధిలో మరీని. వెనుకటి కవి సమాజం ఇప్పుడు విశ్వమంత విశాలంగా పెరిగిపోతూంది. ఆ సమాజంలో వారందరూ, కవీ ఒకరితో ఒకరు పెనవేసుకుపోతున్నారు. కవి త్రికాలజ్ఞుడు. గరుత్మంతుని వంటి ద్రష్ట. దూరాలు చూస్తాడు. అసికొనల వంటి చూపులతో దొలిచి దొలిచి అంతరాంతరాలు చూస్తాడు. అకలంకమూ, అమృతప్రాయమూ అయిన అనురాగంతో చూస్తాడు. ఇక తర తరాలనుంచీ, దిక్కు దిక్కులనుంచీ వచ్చిన విజ్ఞాన సంస్కృతు లలో, సంప్రదాయాలలో అవసరమైనవీ, ఉత్తమమైనవీ ఏరుకొని అక్షయమైన దారిబత్తెం సేకరించుకుంటాడు. వర్తమాన దేశ కాల పరిస్థితుల్ని బాగుగా, సుఖంగా ముందుకు సాగడానికి అను కూలమైన మార్గాలూ, మజిలీలూ ఏర్పరుస్తాడు. మరికొంతవర కైనా భవిష్యత్తులోనికి చూచి, మన కడపల గమ్యస్థానం అదీ అని నిర్ణయించి చూపిస్తాడు. అనంతయాత్ర మార్గంమీద జనం యాత్రిక కోటి, దానికి పెత్తందారు, నాయకుడు కవి."

ఈ మాటల్లో కవి లక్షణాన్ని పొదిగి, సార్వకాలికమైన, సత్యభాసురమైన సందేశాన్ని అందించారు. హృద్య గద్యరచనా ధురంధరులైన దేవులపల్లి కృష్ణశాస్త్రి.

కళ్ళు

కళ్ళు ప్రవహిస్తుంటే
పాదాలు పుష్పిస్తాయి
ఉరిమే కళ్ళను వింటుంటే
హృదయాలు వర్షిస్తాయి
కలలు కరిగిపోతుంటే
కన్నీటి స్వరాలవుతాయి
కాలనాగులు కాటేస్తుంటే
ఉక్కు నరాలవుతాయి
మంచును మండించే
జ్వాలలవుతాయి
చీకట్లను వెలిగించే
చైతన్య గీతాలవుతాయి.

రెండు ప్రపంచాలు

నవరసాలు పలికించే రాగవీణలు
నవనాడులు రగిలించే నెరజాణలు
లోన కాంక్షామణులు దాచే
ఫేన దరహాస గనులు
మోహ నగరి ద్వారాలు
అహంకార శిఖరాలు
అవి ఒకే కాడకు వికసించిన
రెండు ప్రపంచాలు.

మినీ సుందరి

క్షణకాలం తిరిగే బొంగరం
ఆమె బహిరంగం
ఉరుముల మెరుపుల ఆకాశం
ఆమె అంతరంగం
ఆమె అనురాగం
ఆలోచనా తరంగం

శ్రీ సి. బి. కృష్ణ

పురిటినొప్పులు

శ్రీ యం. సదాశివుడు

నా పురుష హృదయం నేడు
పురిటి నొప్పులు పడుతూంది.

పిడికిలి మించని నా ఎడద కడలిని
ఎవరో చిలుకుతున్నట్లుగా-

గుండె రెండుగా చీలి
మరో నరకేసరి దుముకుతున్నట్లుగా-

నరనరాల్లో పొరల్తూన్న ప్రతి రక్తకణంలో
మృదంగాలు మ్రోగినట్లుగా,
తురంగాలు సాగినట్లుగా
నాలో ఏదో అలౌకికానుభూతి కలుగుతూంది.

నేడు నా పురుష హృదయం
పురిటి నొప్పులు పడుతూంది.

లింగభేదం లేకుండా పుట్టబోయే నా శిశువుకు
అంగాలు కూడా ఉండవు.

అసలిది మామూలు శిశువు కాదు
యుగయుగాల ముసలి నిసువు.

"సోక్రటీసు" మొదలు "చొప్పకట్ల"దాకా
దీనికోసం జాతకాల్లూ, జన్మపత్రికలూ రాశారు.

ఆదిమ మానవుని ఆటవిక హృదయం ఎదిగి
పల్లవించి కుసుమించిన వేళ-
ఆయా కుసుమాల పరాగాల సరాగాలలో

ఇలాంటి శిశువు తొలిసారిగా ప్రభవించిన వేళ-
పొంగిపోయిన పుడమి తల్లి

అంబరమంత పందిరికింద
ఎంత సంబరంగా పండుగ చేసుకున్నదో!

నాడు నేడుల నడిమి సహస్రాబ్దాలలో
చావు పుట్టుకల నడిమి పూర్వభాగంలో
ప్రతి జీవీ ఇలాంటి శిశువును ప్రసవించింది.

సంగమం సంగ్రామం
వినోదం విషాదం
భోగం త్యాగం
రాగం విరాగం
గానం జ్ఞానం లాంటి
మలుపులు గల ఈ ప్రసవఫలం

ప్రకృతికి ఆకృతిగా
ఒక్కొక్కప్పుడు వికృతిగా పరిణమిస్తూంది.

బద్ధునిగానూ, బుద్ధునిగానూ
మార్చగల ఒక మహాశక్తి
నా హృదయ శుక్తినుంచి
బయటు పడుతూంది.

"ప్రేమ" అని పేరు పెడతాను
నామకరణానికి రావాలి మీరంతాను!

డాక్టర్ వెలగా వెంకటప్పయ్య

తెలుగులో బాలసాహిత్యం

పిల్లలంటే అపారమైన అభిమానం, ప్రేమగల పండిట్ నెహ్రూ పిల్లలను గురించి ఇలా అంటారు. "అపారమైన సంఖ్యలో గల బాలబాలికలు చూపులకు రకరకాలుగా కనిపిస్తారు. వివిధ భాషలు మాట్లాడుతారు. రంగురంగుల బట్టలు ధరిస్తారు. ఐనప్పటికీ వారంతా ఒకే మోస్తరుగా కనిపిస్తారు. ఒకచోట చేరితే ఆడుకుంటారు. పాడుకుంటారు. పోట్లాడుకుంటారు. ఐనా వెంటనే కలసిపోతారు. వారు తమ మతం, కులం, రంగు, హోదాలను గురించి ఆలోచించరు. నిజానికి వారు తమ తల్లి దండ్రులకంటే తెలివైనవారు." అందుకే వారిని పెంచడంలో, వారికి తగిన సాహిత్యాన్ని అందించడంలో జాగరూకత వహించాలి. ఈ పని క్రమబద్ధంగా జరిగితే ఆరుద్రగారు చెప్పినట్లు "నేటి బాలలు రేపటి పౌరులు అనే నానుడి, నిన్నటి బాలలే రేపటి నేతలనే" న్యూనుడి కాగలదు. కార్మికలోక కడగండ్లను చూచిన మహాకవి శ్రీశ్రీ ఒకోసారి పిల్లలలో కలసిపోతారు. "శైశవగీతి" అనే గేయంలో-

"పాపం పుణ్యం - ప్రపంచమార్గం
కష్టం సౌఖ్యం, శ్లేషార్థాలూ
ఏమీ ఎరుగని పూవుల్లారా
ఐదారేడుల పాపల్లారా!"

అంటూ ప్రకృతిలో సహజంగా జరిగే మార్పులు తమకోసమే జరుగుతున్నాయని అమాయకంగా ఊహించే పాపలగురించి రాస్తూ-

మెరుపు మెరిస్తే - వాన కురిస్తే
ఆకసమున హరివిల్లు విరిస్తే
"అవి మాకే" అని ఆనందించే కూనల్లారా"

అంటారు.

బాల ప్రపంచంలో నిత్యం మునిగి తేలే రేడియో అన్నయ్య ఏడిద కామేశ్వరరావుగారు నూతన లోకాన్ని కమ్మని, తియ్యని, తెల్లని పాలతో పోల్చుతారు.

"బాల ప్రపంచం - పాల ప్రపంచం
పాలవలె తెల్లనిది
పాలవలె తియ్యనిది
పాలవలె చిక్కనిది"

పాల మెరుగది - బాల ప్రపంచం పాల బుగ్గల పసిడి బాలలను పాలతో పోల్చడం ఎంతో ముచ్చటగా ఉంది. కనుకనే దాదాపు నాలుగు దశాబ్దాలకు పైబడి బిడ్డలతో గడిపిన రేడియో అన్నయ్య న్యాయపతి రాఘవరావుగారు (1905-1984) తెలుగు పిల్లలను గురించి

"తెలుగు దేశపు తెలుగు పిల్లలు
తెలుగు వెలుగులండీ
తెలుగు - బాలురు తెలుగు బాలికలు
తెలుగు సొమ్ములండీ"

అని నిండు హృదయంతో ప్రశంసిస్తారు.

తెలుగుదేశంలో ఇంత మంచి బిడ్డలుండడానికి కారణం తెలుగు తల్లులు నోము పంట కారణమై ఉండవచ్చు. ఆ బంగారుతల్లుల పురిటిగడ్డ తెలుగుసీమ, ముగ్ధ మధుర వాఙ్మయం నిండార వెల్లివిరిసిన తెలుగు బాలల పల్లెపాటలలో తెలుగుతల్లిని గురించి ధ్వనాత్మకంగా ఇలా పాడతారు.

"ఉత్తముని పేరేమి ఊరు పేరేమి?
సత్యపురుషులు గన్న సాధ్వి పేరేమి?
ఉత్తముడు దశరథుడు
ఊరు అయోధ్య
సత్య పురుషులు గన్న సాధ్వి కౌసల్య"

ఈ గేయంలోని సాధ్వీమతల్లి కౌసల్యాదేవి ఐనప్పటికీ అజ్ఞాతకవి దృష్టిలో మెదులుతున్నది తేనె పలుకుల అలివేణి "తెలుగుతల్లి" మాత్రమే, ఆ తల్లిబిడ్డల ముద్దు మురిపాల తెలుగుబిడ్డలు మాత్రమే.

బాల సాహిత్యం అంటే?

పెద్దల సాహిత్యంలో పిల్లలకు పనికివచ్చేదంతా పిల్లల సాహిత్యంగా చలామణీ కావడమే మన సంప్రదాయంగా చలామణి అయ్యింది అన్నాడు సుప్రసిద్ధ సాహిత్యవేత్త కొడవటిగంటి కుటుంబరావుగారు (1907-1980) ఇది కొంతవరకు వాస్తవమే.

చింతా దీక్షితులుగారు బాల సాహిత్య పరిధిని వివరిస్తూ "శిశువు జన్మించినది మొదలు బాల్యదశ వీడేవరకు కూడా వాని మనసుకు రంజకంగా ఉండేది బాల వాఙ్మయం అని చెబుతారు. బాల సాహిత్యం పిల్లలను ఆనందింపజేయగలదిగా ఉండాలని చెబుతారు. ఈ నిర్ణయానికి చేరువగా ఎ. లక్ష్మీరమణగారు "బాల్యం నుంచి పదునాలుగు సంవత్సరాల ప్రాయం వరకు వారికనువైన సాహిత్యం బాల సాహిత్యమ"ని చెప్పుకోవచ్చని వయోపరిమితుల నియతిని సూచించారు. ఈ విషయాన్నే ఒక అమెరికన్ విజ్ఞాన సర్వస్వం ఇలా చెబుతుంది. "బాల సాహిత్యం అంటే పాఠశాలలకు వెళ్ళిన దశనుంచి యుక్తవయస్సు వచ్చేవరకు చదివే అపారమైన సాహిత్యం బాలసాహిత్యం. ప్రధానంగా బాలలకు ఉపయోగించేది మాత్రమే బాల సాహిత్యంగా పరిగణింపబడుతుంది."

బాల సాహిత్యం ఉండవలసిన విధానాన్ని గురించి డాక్టర్ దాశరథిగారు నిజమైన బాల సాహిత్యం తియ్యని మామిడిపండులా ఆపాత మధురంగా ఉండాలి. భాష సరళంగానూ, లలితంగాను ఉండాలి. చెప్పవలసిన విషయం పండు ఒలిచి చేతిలో పెట్టినట్లుండాలి. బాల సాహిత్యవేత్తలు ఈ మూల సూత్రం పాటించినంతకాలం బాల వాఙ్మయం బాలల ఆదరణ పొందుతుంది. డాక్టర్ మిరియాల రామకృష్ణగారు "పిండి ఆరబోసినట్లు హాయిగా కనిపించే వెన్నెల.... సముద్రతీరంలో మనవైపు పరుగెత్తుకొచ్చే కెరటాల అల్లరీ... ఆ నవ్వులు పువ్వులూ, జాలీ, లాలీ, పనిపాటా, ఉపకారం, ఉత్సాహం, హాయీ, రేయీ, పాటా-ఆటా, ఆనందం - అందం - ఇవీ బాల సాహిత్యం. అనుభూతికి, ఆలోచనలకి బాలల్ని అలవాటు చేసే పుస్తకాల ప్రపంచం - అదీ బాల సాహిత్యం అంటారు. వారు బాల సాహిత్యం లోతులకు వెళ్ళి బాలల స్వభావాన్ని ఛాయాచిత్రంలాగ చూపించారు.

బాల సాహిత్యం ప్రయోజనం

"బాల సాహిత్యపు మూలధ్యేయం సత్ప్రవర్తన కలిగించడం, వారికి మాతృభూమిని ప్రేమించే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం" అంటారు మద్దులూరి రామకృష్ణగారు. మన ప్రాచీన బాల వాఙ్మయం ప్రధానంగా బాలల వ్యక్తిత్వాన్ని పెంపొందించడానికి తోడ్పడేదే. ఈ విషయాన్ని జాన్ పిట్ రాండోల్ఫ్ అమెరికన్ బాల సాహిత్యవేత్త మరింత విపులంగా చెబుతారు. "బాల సాహిత్యం వైవిధ్యంతో కొనసాగుతూ ఉంటుంది. ప్రేమ, విశ్వాసం, న్యాయం, నిజాయితీ, నిష్కాపట్యం, పూర్తి ధైర్యం, ఆనందం, నిస్వార్థం, మంచి క్రీడాకారుని కుండే ఉత్సాహం, ఆత్మ విశ్వాసం, ఆత్మ గౌరవం బాధ్యత మొదలైన కాలాతీత విలువలు గల సద్గుణాలను బోధించడానికి తోడ్పడుతుంది. ఇది జరిగిననాడు బాలలలో అసాధారణమైన మార్పు వచ్చి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దబడతారు. ఐతే బాలల రచనలు ఉత్తమ స్థాయికి చెందినవైతే అవి ఏ భాషకు, ఏ ప్రాంతానికి చెందినవైనా బాలల మనోభవనకిటికీలు తెరుస్తాయి. హృదయాలను ఉయ్యాల లూపుతాయి.... పలుకుబడిని నేర్పుతాయి. మాతృభాషాభిమానాన్ని జాతీయతను రేకెత్తిస్తాయి, వినడంలో, చదవడంలో, మాటాడటంలో సిగ్గునీ, సంకోచాన్ని తుడిచివేసి, లోని శక్తిని పైకి చూపిస్తాయి. జిజ్ఞాసను చైతన్యాన్ని విరబూయిస్తాయి." అటువంటి స్థాయి గల ఉత్తమ బాల సాహిత్యాన్ని పిల్లలకు అందజేయాలి. అప్పుడే సాహితీపరులు ఉద్దేశించిన ప్రయోజనాలు నెరవేరడానికి అవకాశముంది.

బాల సాహిత్య ప్రగతి

మానవ చరిత్రలో యూరపులో వెలసిన పునరుజ్జీవన యుగం ఒక మహోజ్వల అధ్యాయం అయినట్టుగా, భారతదేశ చరిత్రలో 19, 20 శతాబ్దాలు పునరుజ్జీవనకు నాంది పలికాయని చెప్పవచ్చును. ఈ కాలంలో భారతదేశం దాస్య తమస్సునుండి ఉషోదయం పొంది ప్రతిభలకు మారాకులొత్తింది. ఈ యుగంలోనే సాహిత్యోద్యమాలు, బాల సాహిత్యం వెలిశాయి. ఇందుకు దోహదం చేసినవాటిలో ఈ క్రింది కారణాలున్నాయి.

1. ఆంధ్రదేశంలో వెలసిన రాజకీయ, సాంఘిక ఉద్యమాలు.
2. పుస్తకాల, పత్రికల ప్రచురణ, బాలల శీర్షికల నిర్వహణ.
3. పాఠశాలలో ఆంగ్ల భాషాబోధన, సామాజిక శాస్త్రాల, విజ్ఞాన శాస్త్రాల బోధన.
4. వ్యవహారిక భాషకు ప్రాధాన్యం ఇవ్వడం.
5. రేడియోలో పిల్లల కార్యక్రమాలు, పిల్లలకోసం ప్రత్యేకంగా పుస్తకాలు, పత్రికలు ప్రచురణ.

బాల సాహిత్యంలో తొలి రచనలు

మన సాహిత్యంలో చిరకాలంగా బాల గేయాలున్నాయి. బిడ్డల మనసెరిగిన తల్లులు, తల్లిప్రేమకు పాత్రమైన బిడ్డలు,

తొలి కవులు, రచయితలు ఉగ్గు పాటలు, జోల పాటలు, పాల పాటలు, లాలి పాటలు, పండుగ పాటలు, ఆటల పాటలూ- అన్నీ తల్లుల రచనలే. ఉగ్గు పట్టడం తల్లి అలవాటు. ఉగ్గు పాటలు తల్లి సంప్రదాయం. ఉగ్గు పడుతూ తల్లి, బిడ్డను ఆశీర్వదిస్తుంది. బిడ్డ పెరుగుదలను ఆశిస్తుంది.

"ఊఁ ఊఁ ఉంగన్న
ఉగ్గుపాలు ఇందన్న
గంటెడు ఉగ్గు కమ్మన్న
ఉమ్మక కక్కక మింగన్న అంటూ

జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం
గుర్రాల్ దిన్న గుగ్గిళ్ళరిగి
ఏనుగుల్ దిన్న వెలక్కాయలరిగి-"

అబ్బాయి త్రాగిన పాలు, ఆముదం అరగిపోయి పాప ఉల్లాసంగా ఉండాలని ఆశపడుతుంది తల్లి. ఈ గేయం పాపకు అర్థం కావాలని కాదు. గేయం పాడుతూ తల్లి ఒక అవ్యక్తమైన ఆనందానుభూతి పొందుతుంది. దానినే తల్లి కోరుకుంటుంది.

"రోజు రోజుకు పాపాయిలో వచ్చే మార్పు మన సంస్కృతీ స్రవంతిలో మిళితం చేయడానికి ఈ పాలగేయాలు మధురమైన ఆలంబనాలు" అంటారు కవి రావుగారు. ఈ గేయాలలో సాధారణంగా రెండే పాత్రలుంటాయి. తల్లి - బిడ్డ చిట్టి పొట్టి మాటలతో తల్లి బిడ్డను అలరిస్తుంది. ఇచ్చట భాష భావానికి అతీతంగా ఉరకలు వేస్తుంది. తనకు తెలిసిందల్లా బిడ్డకు తెలియాలనే ఒక అవ్యక్తమైన తపనతో బిడ్డ చేయి ఊపుతూ-

"చేయి ఊచమ్మ చేయి వూచు
సంతకు పోదాం చేయి వూచు
శనగలు తిందాం చేయి వూచు
చల్లగ తిందాం చేయి వూచు" - అంటుంది.

ఇలా చేయడం తల్లికీ పిల్లకూ సరదాయే కాక బిడ్డకు వ్యాయామం కూడ.

లాలి పాటలు

వీటిని ముద్దుపాటలు అనీ, ఇంగ్లీషులో లల్లబీస్ అనీ అంటారు. బిడ్డకు వయసు వచ్చాక ఏడుస్తున్నప్పుడు మాన్పించడం కష్టమౌతుంది. ఆ సమయంలో తల్లి బిడ్డను లాలిస్తుంది, ముద్దిడుతుంది, బెదిరిస్తుంది, దడిపిస్తుంది, బుజ్జగిస్తుంది, బిడ్డ ఏడుపు మానదు.

"పిట్ట రావె
పిల్లలకు పాలిచ్చి పళ్లెలకు పోవె
పళ్లెలకు పోయొచ్చి బుట్టల్లుకోవె"

అని పాడుతుంది తల్లి. కాని అప్పటికీ బిడ్డ ఏడుపు మానదు. పసిపాప కన్నీరు చూసి మాతృ హృదయం ద్రవించిపోతుంది. ఆ స్థితిని భరించలేక తల్లి-

"ఏడవకు ఏడవకు వెర్రినాగన్న
ఏడిస్తే నీ కనులు నీలాలు గారు
నీలాలు గారితే నే చూడలేను
పాలైన గారవే బంగారు కనుల"

అని ఆశగా బాధపడుతుంది. అప్పటికీ ఒకోసారి బిడ్డను ఓదార్చడం సాధ్యం గాదు. బిడ్డ గుక్కపెట్టి ఏడుస్తుంది. తల్లికి అశక్తత కనిపిస్తుంది. ఆ సమయంలో దగ్గరున్న తండ్రి తల్లి అమాయకత్వాన్ని ఇలా చమత్కరిస్తాడు.

"ఊడుగు చెట్టుకు ఉయ్యాల గట్టి
ఊగుమని మీయమ్మ ఊళ్ళోకి పోయె
పందికొక్కు రావె పాలిచ్చి పోవె
ఉడుతమ్మ నువు రావె ఊకుంచి పోవె
ఎలుకమ్మ నువు రావె ఎత్తుకొని పోవె"

ఈ పాటకు తల్లి తనలో తాను నవ్వుకుంటుంది. జోలపాటలలో వలె, లాలి పాటలలో తల్లి బిడ్డలలో శ్రీ మహావిష్ణువు అంశనే చూస్తూ ఆనందిస్తూ పాట ఎత్తుకుంటుంది.

"చిన్నారి గంటల్లు మూగి మూగల్లు
పన్నగ శయనుడే శేష శయనుండు
పందిళ్ళ నాడుకొని పాలు తాగి పండు."

అనే తల్లి ప్రవృత్తి విచిత్రమైనది. బిడ్డ తన మేనమామ అంత గొప్పవాడు కావాలని ఉప్పొంగిపోతూ, పరోక్షంగా తన పుట్టింటి వారి గొప్పదనాన్ని, అన్నల గొప్పదనాన్ని చెప్పుకొని మురిసిపోతుంది.

"స్వాతి వానలు గురిసె సంద్రంబు కడనూ
చిట్టిముత్యం బుట్టె సీత కడుపునా
అందరీ మామలు చందమామల్లూ
నాయన్న మామల్లు రామలక్ష్మణులూ
పాలు తాగేనాడు పారాడేనాడూ
పాడి యావు నంపించు నీకు నీ మామ"

అంటూ మేనమామల ఉదారత్వాన్ని కొనియాడుతుంది. పుట్టింటి వారంటే తల్లికి అపారమైన అభిమానం. ఇలా లాలిపాటలు సాగుతూ ఉంటాయి. ఈ పాటలు తల్లి ఊహలే. ఇలాగే మిగతా పాటలు సాగుతూ, పిల్లల మనోభావాలకు దర్పణంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో బాల సాహిత్యం వెలువడింది. నిజానికి పిల్లల కోసం రచనలు చేయడం కష్టం. "రాజమార్గంలో నడయాడే పట్టపుటేనుగు ముచ్చటగా ముక్కాలి పీటపై తిరిగినంత కష్టంగా ఉంటుందన్నారు" దాశరథి. "పిల్లలకు పాటలు రాయడం కష్టం దానికంటే మహాకవి కావడం సులభం" అంటారు చలం. మన ప్రాచీన సాహిత్యంలో సులభ రచనలు భారతంలో ఉదంకో పాఖ్యానం, కచదేవయాని, భాగవతంలో గజేంద్రమోక్షం, ప్రహ్లాద చరిత్ర, అనంతామాత్యుని భోజ రాజీయంలో ఉపకథలు బాల సాహిత్యంగా గుర్తిస్తున్నారు. నవ సంప్రదాయంలో వెంకట పార్వతీశ్వర కవులు, నార్ల చిరంజీవి, కవిరావు, ఉత్పల, ముళ్లపూడి ప్రభృతులు సులభశైలిలో పద్యరచన చేశారు. నార్ల చిరంజీవిగారు "తెలుగు పూలు" అనే శతకంలో-

"దేశ మేదన్నచో తెలుగు దేశమనుము
జాతి యేదన్నచో తెలుగు జాతి యనుము
వంశ మేదన్నచో తెలుగువాడ ననుము
తెలుగు కీర్తిని చాటుము తెలుగుబిడ్డ"

వారే మరోచోట

"విప్లవ గుణశాలి వీరేశలింగము
వెంకె పండితులకు పిడుగు గిడుగు
మన మహా మనిషి మనవాడు గురజాడ
తలచుకొనుము వీరి తెలుగుబిడ్డ"

యిలా ఎన్నో ఉన్నాయి.

బాల గేయ రచనలో చింతా దీక్షితులు, గిడుగు, బి. వి. నరసింహారావు, ఏటుకూరి, వేజండ్ల, అలపర్తి, న్యాయపతి, ఏడిద, సుజాతాదేవి మొదలైనవారు అనేక ప్రయోగాలు చేశారు.

కథలు : నవలలు

కథకుడికి ముడిసరుకు జీవితం. జీవితం బంగారమైతే అందులో కావలసినంత తీసుకుని రమణీయంగా చేసుకునే ఆభరణం కథ" అన్నారు సుప్రసిద్ధ కథకుడు మధురాంతకం రాజారాం. పిల్లలకు కథలు చాల ఇష్టం. కథలంటే వారు చెవి కోసుకుంటారు. నీతి కథలతో ప్రారంభమై మన బాల కథా సాహిత్యంలో అద్భుత కథలు (ఫాంటసీస్) చాల వచ్చాయి. అద్భుత కథలు పిల్లల మనోభావాలను గాయపరుస్తాయనే అపప్రథ వాడుకలో ఉంది. ఇది నిజం కాదనీ "దేవతల కథలు ఎక్కువగా చదివితే - వారిని ఉద్రిక్తులను చేసి ఊహాపోహలకు దోహదం చేస్తాయనీ - షార్లెట్ బహ్లార్ పరిశోధనానంతరం తేల్చి చెప్పిన అభిప్రాయాలతో ఏకీభవించక తప్పదు. పిల్లలకు అద్భుతాలంటే ఎంతో ఇష్టం. సింధుబాదు తక్కిన నావికులతో బాటు ఒక ద్వీపంలో దిగిపోయి నిప్పురాజేసి వంట జేసు కుంటుంటే ఆ ద్వీపం కదలడం ప్రారంభించి కొద్దిసేపట్లో మునిగిపోతుంది. అంటే పిల్లలంతా ఆశ్చర్యపోతారు. ఆ తర్వాత వాక్యంలో వారు దిగింది ద్వీపం కాదనీ, తిమింగలం తాలూకు వీపు అన్నా - మంటలకు వీపు చుర్రుమనడంతో ఆ తిమింగలం బుడుంగున మునిగిపోయిందంటే పిల్లల ఆనందానికి అంతు ఉండదు. ఈ విధంగా చింతా దీక్షితులుగారి బంగారుపిలక, గలివర్ నౌకాయాత్రలు - మొదలైనవెన్నో ఉన్నాయి.

ఇల్లు, పాఠశాల, సమాజం - యిత్యాది సాంఘిక వాతావరణం గల కథల వలన వారిలో సామాజిక స్పృహ పెరిగి సంఘజీవనంలో కలసిపోడానికి వీలుగా వుంటుంది. మధురాంతకం రాజారాంగారి "కోతి" కథను తీసుకుందాం. బంగారం చేసే విధానం నేర్చుకొని డబ్బు గడించాలనే బుద్ధి పుట్టింది ఒకడికి. గురువును ఆశ్రయించాడు. గురువు మంత్రోపదేశం చేశాడు. "శిష్యా - ఇటుకరాయో, గులకరాయో తీసుకో, చిక్కుడు ఆకు బాగా నలిపి నేను చెప్పిన మంత్రం చదివి రాతిమీద పిండు. రాయి బంగారమైపోతుంది. అయితే ఒక షరతు, కోతిని మాత్రం తలచుకోవద్దు అంటాడు. శిష్యుడు మంత్రజపం ప్రారంభించాడు. కోతి గుర్తుకు రావడం మానలేదు. ప్రయత్నం ఫలించలేదు. ఏ పని చేయాలన్నా మనసు నిలకడగా ఉంచుకోవాలని దురాశకు పోరాదనీ యీ కథ చెబుతుంది.

ఇలాగే చింతా దీక్షితులు, పాలంకి వెంకట రామచంద్ర మూర్తి, మసూనా, రావూరి భరద్వాజ, మద్దులూరి రామకృష్ణ, అలపర్తి అసంఖ్యాకంగా కథలు రాసి పిల్లలను అలరించారు.

శాస్త్ర రచనలు

పిల్లల కోసం శాస్త్ర రచనలు తగినన్ని రాయలేదు. ఇటీవలి కాలంలో వేమరాజు, భానుమూర్తి, రావూరి భరద్వాజ, సి. వి. సర్వేశ్వర శర్మ, పురాణపండ, శాంతాదేవి కొన్ని రచనలు చేశారు.

నాటికలు

"కావ్యేషు నాటకమ్ రమ్యమ్, నాటకాంతంహి సాహిత్యం" అన్నారు అలంకారికులు. బాలన్నయ్య, బాలక్కయ్య, కె. ఎల్., నండూరి, సోమంచి రామం బాలల కోసం నాటికలు రాశారు.

నండూరి సుబ్బారావుగారి "నీకు రెండు - నాకు మూడు" నాటికలో అమాయకపు భార్యాభర్తలు పండక్కి ఐదు అరిసెలు వండుకుంటారు. ఇద్దరిమధ్య పంతులు కుదరక ఎవరు ముందు మాట్లాడితే వారికి రెండు, మాట్లాడకుండా ఉన్నవారికి మూడూ అని నోరు మూసుకుని కూర్చుంటారు. వీళ్ళకేదో దయ్యం పట్టిందని పొరుగింటివారు నాటువైద్యుని తీసుకువచ్చి వాతలు పెట్టబోతారు. ఇద్దరు భయపడి నోరు తెరుస్తారు. తీరా అరిసెలు తిందామనేసరికి వాటిని కుక్క ఎత్తుకొనిపోయింది.

కోస్తా ఆంధ్ర ప్రాంతంలో "శ్రావణ, భాద్రపద మాసాల్లో ఎక్కువగా వర్షాలు కురుస్తాయి. అందుకని కొందరు రెండు మూడు మాసాలకు సరిపోయే చిల్లర సరుకులు ఇంట్లో పడేస్తారు. దూర ప్రయాణాలు చేయదలచినవారు యిలాగే చేస్తారు. ఒకసారి సోమయాజులుగారు తీర్థయాత్రకు వెళ్ళదలచి రెండు మాసాలకు సరిపడా సరుకులు తెచ్చి శ్రావణ భాద్రపదాలొస్తాయి. అన్నీ సిద్ధంగా ఉంచుకో అని భార్యకు చెప్పి కాశీ వెళ్ళిపోతాడు, సోమయాజులు మాటలు దొంగలు విని తామే శ్రావణ, భాద్రపదాలని నమ్మించి సరకులన్నీ ఎత్తుకుపోతారు. జరిగిన మోసానికి యిద్దరు బాధపడతారు. మన పల్లెటూళ్ళలో అమ్మమ్మలు చెప్పుకునే యీ కథకు న్యాయపతి రాఘవరావుగారు, కామేశ్వరిగారలు నాటికగా హాస్యభరితంగా రాశారు.

చివరి మాట

బిడ్డలు ఇంతకాలమూ సాహిత్యం ద్వారా సాంస్కృతిక సంపదను గ్రహించి దేశ ప్రగతిలో భాగస్వాములయ్యారు. ఇకముందూ కావాలి. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా ఇంతకంటే మంచి అవకాశాలు, వసతులు బిడ్డలకు కల్పించవలసి ఉంది. వారి ఉజ్జ్వల భవితవ్యానికి ఉత్తమ సాహిత్యం అందించాలి.

"లెట్ అజ్ గివ్ చిల్డ్రన్ ది బుక్స్
దే నీడ్ ఫర్ బెటర్ వరల్డ్"

అన్నారు పెద్దలు. ఆ విషయాన్ని అందరూ గుర్తించాలి. అంతేగాదు "నీకు క్షణం తీరిక చిక్కితే నీ బిడ్డకేదైనా బోధించు, నీ చేతిలో ఒక్క కాసుంటే అది నీ బిడ్డకై వెచ్చించు" అనే సూక్తిని గూడ గమనికలో ఉంచుకుంటే మన బిడ్డలు ప్రయోజకులౌతారు. మన దేశం ప్రగతిపథంలో పయనిస్తుంది. బాల సాహిత్యం ఆశించే ప్రయోజనం అదే.

కవిత

మూలం :
పాల్ వేలరి


ఎక్కడ 'స్వప్రయోజనం' స్పష్టంగా వుంటుందో
అక్కడ అన్నీ నీకు నిప్పుల మవుతాయి.
చీకటి కొణాల్లేని ప్రపంచంలో
ఎటువేపూ మొగ్గని బతుకు చుట్టూ తిరుగుతూ
నీ కాంక్ష ఆత్మల్ని అనుసంధానించలేదు.
అనూహ్యమైన ఆవేదన
ఆకాశ మిచ్చిన వరం
నీ నేత్ర కాంతి సన్నని సందుల చీకట్లలోకి
ప్రవహించాలని ఆశించు
ఇబ్బంది లేని ప్రపంచ పర్వతం మీద

అనువాదం :
సౌభాగ్య

ఉత్సాహం లేని ఉదయం కావొద్దు.
రహస్యాల నించీ రంగుల వసంతంలా
ఒకానొక నిర్ణీత క్షణం
స్వచ్ఛమైన, పవిత్రమైన గాఢానురాగాలు
అక్షరాల ఆకారం దాల్చి ఆహ్లాదంగా రెక్కలు
కదిలిస్తాయి.

అజ్ఞాత అంధకారంలో
జీవన ఖనిజాలున్నాయి.
అనూహ్య నిశ్శబ్దం నించే
అద్భుతమైన కవిత కళ్ళు తెరుస్తుంది.

"ఏమండీ. ఆ భరించలేని నొప్పి ఏమైంది?"





మేలుపరచబడిన **అమృతాంజన్** వాడడంతో.

కోమలమైన అమృతాంజన్‌ను చాలా సులభంగా రాసుకోవచ్చు.

మృదువైన అమృతాంజన్‌తో చాలా సులభంగా 'మర్దనా' వేయవచ్చు.

తలనొప్పులను, వొళ్ళు నొప్పులను, కీళ్ళ నొప్పులను, కండరాల నొప్పులను మరియు బెణుకులను మేలుపరచబడిన అమృతాంజన్ మునపటికంటే **అతి** త్వరితంగా వుపశమింపజేయగలదు!

మేలుపరచబడిన

అమృతాంజన్

మీ మోముపై చిరునగవులను శీఘ్రంగా- తిరిగి వికసింపజేయుగలదు!

Amrutanjan Limited

OBM 149 TG R

సూఫీతత్త్వము - ఋతస్యపంథా

దర్వీషుల సంప్రదాయం (గతసంచిక తరువాయి)

సూఫీ రచయితలలో సర్వశ్రేష్ఠుడు జలాలుద్దీను రూమీ. పరిషియన్ భాషలో మస్నవీ అనే రచన చేసినాడు. దీనికి ఖురాను కున్నంత ప్రశస్తి కలదు. “పర్షియన్ ఖురాను” అని దీనికి పేరు వచ్చింది. రూమీ 13వ శతాబ్దంవాడు. టర్కీలో మౌలవియా అనే తరీఖా (మార్గం)ను స్థాపించినాడు. దీనికి చెందిన సూఫీలకు దర్వీషులు (తురుఖ్) అని పేరు. దర్వీషులు చింపిరి ఉన్ని గౌను వేసుకొంటారు. దాని రంగు నల్లగానైనా ఉంటుంది. నీలంగానైనా ఉంటుంది. నల్లని రంగు వారు వరించిన పేదరికానికి చిహ్నం. నీలంరంగు అంటే సైతానుకు మిక్కిలి భయం. దర్వీషులు తలమీద కొసదేరిన ఉన్ని టోపీని పెట్టుకొంటారు. దర్వీషులు రెండు రకాలు. ఇద్దరిదీ భిక్షకవృత్తే. **1. నాట్య దర్వీషులు**- వీరు రూమీ సంప్రదాయానికి చెందినవారు.[39] వీరు పిల్లనగ్రోవి వూదుతూ, డోళ్ళు కొట్టుచూ గుంపులు గుంపులుగా వలయాకారంగా నృత్యం చేస్తారు. ఒంటి కాలిమీద గిరగిరా బొంగరంవలె తిరుగుతారు. మస్నవీ గీతాలు, ఖురాను సూరాలూ పాడుతారు. **2. అరచే దర్వీషులు**- వీరిది వీరభక్తి. బిగ్గరగా అరచుచూ అల్లాను కీర్తిస్తారు. ఆ యావేశంలో అద్భుతకార్యాలు చేస్తారు. అగ్నిగుండం త్రొక్కుతారు. శూలాలతో ప్రక్కల పొడుచుకొంటారు. దబ్బనంతో నాలుకను గ్రుచ్చుకొంటారు. వీరికి మహిమలు కలవని సామాన్యుల విశ్వాసం.[40] వీరు రిఫాయియా మార్గంవారు. సూఫీ సంకీర్తనను వదలినా, సంకీర్తన సూఫీని వదలిపెట్టదట. సూఫీ సంకీర్తన చేస్తూ, చేస్తూ నిలువెల్లా నాలుక అయిపోతాడు.[41] సంకీర్తన, సూఫీ శరీరపు టంతరాంతరాలలో జీతించి (సిర్), ఆధ్యాత్మ సౌందర్యం (ఇహ్సాన్) తాల్చుతుంది. సూఫీకి భగవదైక్యం (తౌహీద్) లభిస్తుంది.

సూఫీ పరంపరలు

సూఫీలు కలిసికొని చర్చించేందుకు ఒక ప్రత్యేక భవనాన్ని ఏర్పరచుకొంటారు. ఈ భవంతికి తకియా, జాయెగాహ్ రిబాత్ అని అంటారు.[42] తకియాలో ప్రార్థన, ఐదుసార్ల నమాజు చేసే మసీదుకు అదనము. జికర్ నమాజుకు అదనము.

ఇప్పుడు వివిధ సూఫీ సంప్రదాయాల నిస్తున్నాను.

* బెక్తాషియా :

టర్కీ దేశపు దర్వీషులు. ఖొరాసాన్ ప్రాంతపు బెక్తాష్ వలీచే స్థాపితము. 13వ శతాబ్దం. నాల్గవ ఖలీఫా హజరత్ అలీ అనుయాయులు. ఆల్బేనియా దేశంలో ఉన్నారు. బ్రహ్మచర్యానికి ప్రాధాన్యం ఇచ్చే పరంపర ఇది.

* చిష్తియా :

అజ్మీరు కేంద్రము. ఖ్వాజా మొయినుద్దీను చిష్తిచే స్థాపితము. 12వ శతాబ్దం. శాంతికాముకులు జిక్ర్ ఖఫి (మౌన స్మరణ), జిక్ర్ జలీ (కీర్తన) వీరి సంప్రదాయము.

* దర్ఖావా :

మొరాకో దేశ సూఫీలు. దర్ఖావీచే స్థాపితము. 18వ శతాబ్దం. గానం, నాట్యం, ప్రార్థన వీరి పద్ధతి.

* మలామతియా :

పర్షియా దేశంలో 8వ శతాబ్దంలో వుండిన సూఫీలు దైహిక వాంఛలను గర్హిస్తారు. లామ అంటే అరబీ భాషలో గర్హణ అని అర్థము. ఇతర సూఫీలు తమ అహ్వాల్ (ఒక సాధననుండి ఇంకొకదానికి చేరుకొనినప్పుడు కలిగే ఆనందము)ను ప్రకటించుకొంటారు, మలామతీలు రహస్యంగా ఉంచుతారు. సూఫీలు సుక్ర్ (భగవత్ చింతనా మత్తత)కు ప్రాధాన్యమీయగా మలామతీలు నిరంతర జాగరూకతకు ప్రాధాన్య మిస్తారు.

* మౌలవియా :

జలాలుద్దీను రూమీ (ఈయనను మౌలానా అంటే ఆచార్యుడు అని పిలుస్తారు)చే టర్కీలో స్థాపితము. 13వ శతాబ్దము. సుప్రసిద్ధ నాట్య దర్వీషులీ సూఫీ పరంపరవారే.

* నక్షబందియా :

మొదటి ఖలీఫా అబు బేకరు వారినుండీ వస్తున్న సూఫీ సంప్రదాయము. తుర్కిస్తాన్‌లోని బొఖారాలో బహావుద్దీను (క్రీ.శ. 1384) స్థాపించినాడు. ఈయనకు అన్‌నక్ష్‌బంద్ ("చిత్రకారుడు") అనే బిరుదుంది. ఈయన ఏర్పాటు చేసిన జిక్‌ర్ (కీర్తనాపద్ధతి), సూఫీల హృదయాలపై భగవంతుని రూపము అచ్చులాగున ముద్రితమయ్యేటట్లు చేస్తుంది. కనుక ఈ సూఫీల పరంపరకు నక్షబందియా అనే పేరు వచ్చింది.[43]

* ఖాదిరియా :

సయ్యద్ అబ్దుల్ ఖాదర్ వారిచే స్థాపితము. వీరు ఖదర్ (స్వేచ్ఛా సంకల్పం) మీద ఆధారపడతారు. జబర్ (బలవంతం) మీద కాదు.

* ఖాలందరియా :

ఇండియా ఉపఖండంలోని సంచార దర్వీషులు. డమాస్కస్‌లో 13వ శతాబ్దాన స్థాపితం. వీరు బ్రహ్మచర్యానికి ప్రాముఖ్యం ఇస్తారు.[44]

* రిఫాయియా :

అహమదుర్ రిఫా వారిచే 12వ శతాబ్దంలో స్థాపితము. వీరే అరచే "వీర" దర్వీషులు. వీరికి అద్భుత మహిమలు (కరామత్) ఉంటాయి అని విశ్వాసం. ముస్తఫా కెమాల్ పాషా (టర్కీ అధ్యక్షుడు) వీరిని 1925లో నిషేధించినాడు.

* షాజిలియా :

షజీలిచే 13వ శతాబ్దంలో అలెగ్జాండ్రియా (ఈజిప్టు)లో స్థాపితము. సన్యాసం, భిక్షుకవృత్తి, మఠ జీవితానికి బదులు సాధారణ సాంసారిక జీవితాన్ని ప్రతిపాదించే సూఫీ పరంపర. ఇదొక "సహజ మార్గం" వంటిది. అందుకే ఈ పరంపర విస్తారంగా వ్యాపించింది.

* షత్తారియా :

ఇండియా దేశపు సూఫి అయిన అబ్దుల్లాషా షత్తారి (మరణం 1428) వారిచే స్థాపితము. వీరు ఫన (అహంకార నివృత్తి)ని ఒప్పుకోరు. "నేను"ను లేదనుకొనుటే భగవదైక్యానికి (తౌహీద్) వ్యతిరేకము[45]. వీరు అందుకే "అహం"ను అణచే కఠోర నియమాలను ఒప్పుకోరు.

* సు(స)హ్రావర్దియా :

ఉమర్ సుహ్రావర్దీ (క్రీ.శ. 1144-1236)చే బాగ్దాదులో స్థాపితము. ఇండియా ఉపఖండము, అఫ్ఘనిస్తానులోనూ వున్నారు. కఠోర ఆధ్యాత్మ క్రమశిక్షణకు వీరు ప్రసిద్ధి. అల్లాకు గల 99 అతిసుందర నామావళి (అల్ అస్మా అల్ హుస్నా)[46]ని కీర్తించే జిక్‌ర్‌ను వేలాదిమార్లు వల్లిస్తారు[47]. అల్లాకు గల కొన్ని పేరులిస్తున్నాను.

అల్లా పేరు	అర్థము
అల్‌హయ్యూం అల్‌ఖయ్యూం	అమరుడు, శాశ్వతుడు
అల్‌హక్	సత్యస్వరూపుడు
అల్ అజీం	ఉదాత్తుడు
అల్ హకీం	జ్ఞాన స్వరూపుడు
అల్ అజీజ్	సర్వ శక్తిమంతుడు
అస్ సమీ	సర్వశ్రోత
అల్ వకీల్	రక్షకుడు
అల్ బషీర్	సర్వ అధ్యక్షుడు
అల్ అలీం	సర్వజ్ఞుడు
అర్ రహమాన్	ఉపకారి
అర్ రహీం	దయామయుడు
గఫార్ / గఫూర్	క్షమించువాడు
షాహిద్	సర్వ కర్మసాక్షి

ఇవి నామ విశేషణాలే కాని అల్లా ఒక్కడే. "ఏకం సత్ విప్రాః బహుధా వదంతి" (ఋగ్వేదము) అనే వాక్యం ఇచట అన్వయించుకోవలెను.

* తిజానియా :

అహమదుల్ తిజానీ (1737 - 1815)చే సూడాన్‌లో స్థాపితము. వ్రతాలకంటే సద్భావన సదాచారం ప్రధానమని వీరి అభిమతం.

సూఫీల ప్రత్యేకత

సాధారణ ముస్లిములకూ సూఫీకీ ఏమి తేడా అనే అనుమానం రాక మానదు.

ఇస్లాం మతంలో ఐదు ధర్మాలున్నాయి. వీనికి "పంచ రత్నముల"ని పేరు. అవి:

* 1. కలిమా: దేవుడు ఒక్కడే. మహమ్మదు దేవుని ప్రవక్త.
* 2. నమాజు: రోజుకు 5 సార్లు ప్రార్థన చేయుట.
* 3 రోజా: రమజాను నెలలో ఉపవాస ముండుట.
* 4. జకాత్: దాన ధర్మములు చేయుట.
* 5. హజ్: జీవితంలో ఒక్కసారైనా మక్కాయాత్ర.

వీనిపై ఈమాన్ (విశ్వాసము) ఉండవలెను. అది ఉన్నవాడే ముస్లిము అనబడతాడు.

ఇక సూఫీ కూడా ముస్లిమే. ఇవన్నీ చేస్తాడు. ఇంకా ఎక్కువ చేస్తాడు. అదే భగవంతునితో తౌహీద్ (ఐక్యం) పొందడానికి ఆత్మనివేదన. సాధారణ ముస్లిము జన్నత్ (స్వర్గము)ను ఆశిస్తాడు. మరణానంతరం అంతిమ న్యాయ విచారణ (ఖియామత్) తర్వాత పుణ్యం చేసినవారికి అల్లా స్వర్గ సుఖాలను ప్రసాదిస్తాడు. సూఫీలు భక్తిమార్గం ద్వారా జీవన్ముక్తినీ, బ్రహ్మానందాన్నీ భగవదైక్యాన్నీ పొందుతారు. ఇదే సాధారణ ముస్లిముకూ సూఫీకీ గల తేడా.

సూఫీ తపించే అల్లా ఎట్లుంటాడు. ఇప్పుడు ఖురానులో వర్ణితుడైన అల్లా మహత్తర స్వరూపాన్ని ఇస్తున్నాను: ఆ వర్ణన ఉండే సూక్తాన్ని ఆయతుల్ కుర్సీ అంటారు. అర్థం "సింహాసనాసూక్తం" అని. ఖురానులో ఉండే అత్యంత సుందరమూ మహిమాన్వితమూ అయిన సూక్తాలలో ఇదియొకటి అంటారు. ఈ సూక్తం భగవంతుని వర్ణన కాబట్టి దీనిని మసీదు గోడలపై చెక్కిస్తారు.

ఆయతుల్ కుర్సీ

(దేవసింహాసనా సూక్తము)

"అల్లాహు-లా- ఇలాహ - ఇలా - హువల్ - హయ్యుల్ - ఖయ్యూము - లా - తాఖు - జుహు - సినతున్ - వలా - నౌమున్ - లహూ - మాఫిస్ - సమా - వాతి - వమా - ఫిల్ - అర్జి - మన్ జల్లజీ - యష్ - ఫ ఉ - ఇన్దహూ - ఇల్లా - బ్నిహీ - య అలము - మాబైన ఐదీ - హిం - వమా - ఖల్ఫు - హుమ్ - వలా - యుహీ - తూన - బిష్- ఇమ్ - మిన్ - ఇల్మిహీ - ఇల్లా - బిమా - షాఅ - వసి అ- కుర్ - సియ్యు - హుస్ - సమా - వాతి - వల్ - అర్ - జ- వలా - య ఊదు హూ - హిఫ్ - జుహుమా - వహు - వల్ - అలియుల్ - అజీం"

—ఖురాను షరీఫు 2 : 255

అర్థం: అల్లా తప్ప వేరే దేవుడు లేడు. అతడు శాశ్వతుడు. సర్వరక్షకుడు. ఆయనకు కునుకు నిద్ర లేవు. ఆకాశం లోనూ, భూమిపైనా కలదంతా ఆయనదే. ఆయన అనుజ్ఞ లేనిదే ఎవరూ ఆయనవద్ద సిఫారసు చేయలేరు. దేవు డనుగ్రహించే జ్ఞానం తప్ప వేరే తెలియలేరు. దేవుని సింహాసనము భూమ్యాకాశాలను ఆక్రమించి వున్నది. ఈ రెంటినీ కాపాడుట ఆయనకు కష్టం కాదు. ఆయన మహోన్నతుడు. మహాత్ముడు.

-ఇదీ అల్లా విరాట్ స్వరూపము.

సూఫీల కొన్ని విశేషాలు

* సూఫీలకు 40 అనే సంఖ్య అతి పవిత్రము. ముస్లిములా కందరికీ అంతే.[48]

* స్త్రీ సూఫీలు అరుదు. బస్రా నగరపు రాబియా అనే స్త్రీ రత్నము గొప్ప సూఫీ యోగిని. గర్విష్ఠి పండితులకే (ఉదా: హసన్ అనే ఇస్లాం విద్వాంసుడు) "బుద్ధి" చెప్పి, వారి దంభాన్ని పోగొట్టింది[49] అనే ఐతిహ్యం ఉంది. గ్రంథ విస్తర భీతితో ఇవ్వడం లేదు.

* తమ వింత వేషాలు, మార్మిక భాషణలు, స్వతంత్ర ప్రవృత్తి వలన ఇటు సామాన్య ప్రజల మన్ననకు, అటు ప్రభుత్వమూ, పెత్తనదారుల ఆగ్రహానికి సూఫీలు గురైనారు. శిక్షలపాలైనారు. అల్‌హల్లాజ్ ఉరి తీయబడెను. కొన్ని సూఫీ తెగలు ప్రభుత్వాలచే నిషేధించబడినాయి.[50]

* కొన్నిసార్లు సూఫీలు ప్రభుత్వాలపై తిరుగుబాటు చేసినారు. అట్టోమాన్ టర్కీ సామ్రాజ్యంపైననే ఎదురు తిరిగిరి.[51] అల్లా అనే ఏకైక భగవానుడుందేవరకు, మహమ్మదు ప్రవక్త అల్లా వరించిన ప్రవక్తగా ఉండువరకు, ఖురాను సూక్తులు ముస్లిము మానవాళికి మార్గదర్శకంగా ఉండువరకూ, సూఫీతత్వము కూడా ఉంటుందనుటలో సందేహముండదు.

* సూఫీ తత్వము

* ఇస్లాం మత వేదాంతము
* అల్లాను చేరుకొనే భక్తిమార్గము
* అల్లానుభూతి కలిగించే ప్రేమామృతము
* జీవన్ముక్తికి కొనిపోయే సాధన సోపానము
* ఋతస్యపంథా

తోక తునక

(అగ్నిహోత్రావధానులు ప్రవేశించును)

అగ్నిహో: ఏమండీ గిరీశంగారూ మా కుర్రవాడికి చదువు చెప్పుతున్నారూ?

గిరీశం : గంటసేపాయి చెప్పుతున్నానండీ

అగ్నిహో: యేదీ నే కూడా వింఛాను కొద్దిగా చెప్పండి.

గిరీశం : మై డియర్ బోయ్. గాడ్ మేడ్ క్రియేషన్ సృష్టి యెవడు చేసినాడు?

వేంకటేశం: దేవుడు.

గిరీశం : ఫాదర్ ఈజ్ నెక్స్ట్ టు గాడ్. దేవుడి తర్వాత ముఖ్యం యెవరూ నే. ఫాదర్.

వేంకటేశం: తండ్రి.

అగ్నిహో: మొత్తంమీద మీ ఇంగ్లీషు చదువు మంచిదిలాగే కనబడుతున్నది. భాషభేదం గాని మన ముక్కలే వాళ్ళ విన్నీ. ("కన్యాశుల్కం" నాటకము.)

(అంయి పోయింది)

అధోజ్ఞాపితలు : (39 నుండి 51 వరకు)

39) నాట్య దర్వీషులు:- దైవంమీద కీర్తన పాడుట మన లోనూ ఉన్నదే. మొదటి ఉదాహరణ దేవర్షి నారదుడే. మీరా బాయి, కృష్ణచైతన్యుడు, "బావుల్" పంథా భక్తులు (బెంగాలీ హిందువులు, ముస్లిములు) హరిదాసులు దైవసంకీర్తన చేస్తూ నాట్యమాడు భక్తులు. గ్రుడ్డి సూరదాసు, కీర్తన పాడుతుంటే బాలకృష్ణుడే వచ్చి తకతై, అని నాట్యమాడేవాడట. ఇది ఏమి చోద్యమమ్మా అని లక్ష్మీదేవి, బ్రహ్మరుద్ర తుంబురు నారదాదులు సూరదాసు గుడిసె బైట నిలబడి కిటికీగుండా ఆ యద్భుత దృశ్యాన్ని తిలకించి తరించిరట.

గోరాకుంబార్ అనే మహారాష్ట్ర భక్తుడు (కుమ్మరివాడు) పాండురంగ విఠలుని కీర్తిస్తూ తన్మయుడై మంటిలో నాట్యం చేస్తూ చిన్న కొడుకునే త్రొక్కివేసి చంపుకొన్నాడు. "బావుల్" భక్తులు ఏకతార వాయిస్తూ తన్మయత్వంతో నాట్యం చేస్తూ తత్వాలు (ఇవి మన వీరబ్రహ్మం అచల తత్వాలను బోలుతాయి) పాడుతారు. నాట్య దర్వీషులు మన గొరవయ్యలను బోలుతారు. గొరవయ్యలు అనంతపురం, కర్నూలు జిల్లాల్లో కొన్ని చోట్ల ఉన్నారు. వీరిది భిక్షుకవృత్తే కానీ జనులలో వీరంటే చాలా భక్తి ఉంది. వీరూ కంబళి అంగరఖా, ఉన్నిటోపి ధరిస్తారు. చేతిలో పిల్లనగ్రోవి, డమరుకం పట్టుకొని, గుంపు చేరి వలయాకారంగా నాట్యం చేస్తూ, పిల్లనగ్రోవి వూదుతూ, డమరుకం వాయిస్తూ శ్రీశైల మల్లికార్జునునిపై "మల్లయ్యా" అని పాటలు పాడుతారు. వీరు అగ్నిగుండం త్రొక్కుతారు. యుద్ధమల్లుని బెజవాడ శాసనం (క్రీ.శ. 8వ శతా)లో పేర్కొనబడిన "గొరగలు" గొరవయ్యలే.

40) అరచే దర్వీషులు:- "పండితారాధ్య చరిత్ర"లో వర్ణించిన మైలారదేవ భటులను పోలుతారు. కాకతీయుల నాటికే వీరు ఓరుగల్లులో వీధులలో తమ అద్భుత శక్తులను ప్రదర్శించే వారు. "క్రీడాభిరామం" అనే వీధి నాటకం (శ్రీనాథ కృత మంటారు)లో మైలారదేవ భటుల ప్రదర్శనా వర్ణన:

సీ. అవ అవ మందు నెత్తిని చంద్రదుల్లెల
 చోద్యంపు గుండాలు త్రొక్కువారు
కరవాడి యలుగుల గనవ పొత్తర్లలో
 నుట్టి చేరులు కోసి యుఱుకువారు
కటికి హొన్నాళంబు గండక త్తెర వట్టి
 మిసిమింతులను గాక మ్రింగువారు
గాలంపు గొంకిఁ గంకాళచర్మము గ్రుచ్చి
 యుడు వీధి నూయెల నూగువారు

గీ. సందులను నారసంబులు సలుపువారు
 యెడమ కుడిచేత నారతు లిచ్చువారు
 సాహసము మూర్తిగైకొన్న సరణివారు
 ధీర హృదయులు మైలార వీరభటులు

ఈ మైలార వీరభటులు శృంగనాదము, డమరు, డిండిమములను వాయిస్తారు. "గొండ్లి" అనే నాట్యం ఆడిస్తారు. వీరచ్చము దర్వీషులే అనవచ్చును.

41) భక్తులు నాలుకకు చాలా ప్రాముఖ్యాన్నిస్తారు.

"శ్రీనాథు వర్ణించు జిహ్వా జిహ్వా" -భాగవతము

"బ్రూహి ముకుందేతి హే రసనే" -స్తోత్రం

"కావ్యము దురాత్ముల కిచ్చితి మోసమయ్యె, నా రసనకు మోసముం గలిగె" -దాశరథీ శతకం

"ఆచార విల్లద నాలికే....నమ్మ పురందర విఠలనభజిసు నాలికే" -పురందరదాసు

42) ఇది, వీరశైవుల "అనుభవ మంటపాన్ని", బావాజీల బైరాగుల మఠాన్ని పోలుతుంది.

43) ఎల్లప్పుడూ "రామ రామ" అని జపంచేసే హనుమంతుడు తన హృదయాన్ని చీల్చి అందు సీతాలక్ష్మణ సమేతుడైన శ్రీరాముని చిత్రాన్ని చూపించే పటం అందరికీ తెలుసు. హనుమంతుని "ఆది నక్షబంది" అనవచ్చును. "నామధారు"లని ఉంటారు. వీరు వైష్ణవ లేక సిక్కు మతంవారు. వీరు హరి నామము (పేరు) ధరిస్తారు.

44) తెలుగులోని పాతకాలపు కథ "చార్ దర్వేషు కథలు" వీరి గురించినదే.

45) "నేను" అనేదే జీవభావం. "నేను" లేకుంటే ఇంక ఐక్యమయ్యేది ఎవరితో? కావున జీవుడు ("నేను") ఉండవలెను. అప్పుడే "నేను" "వాని" ("తత్")తో ఐక్యం చెందుతాను అని వ్యాఖ్యానించుకొనవలెను.

46) హిందూ దేవుళ్ళకు 108 పేర్లయినా (అష్టోత్తర శత నామావళి), 1000 పేర్లయినా (సహస్ర నామములు) ఉంటాయి.

47) హిందువులు "రామకోటి" వ్రాయుట, కోట్యర్చన, సహస్రనామ జపము, లక్షార్చన చేస్తారు. సిఖ్ఖు గ్రంథీలు స్వర్ణ మందిరంలో "గురు గ్రంథ సాహేబు" నుండి నిరంతరం అఖండ పాఠం చేస్తుంటారు. "శబద్"ల కీర్తన గాన మాధుర్యం అనుభవైక వేద్యం. కీర్తన గానమే లేకుంటే సిఖ్ఖుమతమే లేదని పండితులంటారు. వేదాలలో సామవేదాన్ని (వేదానాం సామవేదోస్మి) అని గీతాచార్యు డూరకనినాడా? ఆచారవంతులైన ముస్లింలు ఖురాను ప్రతిని చక్కని దస్తూరీలో వ్రాసి, దానిని అమ్మకొని ఆ పైకాన్ని పేదల కిచ్చివేస్తారు. కొందరు ప్రతులు వ్రాసి అమ్మకొని జీవిస్తారు. పుణ్యం పురుషార్థం రెండూ అబ్బుతాయి. ఖురానును సుందర లిపిలో వ్రాయడం ముస్లిములలో ఆదొక అద్భుత కళ.

48) వేదవ్యాసునకు 18 అనే సంఖ్య చాల ఇష్టం. (చూ. నా వ్యాసం "అష్టాదశ సంఖ్యా ప్రాశస్త్యము" ఆంధ్ర (దిన) పత్రిక 7-12-1986).

యూదు మతస్థులకు "18" సంఖ్య దైవమే. పైథాగరస్ ప్రకారం విశ్వమంతా సంఖ్యామయం. కపిలుని "సాంఖ్య దర్శనం" సృష్టినంతా 25 తత్వాలలో ఇమిడ్చింది.

49) మనలోనూ స్త్రీ వేదాంతినులూ, కీర్తన రచయిత్రులూ తక్కువే. కాశ్మీరులో హబ్బా ఖాతూన్ అనే ముస్లిము యోగిని అందరి గౌరవాన్ని పొందింది. ఉపనిషత్తులలో గార్గి, సులభ, మైత్రేయి అనే స్త్రీ వేదాంతినులున్నారు. భక్తురాండ్రు, కీర్తన కారిణులున్నారు. ఉదా: అవ్వయ్యార్, అక్కమహాదేవి, గోదాదేవి, మీరా, గిరియమ్మ, తరిగొండ వెంకమాంబ, జనాబాయి, ముక్తాబాయి.

యోగినులు: శారదామాత, పాండిచేరిమాత, జిల్లేళ్ళమూడి అమ్మ, కరడిగొట్టు మంగమ్మవ్వ (ప్రాచీనురాలు), ఆదోని తిక్కలక్ష్మమ్మ, బ్రహ్మకుమారిణులు.

మీరాబాయి కూడా (రాబియా వలెనే), ఒక గోస్వామి (రూప? జీవ?) అహంకారాన్ని పోగొట్టిన కథ సుప్రసిద్ధము. శ్రీకృష్ణుడొకడే పురుషుడు, సృష్టి అంతా స్త్రీయే అనే మధురభక్తి రహస్యాన్ని గోస్వామి అర్థం చేసికొనేటట్లు మందలించింది.

50) తత్వజ్ఞులు, శాస్త్రజ్ఞులు అపార్థం కాబడి ప్రభుత్వం వారిచేత కష్టాలు పడడం చరిత్రలో కనిపిస్తుంది. జడభరతుడు, సోక్రటీసు, బుద్ధుడు, ఏసుక్రీస్తు, మహమ్మదు, గయోర్డనో బ్రూనో, జాన్ హస్, విలియం టిండేలు మున్నగు తాత్వికులు గెలీలియో, డార్విన్, వావిలోవ్, బెర్నార్డ్ హౌస్సే (అర్జెంటినా శాస్త్రజ్ఞుడు) కష్టాల పాలయిరి. మధ్యమయుగంలో (15వ శతాబ్దం) సమర్కండులో ఉండిన ఖగోళ శాస్త్రజ్ఞుడు మీర్జా ఉలుగ్ బేగ్ "మతం ఎక్కడ ముగుస్తుందో, అక్కడ శాస్త్రం ప్రారంభిస్తుంది" అన్నందుకు ముస్లిం ముల్లాలు ఆయనను ఆయన కొడుకు చేతనే హత్య కావింపించినారు.

51) ఔరంగజేబు కాలంలో పంజాబులోని "సత్నామీ" అనే హిందూ సాధువులు తిరుగుబాటు చేసిరి. తూర్పిండియా కంపెనీ కాలంలో బెంగాలులోని సంతాలులనే గిరిజనులు సన్యాసుల నాయకత్వంలో ఇంగ్లీషువారి నెదిరించినారు. బంకించంద్రుని నవల "ఆనంద మఠ" ఈ ఉదంతాన్ని వర్ణించింది. "వందే మాతరం" గీతం ఈ నవలలోనిదే.

"వాహబీ" అను ముస్లిం పూర్వాచారులు 19వ శతాబ్దంలో ఇంగ్లీషువారు చేస్తున్న పాశ్చాత్యీకరణానికి వ్యతిరేకంగా ఉద్యమం లేవనెత్తిరి.

డిస్కో జలపాతాలు

'పాతాళం'లో
గిరగిరా తిరిగి,
కఠోరంగా పైకి వుబుకుతూ....
ఏవేవో తీగెలు కాయలు తప్ప,
చెట్లు చేమలు, రాళ్లు రప్పలు లేని
కొత్త కొండల్ని దూసుకు
భీకరంగా జాల్వారుతూ....

కిల కిల రావాల,
దూరంగా వినిపించే ఊళల
ఉభయ వేళల్లో
పవిత్ర మెట్లని
బ్లాక్ బోర్డ్ గదుల్ని
విజ్ఞాన నిధుల్ని
బస్సుల బాటల్ని
వరాహ విహార స్థలాల్ని —
ఇన్నెందుకు? అన్నిటిని
అకారణంగా ముంచెత్తుతూ-

అమాయకంగా జీవించే
గ్రామాల తలలకు యిరువైపులా వున్న
చిరు చెరువులకు
చిల్లులు పడేలా నిండుతూ....
హోరెత్తుతున్నాయి, జలపాతాలు-
డిస్కో జలపాతాలు!

వాటి ఉరవడి
నూడ క్రేళ్లు వారుతున్నట్టు లేదు-
విన కూజిస్తున్నట్టు లేదు-
చెప్ప మూర్ఛనలు పోతున్నట్టు లేదు-
రవళిస్తున్నట్టూ లేదు-
*"చిత్తకార్తె" వీధుల్లో కీచులాడుతూ
మొరుగుతున్నట్టు వుంది!

అయినా.......
మెదడు యింకా నడినెత్తి కెక్కని
కొన్ని తుమ్మెదలు,
సీతాకోకచిలుకలు
వాటినే యిష్టపడుతూ...
వాటిపై పిచ్చిగా వాలుతూ....
ఎట్టెదుట
వాడిపోతున్న పూలను నిర్లక్ష్యంగా చూస్తూ.
ఆ వురవడిలో కొట్టుకుపోతూ...!...

పోనీ, మనమైనా
అడ్డు ఏదైనా పెట్టి,
చిరు చెరువులకు
చిల్లులు పడకుండా చూద్దామంటే
ప్రత్తి మొక్కలు ఎప్పుడో
చీడపడి చచ్చాయి!
పండిన కొత్త దూది పింజలు
చీకిపోయాయి!

[* చిత్త....]

నీలి పక్షులు

ఎప్పుడో ఏ అర్థరాత్రో-
ఏ మొద్దు నిద్దరో
అంతకంటే కఠోరమైన
ఏ మృత్యువో
దారుణంగా వచ్చిపడినప్పుడు తప్ప
వాటి రెక్కలు
ఎప్పుడూ రెప రెప కొట్టుకుంటూనే
ఉంటాయి.... కానీ
ఆ రెండు నీలిపక్షులు మాత్రం
ఉన్నచోట్నుంచి
ఒక్క అంగుళమైనా కదలవు!

అవి ఉంటున్న;
లోతుగా భూమిలోకి పాదుకొని
రెండే రెండు వేళ్ళ
రెండే రెండు ఊడల
చెట్లు యిప్పుడు
చిగుళ్ళు వేయక
పూలు పూయక
కాయలు కాయక
మోడువారిపోతున్నా
మరో చెట్టు పైకి
వలస వెళ్ళవు!

నింగిలోకి....
నిటారుగా, విశాలంగా ఎదుగుతూ
అన్ని ఋతువుల్లోనూ
అందంగా అలరారుతున్న
చెట్లపై
ఇక్కట్లు ఇరులు లేక
మృదు మధురంగా కూజిస్తున్న
ఇంకే పక్షుల్ని చూసీ
ఈర్ష్యపడవు!

వాటి అంతరంగమేంటో-
గవ్వల్లాంటి ఆ రెండు పక్షులు
గువ్వల్లా
ఎప్పుడు కలుసుకుంటాయో-
ఎప్పుడు కూడపలుక్కుంటాయో-
వేటికీ అంతుపట్టినట్టు లేదు.... కానీ
ఆ చెట్టు మీది సానుభూతితో
అంతకుమించి దయతో
అవి పాడే కలల్ని, కన్నీటిని
అవి చదివే లోకాన్ని
ఆ చెట్టు మౌనంగా వుంటుంది!

ఖమ్రొద్దీన్

మనిషిలో మార్తాండుడు

శ్రీ కొణిపాకం లింగన్న

ఉషోదయ వేళ-
బాలభానునితో మేల్కొన్నాను.
పూల కోసం విరబూసిన-
వనంలో కాలు బెట్టేను.
తల నాడిస్తూ నన్ను పిలుస్తున్న - పూలు
చేతులెత్తి ఆహ్వానిస్తున్నాయి.
సువాసనలతో తడిసి ముద్దయినాను.
రంగులో రంగయినాను.
తిరిగేను - మరీ తిరిగేను.
ముగ్ధ మనోహరంగా
రేకులను అలంకరించుకున్న పూలు
నన్ను చుట్టి తిరుగుతున్నాయి.
ఎంతసేపు వాటిమధ్య ఉన్నానో
వింత! - గుర్తు లేదు.
ఎక్కడెక్కడ విశ్రమించేనో మనసుకు రాదు.
తీరా పడమటి దిక్కు ముఖం చూశాను.
సూర్యుడు అలసి సొలసి అస్తమిస్తున్నాడు.
ఇంటి ముఖం పట్టేను.
జోలె చూచుకుందును గదా!
అందులో ఒక పువ్వయినా
మిగలలేదు-!

రచన :
కీ. శే. కే. యస్. కోదండరామయ్య

సేకరణ, సమర్పణ :
శ్రీ కారుపల్లి విశ్వనాథం

నరస నాయకుడు-అన్నమయ్యగారు

మహానుభావుడు, పద కవితా పితామహుడు, వాగ్గేయకారుడు, శ్రీ వేంకటేశ్వర సంసేవా హేవాక నిపుణుడు, నయిన శ్రీ అన్నమాచార్యులు కడప జిల్లాలోని తాళ్ళపాక గ్రామములో క్రి. శ. 1408 వ సంవత్సరమున జన్మించెనని తెలియుచున్నది. అతనిది నందవరీక బ్రాహ్మణ వంశము. అన్నమయ్య గారికి ప్రహ్లాదునివలెనే విష్ణుభక్తి బాల్యమందే పట్టుబడెను. తిరుమల యందున్న వేంకటేశ్వరునిపై అతనికి గాఢమైన భక్తి పూర్వజన్మ సుకృతము వలన నేర్పడినది. అతడు తన 16వ యేట తిరుమలకు వచ్చి, స్వామిని దర్శనము చేసి కొన్నట్లును. ఆ సమయమున స్వామి అతనిని అనుగ్రహించినట్లును తెలియుచున్నది. ఆనాటినుండి ఆ భక్తుడు స్వామిమీద కీర్తనలను రచించుటకు మొదలిడెనట. దైవికమైన ఈ అనుభూతి అతనికి శక. 1346 క్రోధి సంవత్సరమున (=1424 క్రి.శ.) గలిగినదట. "స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహన శక వరుషంబులు 1346 అగు నేటి క్రోధి సంవత్సరమందు తాళ్ళపాక అన్నమాచార్యులు అవతరించిన పదారేళ్ళకు తిరువేంగడ నాథుడు ప్రత్యక్షమైతేను, అది మొదలు" ఆ దేవునిపై కీర్తనలు చెప్పుటకు ప్రారంభించెనట. "....అన్నమాచార్య కమెంన్స్‌డ్ కంపోజింగ్ బోత్ ది సంకీర్తనాస్ ఇన్ శక 1346, క్రోధి (= 1424 ఎ. సి.) బీయింగ్ దెన్ ఇన్ హిజ్ సిక్స్‌టీన్త్ ఇయర్ ఆఫ్ ఏజ్, డ్యూరింగ్ విచ్ హి హాడ్ ఎ మానిఫెస్టేషన్ ఆఫ్ గాడ్ తిరువేంగడనాథ...."

[వైడ్. టి. డి. ఇ. రిపోర్టు, పుట 280]

అతడు, విజయనగర సామ్రాజ్యమును పాలించిన, మొదటి దేవరాయల కాలమునుండి సాళువ వంశపురాజైన ఇమ్మడి నరసింహ రాయల కాలము వరకు జీవించి యుండెను. అనగా, నతని జీవిత కాలములో మొదటి దేవరాయలు, రెండవ దేవరాయలు, మల్లికార్జున రాయలు, విరూపాక్షరాయలు, సాళువ నరసింహరాయలు, సాళువ ఇమ్మడి నరసింహరాయలు, తుళువ నరసనాయకుడు మొదలగు ఏడు గురు చక్రవర్తులు పాలించిరని తెలియుచున్నది.

సాళువ వంశపు రాజుల కాలము నుండియే శ్రీవైష్ణవ మతమునకు విజయనగర సామ్రాజ్యమున బ్రహ్మాండమైన ప్రాముఖ్యత, తిరుమల దేవాలయముల యొక్క ప్రాధాన్యత ప్రారంభమైనదని తెలియుచున్నది. సాళువ నరసింహరాయల కాలము నుండియే తిరుమల క్షేత్రము చాలా ప్రసిద్ధికి వచ్చినది. "ఇట్ వాజ్ లెఫ్ట్ టు సాళువ నరసింగరాయదేవ మహారాయ టు ఓపన్ ఎ న్యూ చాప్టర్ ఇన్ ది హిస్టరీ ఆఫ్ ది తిరుమలై అండ్ తిరుపతి టెంపుల్ ...' [వైడ్. హిస్టరీ ఆఫ్ తిరుపతి. వాల్యూం 2. పు.567], అప్పటికే అన్నమయ్య గారికి వృద్ధాప్యదశ ప్రాప్తించి యుండెను. అన్నమయ్య గారి ప్రశంస సాళువ నరసింహరాయల కాలము నుండియే యెక్కువగ వ్యాప్తికి రాసాగినది. నరసింహరాయలు, మొట్టమొదటి అన్నమయ్య పాటలకు ఆనందించి, తనమీద కూడ నట్టి పాటలను వ్రాసి యిమ్మని అడిగెననియు, నందులకా భక్తుడు నరస్తుతి జేయనని నిరాకరించెననియు, నందుల కారాజు కోపించి అన్నమయ్య గారికి సంకెళ్ళు వేయించి చెఱసాలలో నుంచెననియు, ఆచార్యులు స్వామికి మొఱబెట్టుకొనగా నా సంకెళ్ళు తెగిపడెననియు, నంతటితో వదలక ఆ రాజు మరల సంకెళ్ళు వేయించెననియు, మరల దేవుని ప్రార్థింపగా సంకెళ్ళు వీడిపోయెననియు, అది జూచి నరసింహరాయలు భయపడి, అన్నమయ్యగారిని శరణువేడి, అప్పటినుండి అతని నెంతో గౌరవముగా జూచి, సత్కరించెనను నొక కథ అనుశృతముగా వచ్చుచున్నది, ఈ కథ దురదృష్టవశమున సాళువ నరసింహరాయల కంట గట్టబడియున్నది. ఆ నరసింహరాయలు వేంకటపతి భక్తుడు. తిరుమలలో నెన్నియో కైంకర్యముల జేయించెను. తిరుమల దేవాలయమునకు బెక్కు గ్రామములను సమర్పించెను. అతని స్వామిసేవ యిట్లు వర్ణించబడి యున్నది. "అంటిల్ సాళువ నరసింహ ఎంటర్డ్ ది సీన్ దేర్ వాజ్ వెరి లిట్ల్ ఇంప్రూవ్‌మెంట్ ఇన్ తిరుపతి అండ్ ఇట్స్ గోవిందరాజాస్ టెంపుల్... సాళువ నరసింహరాయల్, హిస్ క్వీన్ అండ్ అదర్ మెంబర్స్ ఆఫ్ హిజ్ ఫామిలీ ఆల్సో యేడ్ ఎండోమెంట్స్ ఆఫ్ ల్యాండ్స్...."

[వైడ్. హిస్టరీ ఆఫ్ తిరుపతి. ఇబిడ్. పుట. 567]

పిల్లలమఱ్ఱి పినవీరన కవి జైమినీ భారతములో నరసింహరాయల భక్తిని "శ్రీ వేంకటాద్రి నాథ దయావర్ధిత రాజ్య"

అనియు, "శ్రీ రమణ చరణకలిత నిచారణ" యనియు వర్ణించి యున్నాడు.

ఇట్టి పరమభక్తుడు, వేంకటేశ్వరస్వామి సేవానిరతుడు, కవి పండిత పోషకుడు, మహా సంస్కారవంతుడునైన నరసింహరాయలు దురభిమానముతో, మూర్ఖ బుద్ధితో అన్నమయ్య గారిని అవమానించెననియు, హింసలు బెట్టించెననియు నమ్ముటకుగాని విషయము. సాళువ నరసింహరాయలే అన్నమయ్య గారిని హింసించెనని యెచ్చటను ఆధార పూర్వకముగ తెలియదు. తిరుపతి దేవాలయ శాసన నివేదికయందు చెప్పబడలేదు. తిరుపతి దేవాలయ చరిత్ర గ్రంథము లందుగాని, నేను చూచినంత వరకీ విషయము లేదు. కాన, ఈ విషయమును గురించి చక్కని పరిశీలన జరుగవలసియున్నది.

కాని, అన్నమయ్య గారి కీర్తనలలో గొన్నిటియందు, ఆతడు రాజసభలను నిందించి యుండుట, తన కష్టములను దొలగింపక నూరక చూచుచుండుట న్యాయమా యని యాతడు స్వామితో మొఱబెట్టుకొని యుండుటను బట్టి, ఆతని కెవ్వరినుండియో కష్టములు గలిగెననియు, ఆ కష్టములనుదొలగించుమని యాతడు వేంకటేశ్వరుని ప్రార్థించె ననియు దెలియుచున్నది. ఆ కష్టమేదో తెలియదు. ఆతడిట్లు ప్రార్థించి యున్నాడు.

" నీ దాసుల భంగముల నీవు చూతువా ?
యేదని చూచేవు నీకు నెచ్చరించవలెనా ?
ఘోరపు రాజసభలకుంది విన్నవించితిమి,
యేరీతి పరాకునీకు నిక రక్షించరాదా ? "

కాని, అట్లాతని హింసించిన రాజెవ్వడనుట తెలియదు. ఆతడే రాజసభలకేగి యుండెనో, యెందుల కేగియుండెనో, ఆ రాజునకును, అన్నమయ్య గారికిని మధ్య గలిగిన తగవేదో తెలియదు. ఆతని కీర్తనలను చారిత్రక దృష్టితో పరిశీలించిన పక్షమున గొన్ని విషయములైనా తెలియవచ్చును. ఎవ్వరైనను సరియే ఆ మహాభక్తుని అవమానించి, హింసించినచో నది మహాపాపకరము, మరియు మహాపరాధమనుట నిక్కము.

సాళువ నరసింహరాయల ననంతర మాతని కుమారుడు ఇమ్మడి నరసింహరాయలు రాజ్యమునకు వచ్చెను. కృష్ణదేవరాయల తండ్రియైన నరసనాయకు డాతనికి సంరక్షకుడుగా నియమింపబడి రాజ్యపాలనా కార్యములను, విజయనగరము నుండి నిర్వహింపసాగెను. ఇమ్మడి నరసింహరాయలును, నరసనాయకుడును పరమ వైష్ణవులు. స్వామిసేవా కార్యనిరతులు. నరసనాయకుడు తిరుమలలో బ్రహ్మోత్సవమునాడు స్వామి ఉత్సవ విగ్రహము వేంచేయుట కొక మంటపమును గట్టించెననియు, తిరుమల మీద నొక పూదోటను వేయించెననియు దెలియుచున్నది. ఈ సమయములందతడు తిరుమలలో గొన్ని దినము లుండెనని తెలియుచున్నది. ఆ సమయమున అన్నమయ్య గారిని దర్శించి, అతని కీర్తనలను విని, ఆనందించి, ఆతనిని సత్కరించి యుండునని జెప్పవచ్చును.

ఆనాడు అన్నమయ్యగారి కీర్తనలను వినుటకు పురందర దాసులు గూడ తిరుమల కేతెంచి, అన్నమయ్యగారిని దర్శించి, వారి దివ్య కీర్తనలను విని పారవశ్య మొందెనట. మరియు అన్నమయ్య గారి ఆశీర్వాదములను గూడ బొందెనట. ఇట్లు, అన్నమయ్య గారి కీర్తన లాకాలమందే వ్యాప్తిలోనికి వచ్చియుండెనని తెలియుచున్నది. దీనినిబట్టి, ఆనాటి విజయనగర చక్రవర్తుల ఆస్థానమందును, వారి సామంతరాజుల ఆస్థానమందును నుండిన గాయకులు, ఆయా స్థానములలో అన్నమయ్యగారి కీర్తనలను బాడుచుండిరని చెప్పవచ్చును.

నరసనాయకుని యాస్థానములో నుండిన గాణలగములు (వేశ్యా స్త్రీలు) సంకీర్ణరాగములలో పాటలు పాడుచుండిరని వరాహ పురాణము నుండి తెలియుచున్నది. ఈ విషయమును జంటకవులిట్లు వర్ణించియున్నారు.

సీ. సంకీర్ణ రాగ రంజకులైన గాణల
గములు గీత ప్రబంధములు పాడ,

—అనియు, మరియొకచోట

"కం" నాళిక ముఖులు గొందరు
సాళగ సంకీర్ణ శుద్ధ సరణి మెఱయగా,
నాళతులు సేసి పాడిరి
తాళగతులు మంద్రమధ్య తారశ్రుతులన్,

అనియు, చెప్పియున్నారు.

ఆ కాలమున మేళకర్తల రాగము లేర్పడి యుండలేదట. సాళగ, సంకీర్ణ రాగములలోనే కీర్తనలను బాడు చుండిరని తెలియుచున్నది. అన్నమయ్య ఆ కాలము వాడు కాబట్టి, ఆతని కీర్తనలా సాళగ,సంకీర్ణ రాగములలో నుండవచ్చును. ఈ దృష్టితో వారి కీర్తనల రాగస్వరూపములను గురించి పరిశీలించవలసియున్నది.

ఇచ్చట మరియొక విషయమును గూడ చెప్పవలసియున్నది, వరాహ పురాణకర్తలగు జంట కవులలో నొకరగు నంది సింగయ, సంగీత శాస్త్ర మర్మజ్ఞుడని తెలియుచున్నది. వీరు రచించిన ప్రబంధ చంద్రోదయమున నీతడు "సంగీత నంది" అని చెప్పబడియున్నాడు.

(చూ. ప్రబంధ చంద్రోదయము. పీఠిక. పు. 24). ఈ విషయమును గురించి, కీ.శే. శ్రీ నిడదవోలు వేంకట రావుగారిట్లు చెప్పియున్నారు. "వీరు వాగేశ్వరీ మంత్ర సిద్ధి పారగులమని చెప్పుకొన్నారు .... సంగీతనంది నంది సింగన అని ప్రబోధ చంద్రోదయ ప్రారంభము నను, ఆశ్వాసాంత గద్యలలో చెప్పబడియుండుటచేతను, నంది సింగన సంగీత సాహిత్యముల యందు రెండింటను ప్రవీణుడని తెలియు చున్నది. కావున, సంగీత సాహిత్యములు వీరికి వంశానుగతములు.

[చూ. ప్రబోధ చంద్రోదయము. పీఠిక. పు. 9]

ఇట్లే నంది సింగయ, సంగీత శాస్త్ర పారంగతుడై నందువల్లనే నరసనాయకుని ఆస్థానములో గాణలగము లింపుగా పాడిరని మాత్రమే చెప్పక, వారు సంకీర్ణరాగములలో గీత ప్రబంధములు పాడిరని యొకచోటను, సాళగ సంకీర్ణరాగములు పాడిరని మరియొక చోటను చెప్పి ఆనాటి రాగ స్వరూపములను మనకు తెలియజేసి మహోపకార మొనర్చియున్నారు. ఆ వేశ్యలు సంగీతశాస్త్రమందు నిష్ణాతులై యుండి, వారి మధుర కంఠములతో మనోహరముగ రక్తి కట్టునట్లు పాడిన విషయమును "సంకీర్ణ రాగ రంజకులైన" యని వర్ణించియున్నారు. ఇది యాతని సంగీత శాస్త్రమందలి పాండిత్య మును, సంగీత మందలి అభిమానమును, రసజ్ఞతను దెలియజేయు చున్నది. ఈ జంటకవులు కథా సందర్భముల నుపయోగించుకొని, సంగీతశాస్త్ర విషయములను పెక్కుచోట్ల జెప్పియున్నారు. వరాహ పురాణములో భద్రాశ్వ మహారాజు కథను చెప్పుచు, నారదమహాముని నిట్లు వర్ణించియున్నారు.

సీ॥ "ప్రౌఢయై నూఱు తంత్రుల వీణ వాయించు
సరిలేని జగజెట్టి జంత్రగాడు."

[చూ. వరా హ. పు. అ. 9. పు. 28]

నారద మునీశ్వరుని వీణకు నూరు తంత్రులుండెనను విషయ మును జెప్పినారు, ఇది ఆ కవులకు సంగీత శాస్త్రమందుండిన ప్రత్యే కాసక్తిని. సంగీత శాస్త్ర విషయములను వినుటయందు నరసనాయ కున కుండిన అనురక్తిని విశదము చేయుచున్నది.

అన్నమయ్యగారు తిరుమలలో స్వామిసన్నిధిలో జీవితాంతము వరకు నుండి. వేలకొలదిగా కీర్తనలను రచించి, పాడిరని తెలియు చున్నది. ఆతడు కొన్ని గ్రంథములను గూడ వ్రాసినట్లు తెలియు చున్నది. అంత పెద్దకాలము బ్రతికి తిరుమల కేతించిన యెందరో రాజుల మరియు చక్రవర్తులచేత ప్రశంసింపబడినను, యెందులకో యాతని నామధేయముగాని, ఆతనిని గురించిన వివరములు కాని తిరుమలలోని శాసనముల కెక్కలేదు. "అన్నమాచార్య ఈజ్ ది అర్లీయస్ట్ మెంబర్ ఆఫ్ ది ఫామిలీ, బట్ నో ఎపిగ్రాఫికల్ రికార్డ్సు ఆర్ ఎవైలబుల్ ...."

[వైడ్. టి. డి. ఇ. రిపోర్టు. పు. 280]

అన్నమయ్యగారు జీవితాంతము వరకు భగవత్సేవలోనే గడపి తుదకు తన 96వ యేట, అనగా శక 1424, కు సరియగు దుందుభి సంవత్సరము ఫాల్గుణ బహుళ ద్వాదశి (క్రీ.శ.=23-2-1503) నాడు అవతారము చాలించినారని తెలియుచున్నది. "అన్నమయ్య కంటి న్యూడ్ హిజ్ వర్క్ అంటిల్ ది ట్వల్త్ డే ఆఫ్ ది డార్క్ ఫోర్ట్ నైట్ ఆఫ్ ఫాల్గుణ ఇన్ శక 1424, దుందుభి (=23 rd ఫిబ్రవరి 1503 ఏ. సి.... దెట్సొటుసే, ఫర్ ఎ పీరియడ్ ఆఫ్ యెటీ ఇయర్స్ ఫ్రమ్ 1424 టు 1503 ఏ.సి. అండ్ హిజ్ ఏజ్ అట్ హిజ్ రిటైర్‌మెంట్ ఫ్రమ్ హిజ్ లిటరరీ మ్యూజికల్ ఆక్టివిటీస్ వాజ్ దేర్‌ఫోర్ 96 యియర్స్ అండ్ హి మస్ట్ హావ్ డిసీస్ట్ అబవుట్ దిస్ డేట్ ...."

[వైడ్. టి; డి. ఇ. ఆర్. పి. 280]

ఆ సమయమున విజయనగర స్వామ్రాజ్యమును పాలించు చుండిన నరసనాయకుడు సయితము శక. 1425 కు సరియగు రుధిరోద్గారి సంవత్సరము మార్గశిర బహుళ దశమి బుధవారమ్ము (= క్రీ. శ. 13-12-1503) నాడు తన భౌతిక కాయమును చాలించెనట. అనగా అన్నమయ్యగారు నిర్యాణము చెందిన పిదప నరసనాయకుడు 9 నెలలు, 20 దినములు మాత్రము జీవించియుండె నని తెలియుచున్నది

మహాసుకృతశాలియగు అన్నమాచార్యులు, భగవంతుని శిశు భావముతో ప్రేమించి, వెన్న పాలు యారగింపజేసి, లాలిపాట పాడి, నిద్రబుచ్చి, మేలుకొలుపు రాగాలతో మేలుకొలిపి, పెంచి, పెద్దజేసి, ఆ స్వామి అలమేలు మంగతో మేలములాడుచుండగా సంతోషించి, తన వాక్ప్రసూనములతో బూజించి, తుదకు "అనేక యుగంబులు బ్రహ్మకల్పముల్ సమ్మదమంది వర్ణిల్లుము జవ్వన లీలల వేంకటేశ్వరా! యని స్వామిని ఆశీర్వదించి ధన్యుడయ్యెను...."భక్తు డేమైనా జేయగలడు, భగవంతుడు భక్త పరాధీనుడు కదా!

సాళగ - సంకీర్ణ రాగములు - వాని వివరములు

వరాహ పురాణములో జంట కవులు చెప్పియుండు, సాళగ మరియు సంకీర్ణ రాగములను గురించి యెవ్వరును పరిశీలించినట్లు తెలియదు. కాని, యా గ్రంథమును సిటీవల బరిష్కరించిన, కళాప్రపూర్ణ, సరస్వతీ పుత్ర బిరుదాంకితులగు శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులీ రాగములను గురించి యిట్లు జెప్పియున్నారు. "సాధారణముగా మేళకర్త రాగములను శుద్ధ రాగములన వచ్చును. కాని, యీ మేళకర్తల నిర్ణయము వరాహ పురాణమునకు దరువాత వచ్చినదే. మతంగుడు వ్రాసిన బృహద్దేశమను గ్రంథములో రాగములను, శుద్ధ, ఛాయాలగ, సంకీర్ణ రాగములుగా విభాగించి యున్నాడు. నేడు ఉపాంగ, భాషాంగ, క్రియాంగ రాగాంగములన్నారు. ఛాయాలగమే సాళగము. ఒక రాగములో నన్యరాగచ్ఛాయ వచ్చినచో నది సాళగము. బిలహరి రాగమునకు గాకలీనిషాదము. కాని, 'పదని, 'పదప' యిత్యాది ప్రయోగములలో కైశికీ నిషాదమై అన్యరాగము ఛాయా మాత్రముగ గన్పించును. సంకీర్ణ రాగమునకు నేటి కాపి, బేహాగ్ మొదలగు వానిని ఉదాహరణములుగా దీసికొనవచ్చును. ఈ కవులు జూపించిన వ్రేలితో, దరువాతి విజయనగర కవులు హస్తమంతయు ప్రమింగినారు. సంగీత పరిష్కృతములైన వీరి కొన్ని 'బాణీ'లను వసుచరిత్రకారుడనుసరించెను. .... రాయల కాలములోని కవులు వరాహపురాణమను పునాదిపై మేడను గట్టిరను మాట కొంత విడ్డూరముగ నున్నను, సత్యదూరము మాత్రము కాదు."

[చూ. వరాహ పురాణము - ద్వితీయ ముద్రణము-పీఠిక].

ఇట్లు, వరాహ పురాణములో జంట కవులు చెప్పియుండు రాగముల స్వరూప, స్వభావములను గురించిన కొన్ని వివరముల నైనను జెప్పుటయే కాక, ఆ గ్రంథముయొక్క ప్రాశస్త్యమును గురించి తెలియజేసిన శ్రీ నారాయణా చార్యులవారు స్తవనీయులు. నరసనాయకుని యాస్థానమందుండిన గాణలు అన్నమయ్యగారి కీర్తనలను పాడి యుండవచ్చును. ఈ విషయమును లోతుగా బరిశీలింపవలసి యున్నది.

భావనా స్వప్నం

శ్రీ పైల కృష్ణారావు

నీ తలపులు పూల పడవలై తేలివచ్చి
నా హృదయతీరంలో లంగరు వేసుకుంటున్నాయి.
నీ అడుగుజాడలు నందనాలై
నా ఎడారి బతుకులో నిత్య వసంతాలు వెలయిస్తున్నాయి.
నీ కనులు గ్రహతారకలై
నన్ను నీ చరణ పరమాణువుగా అనుగ్రహిస్తున్నాయి.
నీ చూపులు వెలుగుల జలపాతాలై
నా తనువులో అణువణువునీ వెలగిస్తున్నాయి
నీ మౌనం సామగానమై వినిపిస్తూ
నా అంతరంగంలో జ్ఞానసుధలు కురిపిస్తోంది.
అపురూపమూ, ఆపాతమధురమూ నీ దరహాసము
అందానికీ, ఆనందానికీ పరమావధి నీ సహవాసము.
నీ వనంత తేజోవార్ధివి, అనూన జ్ఞాన నిధివి.
నిత్యమూ, సత్యమూ, వ్యస్తమూ, సమస్తమూ ఐన
నీ మనోహరాకృతిని ఎన్ని యుగాలైనా నేను
ఇలాగే చూడాలనుకుంటాను.
కాని
ప్రాపంచిక వాసనా ప్రబల ప్రలోభాహతికి
నా భావనా స్వప్నం భ్రద్దలై నేను జారిపడినపుడు
నా మందభాగ్యతను తలచుకుంటూ ఉంటాను
నా అల్పజ్ఞతకు సిగ్గుతో తల వంచుకుంటాను.

కలగూరగంప

అది అపచారమగునో కాదో సహృదయులు నిర్ణయించాలి

మే '89 భారతిలో నేను "షష్ఠే చత్వాం తథా కాలే" అన్న వ్యాసంలో కృష్ణుడు కర్ణుడిని ద్రౌపదికి ఆరవ భర్తగా ప్రతిపాదించిన వాక్యం అనౌచిత్యమన్న ధారణతో ఆ పంక్తి ప్రక్షిప్తం కావచ్చునని చర్చించాను. జూన్ '89 భారతిలో శ్రీ మానాప్రగడ ప్రకాశంగారు అసలది అనుచితం కాదనీ, కృష్ణుడు కర్ణుడిని కనకాధికారకాంతలన్నిటితో రాజకీయ చాతుర్యంతో పరీక్షించాడనీ, అది కర్ణుడి వ్యక్తిత్వ మహత్త్వాన్ని నిరూపించిన గొప్ప ఘట్టమనీ అభిప్రాయం వ్యక్తపరచారు.

అందరి మనుష్యుల జీవితాలూ రాజకీయాలు కావు. ఐదు ఊళ్ళు ఇస్తే జరిగినదంతా మరచిపోయి తాను శాంతికి ఒప్పుకొంటానంటాడు ధర్మరాజు రాజకీయంగా. కాని ద్రౌపది ఒప్పుకోదు. అట్లా అయితే నా కొడుకులు వెళ్ళి యుద్ధం చేస్తారంటుంది అవమాన రోషంతో.

కర్ణుణ్ణి కాంతాపరీక్షకి గురి చెయ్యాలంటే అందుకు తగిన ఇతర స్త్రీలను కృష్ణుడు ప్రస్తావించవచ్చును. యౌవనవంతులైన ఐదుగురు కొడుకుల తల్లి, పాండవుల పట్టపురాణి అయిన ద్రౌపది పేరుని ఇందుకు ఉపయోగించవచ్చునా? ద్రౌపదికి ఐదుగురు భర్తలని శివుడి వరం (ఆది, 189, 45-47). కనుక లౌకికంగా గాని దైవికంగా గాని ఆమెకు ఆరవ భర్తను సూచించడం అపచారం కాదా?

కర్ణుడిలో కొన్ని గొప్ప గుణాలు ఉన్నాయి. దాన పరాక్రమావ్యాజ స్నేహాలు అతని సద్గుణాలు. అతని పుట్టుకా చావు విషాద భరితాలు. ఇవన్నీ మహాభారతంలో వర్ణితములు, శ్లాఘితములు. కాని అతని దుర్గుణాలు కూడా కావ్యంలో బాగా కనిపిస్తాయి. వాచాలత్వం, గర్వం, మూర్ఖత్వం, నీచత్వం అతని దుర్గుణాలు. ద్యూత సభలో ద్రౌపదిని వివస్త్రను చెయ్యడానికి దుశ్శాసనుడిని ప్రోత్సహించినది కర్ణుడే (61, 38). అంతేకాక అప్పుడు కర్ణుడు ద్రౌపదితో ఇలా అంటాడు - "ఇప్పుడు నీకిక ధార్తరాష్ట్రులు ప్రభువులు, పాండవులు కారు. జూదంలో దాస్యం పొందకుండా ఉండాలంటే నువ్వింకొక పతిని సంపాదించుకో." దాసీ స్త్రీలకు తమ యజమానులతో విశృంఖల కామవృత్తి సాధారణమే. ముందు ముందు అది నీకు ప్రతిదినము అనుభూతమగును గాక" అని (63, 2-3). ద్రౌపదితో సభలో ఇంత నీచంగా మాటాడిన కర్ణుడితో ఆమెను జోడిస్తూ కృష్ణుడిట్లా మాటాడతాడా?

మూలగ్రంథంలో ఉంది కనుక తిక్కన తెనిగించి ఉండవచ్చును. తిరుపతి వేంకట కవులు కూడా వ్రాసి ఉండవచ్చును. అంతమాత్రం చేత అది అనౌచిత్యం కాకుండా పోతుందా?

ఇంకొక విషయం కూడా పునర్విచారిస్తాను. షష్ఠే చత్వాం అన్న వాక్యంలో ఉపగమిష్యతి అన్న మాటకి సమీపించుట అన్న అర్థం గ్రహించి అభిషేక ముహూర్తంలో కర్ణుడికి నీరాజనం ఇవ్వడానికి ద్రౌపది వస్తుంది అన్న అర్థం ఎందుకు చెప్పకూడదు అని ఎవరైనా ప్రశ్నించవచ్చును. కాని మంగళహారతి ఇవ్వడానికి ఒక్క ద్రౌపదే రావాలా? పాండవ పత్నులందరూ రావచ్చును. పెద్ద ముత్తైదువలు రావచ్చును. ఇంతేకాక శాబర భాష్యంలో కుమారిల భట్టు ఈ వాక్యం ఉదాహరించి దీనికి అర్థం ద్రౌపదికి కర్ణుణ్ణి ఆరవ భర్తగా సూచించడమన్న అర్థమే చెప్పాడు. (మీమాంసా దర్శనం, 1-3-7)

కనుక ఈ పంక్తి చాలాకాలం క్రితమే అక్కడ ప్రక్షిప్తమై ఉంటుందని నేను మళ్ళీ ప్రతిపాదిస్తున్నాను. నిర్ణయానికి సహృదయులే ప్రమాణం.

కాశూరి హనుమంతరావు

భారతేందు - వీరేశలింగం పంతులుగారి నాట్య దిగ్దర్శిక

ఆధునిక హిందీ - తెలుగు సారస్వతములందు భారతేందు, వీరేశలింగంగారలకి విశిష్ట స్థానములు ఉన్నాయి. వారిద్దరూ కవీంద్రులు, భావుకులు, గ్రంథకర్తలు, ప్రవక్తలు.

భారతేందుగారి నాట్యరచనలు :

భారతేందుగారు తన నాట్య రచనా విధానము రెండు విధములుగా విభజించిరి.

అనూదిత నాటకములు :

ఇందులో విద్యాసుందరము, రత్నావళి, పాఖండవిడంబన, ధనంజయ విజయము, ముద్రా రాక్షసము వచ్చుచున్నవి.

విద్యాసుందరము :

మహారాజ్ యతీంద్ర మోహన ఠాకూరు రచించిన బంగ్లా నాటకమును పద్దెనిమిదవ ఏట క్రీ॥శ॥ 1876లో కవీంద్రులు భారతేందు విద్యాసుందరము అను పేరుతో అనువదించారు. భారతేందుగారి దృష్టిలో ఇది హిందీ భాషలో రాసిన నాల్గవ నాటకము. మహారాజ్ రఘునాథ్ సింగ్ రచించిన ఆనంద రఘు నందనము మొదటిది, గోపాల్‌చంద్ రచించిన 'నహుష' రెండవది, ఇక రాజా లక్ష్మణసింగ్ రచించినది మూడవది. ఈ నాటకాన్ని రెండవ సంస్కరణము సంవత్ 1939లో ప్రచురింప బడినది. ఇందులో మూడంకములు ఉన్నవి. పురుష పాత్రలు ఎనిమిది, స్త్రీపాత్రలు ఐదు. ముఖ్యపాత్రలలో విద్యాసుందరము, విద్యరాజు, హీరా మాలిన్, గాంగాభట్టుడు మొదలగువారు ఉన్నారు.

రత్నావళి :

శ్రీహర్షుడు రచించిన "రత్నావళి" సంస్కృత నాటకాను వాదము. దీనిని క్రీ.శ. 1868లో అనువదించిరి. ఇది చరిత్రాత్మక నాటకము. ఇందులో గీత కవిత్వములు ఉన్నవి.

పాఖండ విడంబనము :

మహాకవి కృష్ణమిశ్రుడు రచించిన ప్రబోధ చంద్రోదయము అను నాటకమును కవీంద్రులు భారతేందు పద్దెనిమిది సంవత్సరముల వయస్సున క్రీ.శ. 1872లో పాఖండ విడంబనము పేరుతో తృతీయాంకమును మాత్రము అనువదించి, ముద్రించారు. ఇది అసంపూర్ణము. పురుష పాత్రలలో ముగ్గురు ఉన్నారు. స్త్రీలలో శాంతి, కరుణ, శ్రద్ధ. ఇందులో ఇరవై నాల్గు దోహాలు, గీతము ఒకటి. నాటక కథాసారాంశము ఇలాగ ఉంది. శ్రద్ధను వెదకుటలో శాంతి, కరుణ, పాఖండుని ఇల్లు చేరారు. అక్కడ దిగంబరునితో పాటు తమో గుణీయుమైన శ్రద్ధతో సాక్షాత్కారం; భిక్షు దిగంబరుని మాట ప్రతిమాటలు, పితంతుడైన కాపాలికుని వేషములో సోమ సిద్ధాంతుడు వచ్చుట, శ్రద్ధను భిక్షు దిగంబరులని భ్రష్టుడిగా చేయుట, సోమ సిద్ధాంతుడు వచ్చుట, ఇక దీని సంకేతముపై కాపాలికిని వేషములో శ్రద్ధను సురాపానము చేయించుట ఉంటాయి. ఇది వ్యంగ్య రచన.

ధనంజయ విజయము :

శ్రీ కవికాంచన్ రచించిన సంస్కృత నాటకాన్ని క్రీ॥శ॥ 1874లో భారతేందుగారు తెనిగింపచేసిరి. ఈ నాటకాన్ని కథా సారాంశము మహాభారతమున విరాటపర్వము నుంచి తీసికొనబడినది. పురుష పాత్రలు పద్నాల్గు - అర్జునుడు, ఇంద్రుడు, ఉత్తర కుమారుడు మొదలగువారు ఉన్నారు.

ముద్రా రాక్షసము :

కవి విశాఖదత్తుడు రచించిన సంస్కృత నాటకానికి హిందీ అనువాదము. ఈ నాటకము బాలాబోధిని అను పత్రికలో క్రీ॥శ॥ 1875 నుండి 1877 వరకు క్రమముగా ప్రచురించబడినది. ప్రారంభములో పూర్వకథలు నందవంశ మగధరాజు చరిత్రము కలవు. అంకములు-7, దృశ్యములు-8, పురుష పాత్రలలో-25, స్త్రీలు-3. చాణక్యుడు, చంద్రగుప్తుడు, చందనదాసుడు, భాగురాయణుడు, మలయకేతుడు మొదలగువారు ముఖ్యమైన పాత్రలు. ఇందులో సంగీత రాగాలు-ఖ్యాల్, ఠుమరీ మొదలగునవి ఉన్నవి. ఇది రాజనీతిక నాటకము.

స్వతంత్ర నాటకము :

కవీంద్రులు భారతేందు ఈ నాటకము క్రీ॥శ॥ 1876వ సంవత్సరమున తన 26వ ఏట రచించారు. ప్రయాగ్ ఆర్య నాటక సభలో నటించారు. ఈ సంవత్సరములోనే ఆర్య నాటక సభ కూడ స్థాపించబడినది. ఇందులో దృశ్యము ఒకటి, పురుష పాత్ర ఒకటి, స్త్రీ పాత్ర ఒకటి, సూత్రధారుడు, నటి. ఈ నాటికలో రాసిన గీతము చాలా మహత్వపూర్ణమైనది. రసము వాత్సల్యము.

సత్యహరిశ్చంద్రుడు :

క్రీ॥శ॥ 1876లో రచించిరి. ఇది అర్థమౌలికం. మొట్ట మొదట కాశీ పత్రికలో (పాక్షిక) క్రమముగా ప్రచురించబడినది. తరువాతి కాలంలో న్యూ మెడికల్ హాల్ ప్రెస్ నుండి 1876లో వేయబడినది. ఇందులో నాల్గు అంకములు ఉన్నవి. పురుష పాత్రలు పద్దెనిమిది, స్త్రీ పాత్రలు ఆరు. సూత్రధారుడు, నటీ, ఇంద్రుడు, నారదుడు, విశ్వామిత్రుడు, హరిశ్చంద్రుడు, శైవ్య, రోహితాశ్వుడు, భగవానుడు మొదలగువారు ఉన్నారు. ఇందులో రాసిన గీతములలో దోహాలు-1?, శ్లోకములు-6, కవిత్వములు-13 ఉన్నవి. ఇది పౌరాణిక నాటకము మరియు అత్యంత లోకప్రియమైన నాటకము. బలియా ప్రాంతములో శ్రీ రవిదత్తా శుక్లాగారు నటించారు. అందులో హరిశ్చంద్రుని భూమికలో కవీంద్రులు భారతేందు స్వయం నటించిరి.

చంద్రావళి :

ఇది భారతేందుగారికి స్వతంత్ర సంపూర్ణమైన నాటకము. తన 26వ సంవత్సరములో క్రీ॥శ॥ 1876లో వ్రాసిరి. ఇందులో

నాల్గు అంకములు ఉన్నవి. పురుష పాత్రలు-5, స్త్రీ పాత్రలు-18, సూత్రధారుడు, పరిపార్శ్వకుడు, శుకదేవుడు, కృష్ణుడు, లలిత, వనదేవి, విశాఖ, సంధ్య, మాధవి, మాధురి, భావనా, కామినీ, చంద్రకాంతా, విలాసిని, కామమంజరి, చంపకలతా, మొదలగు వారు ఉన్నారు. ఇందులో దోహాలు-19, కవిత్వములు-25, ఇక గీతములు-25 ఉన్నవి.

భారత్ దుర్దశ :

క్రీ॥శ॥ 1876లో తన ఇరవై ఆరవ సంవత్సరములో, కవీంద్రులు భారతేందు భారత్ దుర్దశ అను నాటకమును రచించారు. ఇది పూర్ణ, స్వతంత్ర లాస్యరూపకము. ఇందులో అంకములు ఆరు, దృశ్యములు ఆరు ఉన్నవి. పురుష పాత్రలు-16, స్త్రీ పాత్రలు-3. ఇందులో తొమ్మిది దోహాలు, గీతములు-13. కథలో ఒక యోగి ద్వారా భారతదేశము యొక్క దుర్దశను శోక రూపములో ప్రకటించారు. తత్కాలీన పరిస్థితులను గురించి ఈ నాటకము చాలా మహత్వపూర్ణమైనది. ఇది కరుణరస ప్రధాన మైన నాటకము. ఇందులో కవీంద్రులు భారతేందు ఆనాటి భారత వర్షముయొక్క యదార్థమైన పరిస్థితులను గూర్చి వర్ణించుచూ బ్రిటీషు రాజ్యమును ప్రత్యక్షముగా కటువ్యంగ్యముగా విమర్శించిరి. ఇది వ్యంగ్య ప్రధానమైన నాటకము. సంఘ-సంస్కరణ దృష్టిలో చాలా విశిష్టమైనది. కాన్‌పూర్ నగరములో పండిత్ ప్రతాప నారాయణ మిశ్రాగారు నటించారు.

భారత జననీ :

ఈ నాటకము కవీంద్రులు భారతేందు క్రీ॥శ॥ 1877లో రచించిరి. తరువాత డిసెంబర్ మాసములో క్రీ॥శ॥ 1877లో హరిశ్చంద్ర చంద్రికా అను పత్రికలో వేయబడినది. ఇందులో పురుష పాత్రలు-7, స్త్రీపాత్రలు-4. సూత్రధారుడు, భారత్ జననీ, లక్ష్మి, దుర్గ, మొదలగువారు ఉన్నారు. గీతకవిత్వములో శాస్త్రాల్, ఠుమరీ, చైతీ ప్రయోగించిరి. ఇది సాంఘిక సంస్కరణ నాటకము. కరుణరస ప్రధానము.

నీలదేవి :

తన 30వ ఏట క్రీ॥శ॥ 1880లో కవీంద్రులు భారతేందు దీనిని రచించారు. ఇది స్వతంత్ర, ప్రయోగాత్మకము, చారిత్రాత్మక మైన గీతి రూపకము. క్రీ॥శ॥ 1888లో దీని ఒక సంస్కరణము ప్రచురించబడినది. ఇందులో పురుష పాత్రలు-21, స్త్రీపాత్రలు-5, సూర్యదేవుడు, సోమదేవుడు, అబ్దుల్ శరీఫ్‌ఖాన్, వసంత విష్ణు శర్మ, నీలదేవి మొదలగువారు ఉన్నారు. గీతములు-14, గజల్-1, లావనీ-1.

సతీ ప్రతాపము :

క్రీ॥శ॥ 1884లో తన ముప్పైనాల్గవ సంవత్సరములో రచించారు. ఇది స్వతంత్ర గీతి రూపకము కాని అపూర్ణము. హరిశ్చంద్ర చంద్రికా అను పత్రికలో 1884లో ప్రచురించబడి నది. ఇది పౌరాణిక రూపకము. ఇందులో పురుష పాత్రలు-7, స్త్రీ పాత్రలు-8 : సావిత్రీ, సత్యవాన్, లవంగీ, మధుకరి, సుర బాలా మొదలగువారు ముఖ్యమైన పాత్రలు. కథలలో సావిత్రి సత్యవాన్‌ను పరిచయము చేసికొనుట, నారదముని ద్వారా ద్యుమత్సేన మును ఆల్పాయుని చెప్పుట, సత్యవాన్‌తో వివాహమాడుట, పరామర్శ మొదలగునవి ఉన్నవి. ఇది ముఖ్యంగా స్త్రీ ప్రధాన మైన నాటకము.

కందుకూరి వీరేశలింగం పంతులు

మొదటి తెలుగు నాటక ప్రయోక్త :

శ్రీ వీరేశలింగంగారు అనేకవిధ గ్రంథాలనే గాక 13 ప్రహసనాలను, 20 నాటకాలను రచించారు. వీనిలో కొన్ని రచనలు అసమగ్రములు. వీరి రచనా వ్యాసంగం 1870లోనే ప్రారంభమయింది. కాని నాటక రచనకు మాత్రం వారు 1875లో శ్రీకారం చుట్టారు. శ్రీ వీరేశలింగం వ్రాసిన నాటకాలు మూడు విధాలుగా విభజింపబడినవి.

1) అనూదిత నాటకాలు

2) పౌరాణిక నాటకాలు

2) సాంఘిక నాటకాలు

అనూదిత నాటకాలు : సంస్కృత నాటకానువాదము.

శాకుంతలము :

సంస్కృత మహాకవి కాళిదాసు విరచితమైన శాకుంతల నాటకాన్ని వీరేశలింగంగారు 1775వ సం॥లో అనువదించ ప్రారం భించి 1882వ సం॥లో ముద్రించారు. ఈ అనువాదం సరళ తెలుగులో ఉంది. శాకుంతలంలోని చతుర్థాంకం ప్రఖ్యాతి గాంచినది.

రత్నావళి :

కాశ్మీరదేశ ప్రభువయిన శ్రీహర్షదేవుడు సంస్కృత భాషలో రచించిన రత్నావళి నాటికను కవీంద్రులు వీరేశలింగం గారు 1880వ సం॥లో అనువదించారు. రత్నావళి నాటిక ఉప రూపకాల్లో ఒకటి. ఇది సంకీర్ణ రూపకం. ఇందులో రూపక

లక్షణాలు, ప్రకరణ లక్షణాలు కూడ ఉంటవి. ఇందులో శృంగారం ప్రధానం. వృత్తి కైశికవృత్తి. అంకాలు నాల్గు. దీనిలో నాయకుడు ఉదయనుడు, నాయిక రత్నావళి. రత్నావళి వివాహమాడినవాడు సార్వభౌముడవుతాడని ఒక సిద్ధునివల్ల మంత్రి యౌగంధరాయణుడు తెలిసికొంటాడు. దానికై ప్రయత్నిస్తాడు. ఆ ఆకాంక్షే, ప్రయత్నమే ఈ నాటికకు మూలకారణం.

మాళవికాగ్నిమిత్రము :

మహాకవి కాళిదాసు రచించిన ఈ నాటకాన్ని శ్రీ వీరేశలింగంగారు 1885వ సంవత్సరంలో అనువదించి ప్రకటించారు. మీరు చేసిన అనువాదం సరస, సులభ, సుందరశైలిలో ఉంది. ఇందులో కథానాయకుడు అగ్నిమిత్రుడు మగధ రాజయిన పుష్యమిత్రుని కుమారుడు. నాయిక మాళవిక. విసర్గ సౌందర్య సాలభంజిక. విదర్భ రాజయిన మాధవసేనుని సహోదరి. ఆమె సౌందర్యానికి ముగ్ధుడవుతాడు. రాజు ప్రత్యక్షంగా మాళవిక మనోమంజులమయిన సాహిత్యాన్ని తనివితీరా చూచి ఉత్కంఠ చెందుతాడు. మాళవిక కూడ రాజుమీద మనసు లగ్నం చేసికొని విరహవేదన పొందుతుంది. వారి హృదయాల్లో నాటబడిన ప్రేమాంకురము పూచి ఫలించడానికి పరిస్థితులు సహాయపడతవి. పంతులుగారు చేసిన అనువాదము సామాన్య జనులకు సహజముగా బోధపడింది.

ప్రబోధ చంద్రోదయము :

శ్రీకృష్ణ మిత్రుడు సంస్కృత భాషలో రచించిన ప్రబోధ చంద్రోదయము అను నాటకాన్ని పంతులుగారు 1885లో అనువదింపనారంభించి 1891లో పూర్తి చేసి ముద్రించారు. ఈ అనువాదము యథామూలకం. నాటకములోని కథావస్తువు అద్వైతమత ప్రతిష్ఠాపన. నాయకుడు వివేకుడు, మరియు నాయిక ఉపనిషద్దేవి. ప్రతినాయకుడు మహామోహుడు.

కామెడీ ఆఫ్ ఎరర్స్ :

దీనిని మహాకవి షేక్స్పియర్ రచించెను. ఈ నాటకాన్ని శ్రీ వీరేశలింగం పంతులు పూర్తిగా తెనిగించలేదు. దీని అనువాదాన్ని 1875లో ప్రారంభించి వివేకవర్ధిని అను సంచికలలో రెండింటిలో ప్రకటించారు. తరువాత వారు దానిని ఆంధ్రీకరించలేదు, ప్రకటించలేదు.

వెన్నిసు వర్తక చరిత్రము :

కవీంద్రులు పంతులుగారు రెండంకములు మాత్రమే ఆంధ్రీకరించారు. తక్కిన అంకములు ఎందుకు తెనిగించలేదో తెలియదు. దీనిని 1880వ సం॥లో తెనిగించారు. ఇందులో చేసిన అనువాద వాక్యాలు ఆంగ్లరీతిగానే ఉన్నవి. కాని ఆ వాక్యాల్లో తెనుగుదనం కనిపించదు.

చమత్కార రత్నావళి :

1878 సం॥లో అసమగ్రంగా తెనిగించిన "కామెడి ఆఫ్ ఎరర్స్" 1880 సం॥లో చమత్కార రత్నావళి అను పేర గద్యాత్మకంగా కవీంద్రులు పంతులుగారు తెనిగించారు. ఈ నాటకము పాఠకులకు సుబోధం కావడం కోసం వారు మూలానుసారంగా అనువదిస్తూ కొన్ని మార్పులు చేసారు. ఈ నాటకము అనేక పర్యాయాలు పలు స్థలాలలో ప్రదర్శింపబడ్డది.

రాగమంజరి :

ఆంగ్ల నాటకకారుడు శ్రీ రిచార్డ్ బ్రీన్స్లీ రచించిన నాటకాన్ని రాగమంజరి అను పేరుతో పంతులుగారు 1885వ సం॥లో గద్య పద్యాత్మకంగా (చేంపూ) ఆంధ్రీకరించారు. ఇది సంఘ సంస్కరణ ప్రధానమైన నాటకము. ఆ కాలములో దేవాలయమున పూజారుల మతాచార్యుల మధుసేవనంపై కటు వ్యంగ్యము చేసేరు.

కల్యాణ కల్పవల్లి :

రిచార్డ్ బ్రీన్స్లే రచించిన నాటకాన్ని కందుకూరి పంతులుగారు కల్యాణ కల్పవల్లి అను పేరుతో అనువదించారు. దీనిని గద్యాత్మకంగానే పేరులు మార్చి, సన్నివేశ స్థలాలు మార్చి రచించారు.

పౌరాణిక నాటకాలు :

ప్రహ్లాద, దక్షిణ గోగ్రహణము. ఇక సత్యహరిశ్చంద్ర నాటకము వీరి స్వతంత్ర రచనలు. పంతులుగారు ఈ నాటకములలో కథలను ఇతివృత్తాలుగా స్వీకరించి నాటక రచనకు శ్రీకారం చుట్టిన ప్రప్రథములు వీరే.

సాంఘిక నాటకాలు :

కందుకూరి వీరేశలింగం రచించిన నాటకాలలో, సాంఘిక నాటకాలకు నాటకరంగంలో ఒక విశిష్టమైన స్థానము ఉన్నవి. ఇందులో బ్రాహ్మ వివాహము, వ్యవహార ధర్మబోధిని, స్త్రీ పునర్వివాహ నాటకము, కౌతుకవర్ధిని మొదలగునవి. కొన్ని ఆక్షేపగర్భ నాటకాలు కూడ ఉన్నవి. అందులో తిర్యగ్విద్వన్మహాసభ. మూషికాసుర విజయము, మహారణ్య పురాధిపత్యము లున్నవి.

బ్రాహ్మ వివాహము ముఖ్యంగా దుష్ట ఛాందస సంప్ర దాయాలు రూపుమాపి సంఘోద్ధరణ జరగాలని ప్రజా నైతిక ప్రవర్తనలో నూతన చైతన్యంతో వర్ధిల్లాలనే సదాశయంతోనే వ్రాసి 1878వ సం॥లో ప్రచురించారు.

భారతేందు హరిశ్చంద్ర, కందుకూరి వీరేశలింగం పంతులుగారి నాటకాలు ఆనాటి సంఘంలోని కుళ్ళును పెళ్ళగించా లనే తలంపుతో రచింపబడ్డవి. సంఘోద్ధరణం వారి రచనా ప్రయోజనం. ఇద్దరును తమ నాటకాలలో విజ్ఞానాన్ని ముందు బెట్టి వినోదాన్ని వెనక్కు పెట్టి నాటకాన్ని రచించి తమ సంఘ సంస్కరణోద్యమానికి కరదీపికలు చేసికొన్నారు.

[రచయిత ఉత్తరప్రదేశ్‌కి చెందినవారు. మాతృభాష హిందీ. తెలుగులో రాశారు.]

డా॥ రామస్వారథ్ మిశ్ర
వారణాశి

నిఘంటువులు

నిఘంటువు అనగా డిక్షనరీ అని ఆంగ్లంలో చెప్పుకొన వచ్చును. ప్రస్తుతం వాడకంలో ఉన్న పదము కూడా డిక్షనరీయే. సాహితీ విద్యార్థులకు, జిజ్ఞాసువులకు ప్రతి సందేహమునకు ఉప యోగపడేది నిఘంటువు. నిఘంటువు అనే పదానికి ఈ క్రింది అర్థములను నిఘంటువులు ఇలా వివరిస్తున్నవి.

నిఘంటువు = పదార్థములను తెలియజేసెడు గ్రంథము (శబ్దార్థ చంద్రిక - మహాకాళి సుబ్బారాయుడు వావిళ్ళప్రతి - 1939)

నిఘంటువు = పదములను వాని యర్థములను తెలియచేయు గ్రంథము (శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు- నాల్గవ సంపుటము - ఆం. ప్ర. సా. అకాడమీ ప్రతి - 1979)

నిఘంటువు = పదములకు అర్థములను తెలుపునది (విద్యార్థి కల్పతరువు-విసునూరి వేంకటశాస్త్రి- వేంకట్రామా అండ్ కో - 1988)

శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు (1936లో) కూర్పక ముందు నిఘంటువులు శ్లోక రూపములలో ఉండెడివి. ప్రస్తుతం ఉన్న నిఘంటువులు మాదిరిగా అకారాది క్రమంలో కాకుండా, నామవాచికాదికములుగా ఉండి శ్లోకములలో వ్రాసెడివారు. ప్రస్తుతం లభ్యపడుతున్న సంస్కృత నిఘంటువులు "అమర కోశము"ను పోలి ఉండెడివి. పూర్వకాలంలో నిఘంటువులు రెండు రకాలుగా ఉండేవి.

1. ఏకార్థ వాచకం లేక పర్యాయ పదములను తెలుపునది.
2. సజాతీయ పద సంబంధమైనవి.

తెలుగు నిఘంటువులలో అమరకోశము మాదిరిగా కూర్చ బడినది, చాలావరకు సమగ్రముగా చెప్పబడినది శ్రీ మదురుపాటి వేంకటకృష్ణ కవిగారిచే రచింపబడిన "ఆంధ్ర భాషార్ణవము". ఈ నిఘంటువులు అన్నియు పద్యరూపములో వచ్చినవే. కొన్ని కొన్ని శబ్దములకు నానార్థములు చూపెట్టినను, చాలావరకు పర్యాయ పదములను చెప్పినవని చెప్పవచ్చును. ఇవి కంఠో పాఠముగా చేసినవారికే ఉపకరించును గాని, ఏదేని నొక శబ్దము యొక్క అర్థమును గూర్చి సందేహమును తీర్చుకొనుటకు అనుకూలించవు.

ఇందుకొరకు అక్షర క్రమముగా కూర్చబడిన నిఘంటువులే ఉపయోగపడగలవు. సంస్కృత భాషలో కేశవ నిఘంటువునందు ఆద్యక్షర నియమమును, విశ్వ నిఘంటువులో అంత్యాక్షర నియ మము, మేదిని నిఘంటువులో ఆద్యంతాక్షర నియమమును కలవు. కాని ఆంగ్ల డిక్షనరీలద్వారా పదగత సర్వాక్షర క్రమ నియమము గ్రహింపబడినది.

తెలుగులో మొట్టమొదటి అక్షరక్రమ నిఘంటువును సర్ ఎ. డి. కాంబెలు అను ఆంగ్ల పండితుడు రూపొందించెను. దాని తర్వాత సర్ సి. పి. బ్రౌన్ దొరగారు తెలుగు - ఆంగ్ల నిఘంటువును వివరముగా రూపొందించెను. ఇది ఆంగ్లేయులకు తెలుగు పదములను తెలుసుకొనుటకు ఉపయోగపడుతుంది కాని వివరముగా లేనందున తర్వాత శ్రీ పరవస్తు చిన్నయసూరిగారును, బహుజనపల్లి సీతారామచార్యులుగార్లు పండితాదరము అయ్యే ట్టుగా నిఘంటువును రూపొందించే ప్రయత్నం చేసినారు. కాని చిన్నయసూరిగారి పుస్తకం అసంపూర్తిగా ఉండిపోతే, శ్రీ బహుజనపల్లి సీతారామాచార్యులుగారు దానిని పూర్తి కావించి "శబ్ద రత్నాకరము" పేర వెలువరించినారు. దానితర్వాత సమ గ్రంగా, నిర్దుష్టంగా వచ్చిన నిఘంటువు "శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు" దానికి జయంతిరామయ్య పంతులుగారు సంపాద కత్వమును వహించినారు. ఈ గ్రంథమునకు శ్రీ రాజా సూర్యా రావు బహద్దరుగారు (పిఠాపురం) వెలువడుటకు ఆర్థిక సహాయ మును చేసినందున దానికి వారి పేరుననే "శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు"గా నామకరణం చేసినారు. ఇది 8 సంపుటాలలో 5,000 పేజీలలో వెలువరించినారు.

మనకు కనిపిస్తున్న నిఘంటువులు ఇవి. వాటిలో సంస్కృత నిఘంటువులు ఇవి.

1) అజయపాల = దీనికే మరొకపేరు నానార్థ రత్నమాల -అజయపాలుడు

2) అమరము=దీనికే అమరకోశము, నామలింగాను శాసనము అని అంటారు. -అమరసింహుడు

3) అమరశేషము = దీనికే "త్రికాండ శేషమని" పేరు - ఇది అమర కోశమునకు అనుబంధంగా వచ్చింది. -పురుషోత్తమదేవుడు

4) ఏకాక్షర నిఘంటువు = దీనికే "ఏకాక్షర రత్నమాల" అని పేరు. -మాధవాచార్యుడు.

5) ఏకాక్షర కోశము = దీనికే "ఇంద్ర నిఘంటువని పేరు. -వరరుచి

6) కేశవ = దీనికే "నానార్థార్ణవ సంక్షేపము" - 6కాండములు అని పేరు. -కేశవస్వామి లేక కేశవమిత్రుడు.

7) కేశవ = దీనికే 'కల్పద్రు' అని పేరు -పర్యాయ పదములకు సంబంధించినది. -కేశవ దైవజ్ఞుడు.

8) క్షీరస్వామి=దీనికే "అమరకోశోద్ఘాటనము" అని పేరు -భట్టు క్షీరస్వామి

9) శబ్దార్ణవము= దుర్గాదాసు

10) ప్రమాణ నామమాల = దీనికే "ధనంజయ" అని పేరు -ధనంజయుడు

11) ద్విరూపకోశము = భరత సేన మల్లికుడు

12) మాతృకా నిఘంటువు = మహీదాసుడు

13) అనేకార్థ ధ్వనిమంజరి = మహాక్షపణకుడు

14) అవ్యయకోశము = మహాదేవుడు

15) లింగవిశేష విధి = వరరుచి

16) పంచతత్త్వ ప్రకాశము = వేణీదత్తుడు

17) లక్ష్మి నివాసము = శివరాముడు

18) గణిత నామమాల = హరదత్తుడు

19) శారదా నామమాల = హర్షకీర్తి

20) చింతామణి = దీనికే "నామమాల"; "అభిదాన చింతామణి" అని పేర్లు. ఇది నిఘంటు కోశమునకు అనుబంధంగా ఉన్నది. -హేమచంద్రుడు

21) తారపాల = తారపాలుడు

22) జయప్రతాప = తెలియదు

23) ధన్వంతరి నిఘంటువు = ధన్వంతరి (ఇది ఔషధములకు సంబంధించినది)

24) ధరణి = ధరణీదాసుడు

25) నానార్థ రత్నమాల = దీనికే "నానార్థ రత్నమాలిక" అని పేరు -భాస్కరుడు (ఇరుగప దండనాధుడు)

26) మాధవ = దీనికే "ఏకాక్షర రత్నమాల" అని పేరు. -మాధవాచార్యుడు

27) మేదిని = దీనికే నానార్థ కోశమని, మేదినీ కోశమని పేరు. -మేదినీకరుడు (మేదినీ నిఘంటువు-శ్రీ సూ.ని.)

28) అకార = దీనికే అనేకార్థ సంగ్రహమని పేరు (7 కాండములు) -హేమచంద్రుడు

29) రభస = రభసపాలుడు

30) వైజయన్తి - యారవ వైజయంతి - యారవ ప్రకాశులు (వైజయంతీ నిఘంటువు 8 కాండములు. (శ్రీ. సూ.ని

31) వాగురి = భాగ్నరుడు

32) విశ్వ = విశ్వరూపుడు

33) విశ్వప్రకాశము = మహేశ్వరుడు (విశ్వ నిఘంటువు-శ్రీ సూ.ని)

34) శబ్దభేద ప్రకాశము = మహేశ్వరుడు

35) శబ్దార్ణవము = వాచస్పతి

36) శాశ్వత = దీనికే "అనేకార్థ సముచ్చయ" అని పేరు. -శాశ్వతుడు (శాశ్వత నిఘంటువు - శ్రీ సూ.ని)

37) శుభాంక = శుభాంగ నిఘంటువు అని మరొక పేరు. -శుభాంగుడు

38) హలాయుధ = దీనికే "అభిదాన రత్నమాల" అని పేరు. -హలాయుధుడు (అభిధాన రత్నమాలా నిఘంటువు-5 కాండములు. శ్రీ సూ.ని)

39) ఆప్తుని సంస్కృతాంగ్ల నిఘంటువు= వామన శివరాప్తుడు

40) శబ్దకల్పద్రుమము = సర్ రాజారాధాకాంత దేవబహదరు

41) లఘు శబ్దార్థ సర్వస్వ నిఘంటువు = మహామహోపాధ్యాయ పరవస్తు వేంకట రంగాచార్యులు.

42) రాజ నిఘంటువు (వర్గములు-21) = నరహరి పండితుడు

43) వాచస్పత్య నిఘంటువు - తారానాథ తర్కవాచస్పతి

44) విలియమ్స్ సంస్కృతాంగ్ల నిఘంటువు - సర్ మోనియర్ విలియమ్స్

45) సంస్కృతాంగ్ల కోశము = విల్సన్ దొర

46) శబ్దార్థ సర్వస్వం = పరవస్తు భగవద్వేంకట రంగాచార్యులు

తెలుగు నిఘంటువులు :

1) సాంబ నిఘంటువు = కస్తూరి రంగకవి

2) ఆంధ్ర రత్నాకరము = పైడిపాటి లక్ష్మణకవి

3) ఆంధ్ర నామ సంగ్రహము = పైడిపాటి లక్ష్మణకవి

4) ఆంధ్ర నామశేషము = అడిదము సూరకవి

5) వేంకటేశాంధ్రము = గణపవరపు వేంకటకవి

6) అకారాది దేశీయాంధ్ర నిఘంటువు=గణపవరపు వేంకటకవి

7) ఆంధ్రపదాకరము = శ్రీరాజాత్యాడి పూసపాటి వీరపరాజు

8) ప్రెగడపువారి కందములు

9) చౌడప్ప సీసములు

10) ఆంధ్ర భాషార్ణవము = నుదురుపాటి వేంకటకవి

11) శబ్ద రత్నాకరము = చిన్నయసూరి, బహుజనపల్లి సీతా రామాచార్యులు

12) తెలుగు-ఆంగ్ల నిఘంటువు = సి. పి. బ్రౌన్ (అకారాది క్రమంగా వచ్చిన మొదటి నిఘంటువు)

13) ఆంధ్ర వాచస్పత్యము = బ్రహ్మశ్రీ కొట్ర శ్యామలశాస్త్రి

14) లక్ష్మీనారాయణమను శుద్ధాంధ్ర నిఘంటువు = కొట్ర నారాయణశాస్త్రి

15) ఆంధ్రపద పారిజాతము = ఓగిరాల జగన్నాథ కవి, మరియు గురజాడ శ్రీరామమూర్తి

16) శబ్దార్థ చంద్రిక = మహాకాళి సుబ్బారాయుడు

17) శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు = జయంతి రామయ్య పంతులు

18) విద్యార్థి కల్పతరువు = శ్రీ ముసునూరి వేంకటశాస్త్రి

19) ఆంధ్ర శబ్ద చింతామణి = బాలసరస్వతి

20) ఆంధ్ర సంస్కృత నిఘంటువు = చలమచర్ల వేంకట శేషాచార్యులు

21) ప్రకృతి, వికృతి డిక్షనరి = నాదెళ్ళ పురుషోత్తమకవి

22) శబ్ద రత్నావళి = శ్రీగరణి వైయాకరణ కృష్ణాచార్యులు

23) వైద్య నిఘంటువు = శ్రీ వైటూరి శంకరశాస్త్రి

24) ఆంధ్ర పదనిదానము = తూము రామదాసు

25) నానార్థ పదనిక్షేపం = పల్లా రామకోటార్య

26) వేదాంత తత్వార్థ దర్పణం అను వేదాంత నిఘంటువు= వృక్షాల జగన్నాథం

27) పూర్వగాధాలహరి = వేమూరి శ్రీనివాసరావు (వ్యక్తుల యొక్క వివరములను అందించే సవివరము అయిన గ్రంథం)

28) ఉర్దూ-తెలుగు నిఘంటువు = అయితంరాజు కొండలరావు

29) ఉర్దూ-తెలుగు నిఘంటువు = చిదురురాజు రామరాజు

30) తెలుగు-అరె నిఘంటువు = కుసుంబ లింగయ్య

సాహిత్యంలో నిఘంటువులది ఒక ప్రత్యేక స్థానం. ఆ ప్రత్యేకతే సాహితీ జిజ్ఞాసువులకు, విద్యార్థులకు కల్పతరువులా ఉంది, వాటి ఉపయోగము నిరుపమానముగా ఉంటుంది.

ఆధార గ్రంథములు :

1) భాగవతుల లక్ష్మీపతి శాస్త్రిగారి వ్యాసం - ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక సం-10, సంచిక - 5, 6 (1922) 2) నిఘంటు చరిత్ర - శ్రీమాన్ మేదేపల్లి వేంకట రమణాచార్యులు (ఆంధ్రపత్రిక) 3) మన కవులు - పండితులు - రచయితలు డా॥ కోవెల సంపత్కుమారాచార్యులు 4) హంస వింశతి-విజ్ఞాన సర్వస్వము -డా॥ జి. వెంకటరత్నం 6) వరంగల్లు జిల్లా రచయితల వాఙ్మయ జీవిత సూచిక -టి. శ్రీరంగస్వామి

టి. శ్రీరంగస్వామి

సీతారాముల అనురూప్యాకృతులు

1989 సెప్టెంబరు భారతి కలగూరగంపలో "శ్రీమద్రామాయణము-నామ రామణీయకము" అన్న వ్యాసం, సహృదయ హృదయంగమంగా, నిగూఢ పరిశీలనదక్షంగా సాగింది. వ్యాస రచయిత కతెవరపు వెంకటరామయ్యగారు అభినందనీయులు.

సీతారాముల అనురూప్యాకృతుల్ని విశ్లేషించే సందర్భంలో వారుదహరించిన శ్లోకం-

అస్యాదే వ్యాయథా రూప మంగ ప్రత్యంగ సౌష్ఠవమ్
రామస్యచ యథారూపం తస్యేయ మసితేక్షణా

(సుందరకాండ-15వ సర్గ, 51వ శ్లో.)

అస్యాః=సీతాయాః, రూపం=శరీరం, అంగ ప్రత్యంగ సౌష్ఠవంచ యథా=యథావిధం-తథా విధ మేవ, రామస్యాపి రూపం, అంగ ప్రత్యంగ సౌష్ఠవంచ-తథా రామస్వరూప మంగ ప్రత్యంగ సౌష్ఠవంచ యథా యథావిధం - తథా విధమేవా స్యారూప మంగ ప్రత్యంగ సౌష్ఠవంచ - అతః ఇయమ సితేక్షణా తస్య యోగ్యేతి శేషః- అనే వ్యాఖ్యానాన్ని-

"ఈమె శరీరాకృతిఁ బోలు ఆకృతిని రాముఁడును, రాముని యవయవయములు చక్కని యమరిక సామెయు గలిగి ఒకరి కొకరు తగియున్నారు" అని భావగతం చేశారు రచయిత.

స్త్రీ ప్రకృతి వేరు - పురుష ప్రకృతి వేరు- ఆకృతులు కూడా వేరే- అటువంటప్పుడు ఆకృతుల సామ్యమెట్లు?- భావ సామ్యం, గుణసామ్యం వుండవచ్చుగాని ఆకృతి సామ్య ముంటుందా?

"ఆకార సదృశ ప్రజ్ఞః ప్రజ్ఞయా సదృశోగుణః" అనే ఆర్యోక్తిని విచారిస్తే, ఆకారమునకు తగిన ప్రజ్ఞ, ప్రజ్ఞకు తగిన గుణము అని వివరణ. ఆధారాధేయక్రమాన్ని బట్టి, ఆకారం ఆధారమవుతుంది. ప్రజ్ఞా గుణాలు ఆధేయాలవుతాయి. మొదటిది ప్రత్యక్షం - మిగిలినవి రెండూ అనుమేయాలు-

రాజపుత్ర లక్షణాలున్న రామచంద్రుని గుణాలు, ఆకృతికి అనురూపాలు. ఉత్తమ వంశ సంజాత అయిన సీతమ్మ గుణాలు, ఆమె ఆకృతికి అనురూపాలు. ఆకృతులలో భిన్నత్వమూ, గుణాలలో సారూప్యమూ ఇక్కడ సమన్వయించుకోవలసి వుంది.

స్త్రీ ప్రకృతికుండే లాలిత్యమూ, పురుష ప్రకృతి కుండే దార్ఢ్యమూ, పరస్పరం సీతారాముల విషయంలో, విభిన్న సందర్భాల్లో ఏకరూపత సాధించుకొని వుండొచ్చు. తుల్యశీల, వయో, వృత్తులకుండే సారూప్యాన్ని ఆకృత్యాశ్రయంగా వాల్మీకి మహర్షి వివరించారని అనుకోవాలి.

మనస్సులు దగ్గరైన జంట సీతారాముల జంట. అశోక వనిలో సీతాదర్శన సందర్భంలో హనుమాన్నుడు-

"ప్రణష్టాపి సతీయా స్యమనసోన ప్రణశ్యతి" అని శ్రీరామచంద్రుని గూర్చి, "ఏకస్థ హృదయా నూనం రామ మేవాను పశ్యతి" అని సీతమ్మను గూర్చి అనుకుంటాడు-

"యాని రామస్య లింగాని" అని ప్రశ్నించిన వైదేహితో, "భర్తుః కమల పత్రాక్షి" అనే ప్రారంభంతో మొదలైన శ్లోకాల్ని "దేశకాల విభాగజ్ఞ స్సర్వలోక ప్రియంవదః" అన్న శ్లోకపాదంతో పూర్తయేలా మారుతి వివరిస్తాడు. సాముద్రిక లక్షణాలున్న మహాపురుషుని దివ్యమంగళ విగ్రహం ఈ శ్లోకాల్లో, నిక్షిప్తం అయిన విషయం, రామాయణ పఠితలకు అనుభవగతమే. పాఠక పరిశీలనార్థం, ఆ శ్లోకాల్ని యిక్కడ పొందుపరుస్తున్నాను.

"భర్తుః కమల పత్రాక్షి, సంస్థానం లక్ష్మణ స్యచ
యాని రామస్య చిహ్నాని లక్ష్మణస్యచయానివై
లక్షితాని విశాలాక్షి వదతశ్శృణుతానిమే

రామః కమల పత్రాక్ష స్సర్వ సత్వమనోహరః
రూప దాక్షిణ్య సంపన్నః ప్రసూతో జనకాత్మజే!

తేజసాదిత్య సంకాశః క్షమయా పృథివీ సమః
బృహస్పతి సమోబుద్ధ్యాయశ సావాసవోపమః

రక్షితా జీవలోకస్య స్వజన స్యాభి రక్షితా
రక్షితా స్వస్య వృత్తస్య ధర్మస్య చ పరం తపః

రామో భామిని లోకస్య చాతుర్వర్ణ్యస్య రక్షితా
మర్యాదానాం చ లోకస్య కర్తా కారయితాచ సః

అర్చి ష్మా నర్చిలోఽత్యర్థం బ్రహ్మచర్య వ్రతే స్థితః
సాధూనా ముపకారజ్ఞః ప్రచారజ్ఞశ్చ కర్మణాం

రాజవిద్యా వినీతశ్చ బ్రాహ్మణానా ముపాసితా
శ్రుతవాన్ శీల సంపన్నో వినీతశ్చ పరంతపః

యజుర్వేద వినీతశ్చ వేదవిద్భి స్సుపూజితః
ధనుర్వేదేచ వేదేషు వేదాంగేషు చవిష్ఠితః

విపులాంసో మహాబాహుః కంబుగ్రీవ శ్శుభాననః
గూఢ జత్రు స్సు తామ్రాక్షో రామోదేవి జనైశ్శ్రుతః

దుందుభి స్వన నిర్ఘోష స్స్నిగ్ధవర్ణః ప్రతాపవాన్
సమ స్సమ విభక్తాంగోవర్ణం శ్యామం సమాశ్రితః

త్రిస్థిరస్త్రి ప్రలంబశ్చత్రి సమస్త్రిషుచోన్నతః
త్రితామ్ర స్త్రిషుచ స్నిగ్ధో గంభీర స్త్రిషునిత్యశః

త్రివలీ వాంస్త్ర్య వనతః చతుర్వ్యంగ్యస్త్రి శీర్షవాన్
చతుష్కల శ్చతుర్లేఖశ్చతుష్కిష్కుశ్చ తుస్సమః

చతుర్దశ సమద్వం ద్వశ్చతుర్దంష్ట్రశ్చ తుర్గతిః
మహోష్ఠ హను నాసశ్చ పంచస్నిగ్ధోష్ట వంశవాన్

దశ పద్మోదశ బృహత్త్రిభి ర్వ్యాప్తో ద్విశుక్లవాన్
ష డున్నతో నవతనుస్త్రి భిర్వ్యాప్నోతి రాఘవః

అమృతాంజన్ లిమిటెడ్‌వారి విశిష్టమైన ఆముదము



అమృతాంజన్ లిమిటెడ్ 42-45, లజ్ చర్చ్ రోడ్డు, మద్రాసు 600 004

Amrutanjan Limited

సత్య ధర్మ పరశ్శ్రీమాన్ సంగ్రహానుగ్రహేరతః
దేశ కాల విభాగజ్ఞ స్సర్వలోక ప్రియంవదః"

ఇంత విపులమైన వర్ణనం సీతాకృతి విషయంలో వాల్మీకి వర్ణించలేదు.

అక్కడక్కడా వర్ణించిన ఆమె ప్రత్యంగ వర్ణనం రామాకృతి వర్ణనంతో పోలిస్తే చాలా స్వల్పం.

అరణ్యకాండలో—

శూర్పణఖ సీతనిగూర్చి యిలా వర్ణిస్తుంది-రావణునికి వివరిస్తుంది-

"సా సుకేశీ సునా సోరుస్సురూపాచ యశస్వినీ"
"తప్త కాంచన వర్ణాభా రక్తతుంగ నఖీశుభా"
"విస్తీర్ణ జఘనాం పీనశ్రోణి పయోధరాం"
"సీతా సర్వాన వద్యాంగీ"

పంచవటిలో పరివ్రాజకుడుగా ప్రవేశించిన రావణుడు సీతను ప్రశ్నిస్తూ—

"సమాశ్శిఖరిణ స్స్నిగ్ధాః పాండురా దశనా స్తవ
విశాలే విమలేనేత్రే రక్తాంతే కృష్ణతారకే
విశాలం జఘనం పీనం ఊరూ కరిక రోపమౌ
ఏతావు పచితౌ వృత్తౌ సంహతౌ సంప్రవల్గితౌ
పీనోన్నతముఖౌ కాంతౌ స్నిగ్ధౌ తాలఫలోపమౌ"

"కరాం త మిత మధ్యా సి సుకేశీ సంహత స్తనీ"-అంటాడు.

ఈ వర్ణనలన్నీ పద్మినీజాతి స్త్రీ వర్ణనని నిరూపిస్తున్నాయి.

శ్రీరామచంద్రుని వర్ణన, జనకజ వర్ణన, విభిన్నాకృతుల వర్ణనలుగా కనబడుతున్నాయి గదా!

"మనోహి హేతుస్సర్వేషాం ఇంద్రియాణాం ప్రవర్తనే"

అన్నట్లు, పరస్పర మనోభావముల కలయిక, సీతారాముల పట్ల సహజంగా కనబడుతోంది.

"అస్యా దేవ్యా మనస్తస్మిం స్తస్య చాస్యాం ప్రతిష్ఠితం"

అన్న శ్లోక పాదంలోని భావమే, ఈ సందర్భంలో మనం అనుసంధానం చేసుకోవాలి.

అందుకే హనుమంతుడు—

సీతారాములను గూర్చి—

తుల్యశీల వయోవృత్తాం తుల్యాభి జన లక్షణాం
రాఘవోర్హతి వైదేహీంతం చేయమ సితేక్షణా

-అని అనుకుంటాడు.

"సర్వాన్భోగాన్ పరిత్యజ్య భర్తృ స్నేహబలాత్కృతా
అచింత యిత్వా దుఃఖాని ప్రవిష్టా నిర్జనం వనం
సంతుష్టా ఫలమూలేన భర్తృ శుశ్రూషణేరతా
యా పరాంభజతే ప్రీతిం వనేపి భవనే యథా
సేయం కనక వర్ణాంగీ నిత్యం సుస్మిత భాషిణీ
సహ తేయాత నామేతాం అనర్థానాం అభాగినీ"

-అని వైదేహి ప్రవృత్తిని మెచ్చుకుంటాడు.

"పుం సాంమోహన రూపాయ" అనీ, "స్త్రియం పురుష విగ్రహం" అనీ, దాశరథిని పేర్కొనడం, ఆకర్షణీయ, ఆహ్లాదకత్వ లక్షణ విశిష్టుడనడానికీ, వనగమనానికి సీత సమ్మతించడానికీ ఉద్దేశించినవే.

శీల, వయో, వృత్త, నిర్ణయంలో అనుకూలమైన జంట అనే అర్థం చేసుకోవడమే యిక్కడ పొసగుతుందనుకుంటాను. సీతారాముల దాంపత్యాన్ని గూర్చి భవభూతి లాంటి కవులు వివేచించిన విశేషాలు కూడా ఈ సందర్భంలో పరిశీలిస్తే, విషయం ఇంకా తేటతెల్లమవుతుంది.

"బలవదపి శిక్షితా నాం ఆత్మన్య ప్రత్యయం చేతః"

ఎస్. టి. పి. వి. రామానుజాచార్యులు

లేఖలు

కవిజనాశ్రయము విషయము

'భారతి' 1988 జులై, అక్టోబరు సంచికలలో కవిజనాశ్రయాన్ని గురించి మేము కొంత చర్చించాము. ఆ తరువాత పత్రికాముఖంగా కాక, వ్యక్తిగతంగా లేఖలద్వారా చర్చలు కొనసాగించాము. ఈ చర్చల సారాంశాన్ని 'భారతి' పాఠకులకు అందించాలనే అభిప్రాయంతో ఈ రచన చేస్తున్నాము. సాహిత్య విమర్శలో వ్యక్తులకంటే విషయమే గొప్పదని, విమర్శకుల దృష్టి విషయంపైనే గాని వ్యక్తులపై కేంద్రీకరించగూడదని నమ్ముతూ మేమీ నూతన మార్గాన్ని అవలంబిస్తున్నాము. 'భారతి' పాఠకులు మా యీ ప్రయత్నాన్ని హర్షించగలరని ఆశిస్తున్నాము.

కవిజనాశ్రయాన్ని గురించి మాకు గల నిశ్చితాభిప్రాయము లివి:

1) కవిజనాశ్రయము తెలుగులో రచించబడిన తొలి గ్రంథం. ఇది నన్నయ మహాభారతము కంటె ముందు రచింపబడినది.

2) కవిజనాశ్రయకర్త జైనుడు. ఆనాటి కన్నడాంధ్ర సాహిత్య చక్రవర్తుల కాటపట్టయిన కరీంనగర్ జిల్లాలోని వేములవాడ ప్రాంతీయుడు. ఆ గ్రామ నివాసి కూడా కావచ్చును.

3) 'ఘనుడన్ వేములవాడ వంశజుడ దాక్షారామ భీమేశ నందనుడన్' అని చెప్పుకొన్న శాపానుగ్రహ సమర్థుడు, శైవుడు అయిన 12వ శతాబ్దినాటి వేములవాడ భీమకవికి, కవిజనాశ్రయానికి సంబంధము లేదు.

4) కవిజనాశ్రయములో అనేక ప్రక్షిప్తాలు చేరాయి. అందులో సంయుక్తాక్షర యతిని గూర్చిన పద్యం ఒకటి.

5) 'అరయగ బ్రాసం బొక్కటి, చరణంబుల వళ్ళు వేతె' అని (1.61) చెప్పినదానిని బట్టి కవిజనాశ్రయమున ప్రాస విశేషములు చెప్పబడలేదని, ఆయా విశేషాలతో ముద్రిత ప్రతిలో కనిపించే పద్యములు కేవలము 3, 4 ప్రతులలో (మొత్తం పది ప్రతులలో) మాత్రమే కన్పించుచున్నవి కనుక ఈ పద్యములు ప్రక్షిప్తాలని, ఈ సందర్భములోనిదే అయిన 1.88 పద్యంలోని 'భీమ తనూజా' అన్న అసంబద్ధమైన కృతికర్త సంబోధనతో గల పాఠం ఇందుకు ఉపబలకమని మా అభిప్రాయము.

6) కవిజనాశ్రయములో ఇప్పుడు కనిపించే పద్యాల పాదాలు అనేకం చెడి ఉండవచ్చు. ఉదా: 2 - 131 పద్యంలో గల 'పురారాతి మూర్తి' అన్న సంబోధన. ఇది శైవ సంబోధన. కవిజనాశ్రయకర్త, భర్త జైనులు గనుక ఇది అసంగత సంబోధన.

ఇక, మా చర్చలలో మేమొక నిర్ణయమునకు రాలేక పోయిన విషయములివి:

1. కవిజనాశ్రయము రేచన పేరున వెలయించబడినది అని శేషశాస్త్రి, సదానందంల అభిప్రాయము. తెలుగునాట మరొకరి పేరున కృతి వెలయించటం చిరకాలంగా ఉన్న విషయమే. పెదకోమటి వేమారెడ్డి పేర శ్రీనాథుడు అమరుక వ్యాఖ్య రచించాడు. శ్రీనాథుడే వల్లభరాయని పేర క్రీడాభిరామాన్ని వ్రాసినట్లు, మల్లినాథుని పేర అతడి అన్న పెద్దిభట్టు అనేక రచనలు చేసినట్లు ప్రతీతులు గలవు కదా! లక్ష్మీధరుడనే కవి గీత గోవింద వ్యాఖ్యను తిరుమల దేవరాయని పేర వెలయించాడట. ఆధునికులలో కూడా ఇది కనిపిస్తూనే ఉన్నది. మల్లాది వసుంధర పేర వెలువడిన 'రాజశిల్పి' నవల విశ్వనాథవారి సృష్టి అని ప్రతీతి గదా! ఈ పద్ధతిలోనే కవిజనాశ్రయము వెలువడి ఉండవచ్చు. ఇలా వెలువరించినవాడు 'ఆదిభీమన'. ఈ పేరుతో అనేకులు ఈ గ్రంథాన్ని ఆది భీమన ఛందము అని పేర్కొన్నారు.

అయితే, కవిజనాశ్రయములోని ఈ క్రింది పద్యపాదాలు దీనికి ప్రతిబంధకాలని, కవిజనాశ్రయకర్త రేచనే అనేదానికి సహాయకారులని రవికుమార్ అభిప్రాయము.

ద్విపద పొలుపొంద రేచడిష్టమున నొనరించున్ 3.10
రేచడన వద్యు డక్కలి ప్రాస సీసమనుచు బరగ జెప్పె 3.16
శ్రీదేవీపతి రేచడు...... తెలియజెప్పు 5.27

2. భీమకవి రచించినట్లు కవిజనాశ్రయ ప్రతులలో ఒక దానియందు గల అవతారికలోని ఆరు పద్యాలు గ్రంథంలోని ఇతర పద్యాలతో పోల్చితే నీరసంగా కన్పిస్తున్నా, అవతారికా పద్యాలలో ప్రక్షిప్తాలు ఉండవని పాఠాలు చెడి ఉండవచ్చని ఈ కారణం చేతనే కవిజనాశ్రయకర్త ఆది భీమన అనే భావన బలపడుతోందని శేషశాస్త్రి, సదానందంల అభిప్రాయము.

ఈ ఆరు పద్యాలలోను రేచన ప్రస్తావన ఉన్నది. మూడు తావుల రేచా! అన్న సంబోధన ఉన్నది. ఇదే సంబోధన ఇతర గ్రంథభాగంలో గల తావులు అయిదు మాత్రమే. రేచా అన్న సంబోధనకు పూర్వపదం మల్లియ తప్ప మరొకటి గ్రంథ భాగంలో కన్పించదు. కాని ఈ ఆరు పద్యాలలో ఒకచోట 'కోమటి రేచా' అన్న కుల ప్రస్తావన ఉన్నది. గ్రంథ భాగంలో ఇదే 'వణిగ్వంశచూడామణి' అని హుందాగా చెప్పబడింది. గ్రంథభాగంలో రేచన పేరుతోనే కాక ఇతర విశేషణాలతో కూడ పేర్కొనబడ్డాడు. ఈ ఆరు పద్యాలలో ఒకదానిలో కూడా అలా పేర్కొనబడలేదు. కనుక ఈ ఆరు పద్యాల రచయితకు రేచన పేరుతోనే కాని వ్యక్తితో పరిచయము లేదని రవికుమార్ అభిప్రాయము.

కవిజనాశ్రయకర్త కరీంనగర్ ప్రాంతీయుడు కనుక అది ఆనాటి కన్నడ కవులకు కూడా ఉనికిపట్టు గనుక కవిజనాశ్రయములోని విషయాలను ఆనాటి కన్నడ ఛందో గ్రంథాలతో పోల్చి చూడాలని, కవిజనాశ్రయానికి లభించే వ్రాత ప్రతులన్నిటిని శాస్త్రీయ దృష్టితో పరిశీలించి దానిని సుపరిష్కృత మొనర్చాలని రచయితల ఆకాంక్ష. అప్పుడే కవిజనాశ్రయమునకు సంబంధించిన సమస్యలకు ఒక పరిష్కారము లభించగలదని మా విశ్వాసము.

డా॥ ఆర్. శేషశాస్త్రి, జె. సదానందం,
డా॥ సూర్యదేవర రవికుమార్

"నా లి కే ర మ్"

భారతి జూన్ 1989 సంచికలో ఒక శ్లోకం, కొద్ది వ్యాఖ్య ప్రచురించబడ్డాయి. 'విదగ్ధ ముఖమండనమ్' లోని ఆ శ్లోకానికి అర్థం తెలుపవలెనని శ్రీ పమ్మి సత్యనారాయణశాస్త్రి కోరారు.

'నాలికేరమ్' అనే శబ్దాన్ని వేర్వేఱు విధాల పదచ్ఛేదం చేసి, వేర్వేఱు అర్థాలు తీసే చమత్కారం ఆ శ్లోకంలో ఉన్నది. ఆ అర్థాలు కొన్ని ప్రశ్నలకు సమాధానాలుగా ఉండేట్లు కూర్చబడ్డాయి. ఆరు ప్రశ్నలూ, వాటి సమాధానాలూ అందులో ఉన్నాయి.

1. మదన విహ్వలయా యువత్యా కః ప్రార్థ్యత్? అని ప్రశ్న.
   నా = నరః = పురుషః అని సమాధానం.

2. క్వ పుండ్రకమ్? అని ప్రశ్న.
   అలికే = లలాటే అని సమాధానం.

3. బత, ఆయుః కథం అపేతి? (అపైతి అని ఉండవలనేమో!) అని ప్రశ్న.
   అరమ్ = శీఘ్రమ్ అని సమాధానం.

   ఈ తరువాత ఈ పదాన్ని ప్రతిలోమంగా చూచుకోమన్నారు (వ్యాఖ్యలో). అప్పుడది 'రంకేలినా' అవుతుంది. (రంకే౽లినా)

4. క్వ (=కస్మిన్) అనాదరః భవతి? అని ప్రశ్న.
   రంకే = దరిద్రే అని సమాధానం.

5. అబ్జం కేన విరాజతే? అని ప్రశ్న. (విరాజతీ అబ్జం అనడం ప్రామాదికం. 'విరాజతే౽బ్జం' అని ఉంటుంది.)
   అలినా = బంభరేణ అని సమాధానం.

6. ('వాహ్యాస్థి' అన్నారు. 'బాహ్య' శబ్దాన్ని 'వబయోరభేదః' అనే అనుమతిని బట్టి 'వాహ్య'గా పఠించి ఉంటారు.)
   బాహ్యాస్థి (=బాహ్యే అస్థి యస్య తత్) కిమ్? అని ప్రశ్న.
   'నాలికేరమ్' అని సమాధానం.

'నారికేలః' అనేది పుంలింగ శబ్దం. 'రల యోర భేదః' అనే అనియంతివల్ల 'నాలికేరః' కావచ్చును. ఇట్లా ర-ల-ల మార్పు వచ్చినా, అది పుంలింగ శబ్దంగానే ఉండాలి. కాని శ్లోకంలోనే 'వద నాలికేరమ్' (నాలికేరం అని చెప్పుము) అనడంచేత, 'నాలికేరం' అనుకొనియే సమన్వయం చేసుకోవాలి. ' అది ద్వితీయా విభక్తి అనుకోవచ్చును. అంతవఱకు 'ఫరవా'లేదు. కాని 'బాహ్యాస్థి కిమ్' అని, ప్రశ్నను నపుంసక లింగ శబ్దాలతో కూర్చడం చింత్యం. నాలికేర శబ్దం నపుంసకలింగంగా కూడా ఉన్నదని గ్రంథకర్త అభిప్రాయం అయుండాలి.

చిపుకుల వేంకట సుబ్బావధానులు

కథా సంకలనానికి "నూతలపాటి సాహితీ సత్కారం"

శ్రీ గంగాధరం వర్ధంతి సందర్భంగా ఇచ్చే "నూతలపాటి సాహితీ సత్కారం" అవార్డు 1990 సంవత్సరం కథా సంకలనానికి యిస్తారు. సంకలనాలు పంపదలచిన రచయిత(త్రు)లు క్రింది విషయాలు గమనించాలని కార్యదర్శి ఎస్. మునిసుందరం తెలియజేస్తున్నారు.

* సంకలనం రచయిత ఒకరిదే అయివుండాలి. జంట రచయితలయితే పర్వాలేదు.
* అనువాదాలు; వ్రాతప్రతులు స్వీకరించరు.
* గత మూడేళ్లలో అచ్చు అయిన సంకలనాలే (జనవరి 1987 నుండి డిసెంబరు 1989 వరకు) పంపాలి. ప్రచురణ కర్తలు కూడా పుస్తకాలు పంపవచ్చు. అయితే రచయిత చిరునామా తప్పనిసరిగా ఇవ్వాలి.
* అవార్డు మొత్తం రు. 1500/- మరియు జ్ఞాపిక 29 మే జరిగే వర్ధంతి సభలో అందజేస్తారు.
* సంస్థ పరిశీలనకై నాలుగు ప్రతులు 15-3-90 లోగా కార్యదర్శి; గంగాధరం సాహితీ కుటుంబం (రిజి) 10-3-190 ఎ2; కోటకొమ్మల వీథి, తిరుపతి - 1 చిరునామాకు పంపాలి.

—కార్యదర్శి
గంగాధరం సాహితీ కుటుంబమ్
10/190 ఎ2, కె. కె. వీధి
తిరుపతి - 1

గ్రంథ విమర్శలు

ది రూల్ ఆఫ్ ది చాళుక్య - చోళాస్ ఇన్ ఆంధ్రదేశ [ఇంగ్లీషు]

[రచయిత్రి : యం. కృష్ణకుమారి. ప్రకాశకులు : బి. ఆర్. పబ్లిషింగ్ కార్పొరేషన్, 461, వివేకానందనగర్, ఢిల్లీ-110052, 276 పేజీలు, వెల : రూ. 200-00]

ఈ గ్రంథము క్రీ. శ. 11-12 శతాబ్దములనాటి ఆంధ్ర దేశములో కోస్తా ప్రాంతపు చరిత్రను వివరించుచున్నది. క్రీ. శ. 973 లో చాళుక్య రాజైన దానార్ణవుడు నిహతుడైనది మొదలు వేంగి దేశము స్వతంత్ర ప్రతిపత్తిని క్రమముగా కోల్పోయెను. సుమారు ఇరువదేడేండ్లు వేంగి రాజ్యమొక అజ్ఞాతాధికారంతోనుండెను. తరువాత క్రీ. శ. 1000 ప్రాంతంలో చోళరాజుల క్రింద సామంత రాజ్యంగా మారెను. రాజరాజనరేంద్రుడు క్రీ. శ. 1060-61 లో మరణించిన పిమ్మట అతని విరోధి, సవతి సోదరుడు అయిన ఏడవ విజయాదిత్యుడు తన కొడుకైన రెండవ శక్తివర్మను వేంగి సింహాసనముపై గూర్చుండపెట్టెను. తానే స్వయముగా పట్టాభిషిక్తుడై కొడుకును యువరాజుగా చేయకుండుటకు కారణము తెలియదు. ఆ కొడుకొక సంవత్సరమైనను పూర్తిగా పాలించకయే యుద్ధములో నిహతుడయ్యెను. అంత విజయాదిత్యుడు వేంగి సింహాసనమధిష్ఠించెను. మొదటినుండి తను వేంగి దేశ వ్యవహారములలో చోళులు జోక్యము చేసికొనుట ఇష్టపడకయుండెను. పశ్చిమ చాళుక్యులు, తూర్పు గాంగ రాజులు ఆతనికి సహాయమందించువారు. ఈ పరిస్థితిలో రాజరాజ నరేంద్రుడికి రాజేంద్రచోళ చక్రవర్తి కూతురు అమ్మంగాదేవికి పుట్టిన రాజేంద్ర కులోత్తుంగుడు తన పినతండ్రియైన విజయాదిత్యుడికి వేంగి రాజ్యమిచ్చి తాను చోళరాజ్య సింహాసన మాక్రమించుకొన్నట్లు శాసనములు చెప్పుచున్నవి. విజయాదిత్యుడు సుమారు క్రీ.శ. 1075-6లో చనిపోయెను. తరువాత అతని వారసులెవరు లేకుండుటవలన కులోత్తుంగుడే చోళరాజ్యముతోబాటు వేంగి రాజ్యమునకు కూడ అధికారి యయ్యెను. చాళుక్య-చోళ ఉభయ కులములకు జన్మను బట్టి ఒకదానికి, పరాక్రమమును అనుసరించి రెండవదానికి ఏకైక వారసుడుగా నిలబడగలిగెను. కాని చిన్నతనము నుండి తనకు చోళదేశము నందుగల అభిమానముతో అదియే తన ముఖ్య స్థానముగనెంచి వేంగి రాజ్యమునొక సామంతరాజ్య ప్రతిపత్తితో పరిగణించెను. దాని ఫలితముగ వేంగిదేశము స్వతంత్ర ప్రతిపత్తిని పూర్తిగ కోల్పోయెను. ఇంత పూర్వ చరిత్రను ఈ రచయిత్రి రెండవ అధ్యాయములో వివరించెను. ఆమె వాదములన్ని పూర్తిగా సంశయ నివారకములని చెప్పజాలముగాని ఆ చరిత్రకు కావలసిన ఆధారములనన్నిటిని చేర్చి చర్చించిరి.

రాజేంద్రుడు చిన్నతనమునుండి మాతామహుడైన రాజేంద్ర చోళ చక్రవర్తి దగ్గర అభిమానముతో పెరుగుటయేగాక ఆయన మంత్రులు, సేనానులు ఇతర బంధువర్గము యొక్క అభిమానానికి పాత్రుడు కావటం వలన వారి సహాయముతో చోళ సింహాసనానికి నిజమైన వారసుడగు అధిరాజేంద్రుని తొలగించియో లేక చంపియో ఆ సింహాసన మాక్రమించుకొనగలిగెననుట స్పష్టము. తనకు పలుకుబడి అంతంత మాత్రంగా నున్న వేంగి సైన్యముతో చోళ దేశముపై దండెత్తి వెళ్ళి ఆ సింహాసనాన్ని రాజేంద్రుడాక్రమించుకొన్నాడని వీరు చెప్పుట అంత యుక్తమనిపించదు. చోళ సైన్యముపై వేంగి సైన్యము దాడిచేసి ఓడించెనని చెప్పజాలము. వేంగి సైన్యబలమే అంతటి గొప్పదైయున్నచో కులోత్తుంగుడు వేంగిలోనేయుండి చోళ రాజ్యాన్ని తన కొడుకుల ద్వారా పాలించెడివాడు. అట్లుగాక తన మాతామహుడి వలె వేంగి రాజ్యమునొక సామంత రాజ్యముగ మాత్రమే చూచెను. అప్పుడైనా, పూర్వము రెండవ పులకేసి వేంగి రాజ్యాన్ని తన తమ్ముడైన కుబ్జవిష్ణువర్ధనునకు పుత్రపౌత్ర పారంపర్యంగా పాలించుకొనునట్లు ఇచ్చినట్లు కులోత్తుంగుడు వేంగిరాజ్యాన్ని తన కొడుకులలో నొకరికి పారంపర్య హక్కులతో ఇచ్చి తను పర్యవేక్షించుచున్న యెడల వేంగికి స్వతంత్ర ప్రతిపత్తి నిలిచియుండెడిది. అట్లు జరుగకపోవుట వేంగిదేశ రాజకీయ చరిత్రలో కులోత్తుంగుడు చేసిన పెద్ద పొరపాటుగా భావించవలసియున్నది. అతని సంతతి వారికి కూడ వేంగిపై ఉదాసీన భావమేగాని చోళ రాజ్యముపై నున్నంతటి యభిమానముండెడిది కాదు. రాజుల కట్టి ఉదాసీన భావముండుట వలన మాండలికులు దిక్కుతోచక రాజభక్తిని కోల్పోయి పశ్చిమచాళుక్యులకు తమ విధేయతను తెలుపుటకై వెనుదీయువారు కారు. ఈ సందర్భమున చెప్పదగిన విషయమొకటి గలదు, పరిచ్ఛేది వంశమునకు చెందిన కామరాజు ఒకప్పుడు పశ్చిమ చాళుక్య చక్రవర్తి యగు త్రిభువనమల్ల ఆరవ విక్రమాదిత్యునికి సామంతుడుగా తెలంగాణ

ములోని కొల్లిపాక రాజ్యమునుపాలించెను. దానినిబట్టి పరిచ్ఛేది రాజులు కొందరు కొల్లిపాక పురవరేశ్వరులమని చెప్పుకొనిరి. ఈ విషయమును నిరూపించు శాసనము ఇంతవరకు ప్రకటితము కాకుండుటను బట్టి కొందరు చరిత్ర రచయితలు (డా॥ బి. ఆర్. గోపాల్-ది చాళుక్యాస్ ఆఫ్ కల్యాణి-1981, పేజి 306) పరిచ్ఛేది రాజులు చాళుక్య-చోళ రాజుల పంపున కొల్లిపాకను జయించి పాలించిరని చెప్పుచుండిరి. ఈ గ్రంథ రచయిత్రి 67 వ పేజీలో పరిచ్ఛేది నంబయ విక్రమచోళ చక్రవర్తి పక్షమున కొల్లిపాకను జయించి దానిని రాజధానిగా వేంగి షట్సహస్రముతో గూడిన రాజ్యమునంతను పాలించినట్లు వ్రాసిరి. అది తప్పు. వేంగి రాజ్యానికి కొల్లిపాకకు మధ్య చాల దూరము కలదు. పరిచ్ఛేదివారు నర్సారావుపేట తాలూకా ప్రాంతము వారు. మిక్కిలి చిన్న తరగతి సామంతులు. మధ్య కాకతీయులు, నతవాడివారు పశ్చిమ చాళుక్యులకు సామంతులుగా నుండిరి. ముదిగొండ చాళుక్యులు కూడ అప్పుడు కొరవిప్రాంతం కొంత భాగాన్ని పాలించుచుండిరి. అట్టి స్థితిలో నంబయ కొల్లిపాక రాజధానిగా తీరాంధ్రములోని వేంగి షట్సహస్రమును పాలించెననుకొనుట, అసంబద్ధము. వానికి గల 'కొల్లి పాక పురవరేశ్వర' అను బిరుదును బట్టి విక్రమచోళ చక్రవర్తి తెలంగాణములోని కొల్లిపాక వరకు గల రాజ్యాన్నంతను జయించెనని చెప్పుటకు పూనుకొనుటకన్న ఈ బిరుదు వారికెట్లు వచ్చెనో తెలియుట లేదని వ్రాసియుండిన బాగుండెడిది. ఈ బిరుదును కోటరాజులుకూడ అచ్చటచ్చట వాడుకొనిరి. వారుకూడ వేంగి షట్సహస్రావనీ వల్లభులే క్రీ.శ.1067లో కోటమొదటి భీమరాజు పశ్చిమ చాళుక్య చక్రవర్తియైన త్రైలోకమల్ల మొదటి సోమేశ్వరుడికి సామంతుడుగా కొలదికాలము కొల్లిపాక రాజ్యము పాలించెను. ఈ విషయమును తెలిపెడి శాసనముగూడ ప్రకటింపబడలేదు.కనుక'కొల్లిపాక పురవరేశ్వర'అను బిరుదు కోటవారికి, పరిచ్ఛేదివారికి తమ పూర్వులు పశ్చిమ చాళుక్య రాజులకి సామంతులుగానుండి సంపాదించినది కాని పరిచ్ఛేది నంబయ కొల్లిపాకను జయించి రాజధానిగా వేంగి ఆరువేల రాజ్యాన్ని పాలించెనని చెప్పుటకు సాక్ష్యము కాజాలదు పైన చెప్పిన అనుపపత్తిని చూపిన బాగుండేది. కోటరాజులు విశేషించి 'చోళ చాళుక్య సామంత మదానేకపమృగేంద్ర'అని గొప్పగా తమను పొగడుకొనుచు శాసనములలో చెప్పుకొనిరి. అనగా చాళుక్య చోళ చక్రవర్తులకు విధేయ సామంతులైన మదించిన యేనుగుల వంటి వెలనాటి దుర్జయాది రాజులకు సింహము వంటివారు అని అర్థము. అందే వీరు వేంగిలో పశ్చిమ చాళుక్య రాజుల అధికారమును అంగీకరించుటయే గాక చాళుక్య చోళులకు ప్రతికూలముగా వ్యవహరించినట్లే కదా. ఈ విధముగా కులోత్తుంగుడు, అతని సంతతివారు వేంగి రాజ్యమును నిర్లక్ష్యము చేసి మాండలికులపై విడిచిపెట్టుట వలన ఆ మాండలికులు వారియెడ విశ్వాసము కోల్పోవునట్లు చేసుకొనిరి. అవసరమైనపుడు శత్రురాజులతో జేరి తమపై నెదుర్కొనుటకైనా వెనుదీయువారు కారు.

దాక్షారామంలోను, ఇతరత్రా శాసనాల్లోను చిరకాలం చాళుక్య-చోళ రాజులను పేర్కొంటూ, వారి సంవత్సరాలను చెప్పటం జరిగింది. దానికి కారణం, మొదటిది, ఈ మాండలికులలో ఒకరినొకరు కబళించకుండాను, రెండవది, పరరాజులు దండెత్తి రావటానికి కొంత కాపుదలగా మాకు చోళ బలమున్నదని చెప్పుకొనుటకు ఆ రాజులను శాసనాల్లో చెప్పుకొనుట తోడ్పడింది. కొంత కాలానికి 'శకనృపకాలాతీత...ఫలాన సంవత్సరం' అని మనం ఇప్పుడు కూడ రాజకీయంగా చెప్పుచున్నట్లు ఆ కాలంలో చాళుక్య-చోళ రాజుల పేరుతో సంవత్సరాన్ని చెప్పుచూ శాసనాలు వ్రాయించటం అలవాటుగా మారింది. నిజానికి అప్పటి రాజకీయ దృష్టితో మనం చరిత్రను యోచిస్తే కులోత్తుంగుడు తనకున్న చోళాభిమానంతో వేంగిలో రాజకీయంగా అస్థిరత్వాన్ని నెలకొల్పెను. అప్పటికే సుమారు నూరేండ్ల నుండి అస్థిరంగా నున్న వేంగి రాజకీయ పరిస్థితి కులోత్తుంగుని దీర్ఘరాజ్యకాలంలో ఇంకా క్షీణించి అతని రాజ్యానంతరము రాజ్యమంతా చాళుక్యుల వశమయ్యే దుస్థితి యేర్పడింది. ఆ తరువాత వేంగి రాజ్యము మాండలికుల క్రింద రాజకీయంగా అనైక్యతకు లోనయ్యెను. డా. కృష్ణకుమారి చెప్పినట్లు కులోత్తుంగుడు చోళరాజ్యానికి పునరుజ్జీవనము కల్పించిన మాట వాస్తవమే. అతడు గొప్ప రాజులలో నెన్నదగిన మాట కూడ సత్యమే. కాని వేంగి రాజ్యము నిర్వీర్యమై మాండలికుల క్రింద విభిన్నాధికారాలకు లోబడి ఒకే రాజ్యమనెడి ప్రతిపత్తిని కోల్పోయింది. అతడు చాళుక్య-చోళ నామముతో ఒక నూతన రాజవంశాన్ని స్థాపించుట వలన చోళ రాజ్యానికి మేలు కలిగినను వేంగి రాజ్యానికి కీడు కలిగెను.

ఈ పుస్తకం నాలుగు, అయిదు అధ్యాయాల్లో చాళుక్య-చోళ రాజుల క్రింద వెలనాటి చోళులు, ఇతర మాండలికులు తీరాంధ్ర భూమిని పాలించుట చెప్పబడెను. పశ్చిమ చాళుక్యుల దండయాత్రలు వీరి ప్రతిఘటన యిచట వివరముగా వర్ణించబడెను. ఈ సందర్భమున రచయిత్రి శాసనాధారములతో నూతనాంశములనేకము విశదీకరించుట జరిగెను. గ్రంథములో ప్రధాన రాజకీయ చరిత్ర ఈ రెండధ్యాయములలోనే కలదు. వేంగి మండలమునకు చెందిన మాండలికులు కొందరు తూర్పు గాంగరాజుల పలుకుబడిలోను కొందరు పశ్చిమ చాళుక్య రాజుల అధికారము క్రిందను మరికొందరు చాళుక్య చోళుల అధికారము క్రిందను సందర్భమును బట్టి మారుచుండువారు. ఇట్టి అస్థిర రాజకీయ పరిస్థితిని సరియైన ఆధారములతో చరిత్రగా రూపకల్పన చేసినందుకు రచయిత్రి అభినందనీయురాలు.

తరువాతి అధ్యాయములో పరిపాలనా విశేషములు, ఆర్థిక విధానములు, మత సంప్రదాయములు, వాఙ్మయము, కళలు ఇత్యాది అంశములు చెప్పబడినవి. అట్లే సాంఘిక విభేదములు, వివాహ సంప్రదాయములు అనే అంశములు వివరించబడెను. ఆంధ్ర సంస్కృతిపై ద్రావిడ సంప్రదాయముల ప్రభావమును గూర్చి అధ్యయనము చేయువారికి ఈ భాగము తోడ్పడగలదు.

గ్రంథములో చెప్పదగిన లోపములు కూడా కొన్ని కానవచ్చుచున్నవి. ముఖ్యముగా ఇండెక్సు, గ్లాసరీ అను రెండు అనుబంధములు గ్రంథాంతమున చేర్చబడెను. అవి రెండును అసమగ్రముగను, నిరుపయోగముగను ఉన్నవి. కేవలము పుస్తకానికి అలంకార ప్రాయముగ చేర్చబడెను. ఉదాహరణకు అన్తరాయ, వెణ్ణాయ, కిడెక మున్నగు పన్నుల పేర్లు గ్రంథములో పేర్కొనబడ్డవి కాని వివరించబడలేదు. గ్లాసరిలోగాని ఇండెక్సులోగాని చూపబడలేదు. ఇట్లాటి అనేక పదాలు, విషయాలు వివరణ రహితంగా పేర్కొనబడి విద్యార్థులకు, పరిశోధకులకు తగు విధంగా ఉపయోగపడుటలేదు. అట్లే అధోజ్ఞాపికలలో కొన్ని పొరపాట్లు గలవు. ఇండెక్సునైనా కొంత విపులంగా తయారుచేసిన బాగుండెడిది. ఈ సామాన్య లోపాలు విడిస్తే పుస్తకం ఆ కాలపు ఆంధ్రదేశ చరిత్రకు ముఖ్య గ్రంథముగా స్వీకరింపదగియున్నది.

పి. వి. పరబ్రహ్మశాస్త్రి

తమిళ సాహిత్య కథలు

[రచయిత : మూల తమిళంలో ము. అరుణాచలం; తెలుగు అనువాదం : డాక్టర్ చల్లా రాధాకృష్ణశర్మ; డెమీ 1/8 సైజు; 259 పుటలు; మొదటి కూర్పు 1988; వెల : రూ. 30; కేంద్ర సాహిత్య అకాడెమీ; న్యూఢిల్లీ; ప్రచురణ, దొరకుచోటు : సాహిత్య అకాడెమీ, రవీంద్రభవన్, న్యూఢిల్లీ-110 001.

ఇది తమిళంలో ము. అరుణాచలంగారు వ్రాసిన "తమిళ ఇలక్కియం చొల్లుం కతైగళ్" అనే పుస్తకానికి "తమిళ సాహిత్య కథలు" అనే తెలుగు సేత. అతి ప్రాచీన భాషలలో ఒకటిగ పేరుగల తమిళభాష సాహిత్య భాండాగారం. కథల గని. ప్రస్తుత పుస్తకంలో తమిళ సాహిత్యంలోని కథలను ఎన్నిక చేసి సంగం కాలపు కథలు, కావ్య (సిలప్పదికారం, మణిమేఖల చింతామణి) కథలు, శివభక్తుల (నాయన్మారులు) కథలు, విష్ణుభక్తుల (ఆళ్వారులు)కథలు, తిరువిళైయాడల్ పురాణ కథలు, కవుల చరిత్రలు, అమ్మానై పాటల కథలు అనే మౌఖిక జానపద గాథలు (దేసింగురాజు, కట్టబొమ్మ నాయకుడు అల్లిరాణి, ఖాన్‌సాయిబు మున్నగువారివి) అనే 7 శీర్షికల క్రింద 71 కథలున్నాయి.

అన్ని కథల గురించి సమష్టిగా చెప్పవలెనంటే : ఈ కథలు మనోజ్ఞంగా, పఠనీయంగా ఉన్నాయి. సత్పరిపాలన, సత్యం, ధర్మం, త్యాగం, శక్తి, ముక్తి మున్నగు ఉత్కృష్టాదర్శాలను కలిగి, ప్రబోధకంగా ఉన్నాయి. భారతీయ సంస్కృతీ సాంప్రదాయాల కద్దంపట్టేటట్లున్నాయి. విడిగా చెప్పవలెనంటే, ప్రతికథా, ఒక విశిష్టతను కలిగి వుంది. కొన్ని కథలు ప్రాగ్రూపాలు ("ఆర్కిటైపు"లు)గా ఉండి, ఇతర సాహిత్యాలలోనూ కనపడతాయి. ఉదాహరణమునకు : కరికాలచోళుని న్యాయనిర్ణయం వంటి కథే ద్వాపరాంతమున ధర్మరాజు తీర్పు కథలో వస్తుంది. వాసుకి (తిరువళ్ళువరు భార్య) వంటి పతివ్రత కథ వంటిదే మహాభారతం అరణ్యపర్వంలో ధర్మవ్యాధుని కథలో వస్తుంది. న్యాయ పరిపాలనలో స్వ, పర పక్షభేదం పాటించని మనునీతి చోళుని కథవంటిదే విష్ణుకుండినరాజు మాధవవర్మ గురించి చెబుతారు. మొగలు చక్రవర్తి జహంగీరు కూడా ఈ విషయంలో అట్టి తీర్పరే. దేశింగురాజు కథ హిందూ ముస్లిం సఖ్యతకు గీటురాయి. కట్టబొమ్మ నాయకుని కథ స్వాతంత్ర్య సమరంలో నాంది. ఆంధ్ర తమిళుల సఖ్యానికి ఓజబంతి.

తెలుగుసేత చాలా జీవకళతో ఉంది. శైలి నాటకీయంగా కూడ ఉంది. మనస్సులో చదువుతుంటే కూడ మాటలు వినబడతాయి. ఎంత వ్యవహారిక భాషే అయినా, "నీవు" అనడానికి "నువ్వు", "నువ్వు" అని లెక్కలేనన్నిసార్లు వాడడం దేనికో నాకర్థం కాదు. గ్రామీణులు కూడా "నీవు" అనే ఉచ్చరిస్తారు.

"కన్నయ్య ప్రేయసి అయిన రాధ (నప్పిన్నై) కాబోలు లేకపోతే భూదేవియో, లక్ష్మీదేవియో కావచ్చు" అని గోదాదేవి గురించి ఉంది (పుట 157). నప్పిన్నై, రాధ కాదు. నప్పిన్నై అంటే నీళాదేవి. శ్రీకృష్ణుడు నీళాదేవిని పెండ్లాడినాడు. (చూ. కూచిమంచి తిమ్మకవి "నీలా సుందరీ పరిణయము"), రాధను కాదు. రాధ, శ్రీకృష్ణుని హ్లాదినీశక్తి అని "రాధోపనిషత్తు" చెబుతుంది. శ్రీవిష్ణువుకు ముగ్గురు భార్యలు : వారు శ్రీ, భూ, నీళలు. గోదాదేవి నప్పిన్నై అవతారం కానీ లక్ష్మీ, భూదేవిల అవతారం కాదు. "తిరుప్పావై" (గోదాగీత)లో మాటిమాటికి గోపికలను నప్పిన్నైనీ ఆండాళ్ తలుస్తుంటుంది. అది పూర్వజన్మ స్మృతి కావచ్చును. దేశింగురాజు గుర్రం పేరు "బారాచారి" అని పేర్కొనబడింది. తమిళ లిపిలో అట్లుండవచ్చును కాని ఆ గుర్రం పేరు "బారాహజారి".

ఇటువంటి పుస్తకాలను భారతీయ సంస్కృతీ ప్రచారంకోసం తక్కువ ధరకు అమ్మవలెను. ఉదా : ప్రస్తుత పుస్తకం ఐదు రూపాయల కమ్మవలెను. కేంద్ర ప్రభుత్వం వారు లాభనష్టాల లెక్కలలో పడితే ఎలాగు? అపరిచిత కథల (అవెంత మంచివైనా) పుస్తకాన్ని ముప్పయి రూపాయలు పెట్టి ఎవడు కొంటాడు? "పుస్తకాల పురుగైన" నేను కూడా కొనను. ఊరకనే ఇస్తే చదువుతాను. ఏమైనా వ్రాస్తాను. ఇప్పుడు చేసిన దిదే.

సర్దేశాయి తిరుమలరావు

1. అగ్నిమయం జీవితం వెల రూ. 1/-

2. కిర్మీరం - జీవన బింబం వెల రూ. 5/-

రచయిత : శ్రీ మాదిరాజు రంగారావు

ఆధునిక కవితా రీతుల్లో కూడా ప్రాచీన ప్రబంధాల పద్ధతిలాగే, కొన్ని రకాల వర్ణనలు, పడికట్టురాళ్ళలాంటి భావాలు, ప్రయోగాలు ప్రస్ఫుటంగా చోటు చేసుకుంటున్నాయి. 'గతాను గతకం లోకం' అని అనుకోవలసి వస్తూంది.

ఎన్నో కవితలు, సమాలోచనలు జాలువార్చిన శ్రీ మాదిరాజు రంగారావుగారి కలం, ఈ రెండు చిరు కావ్యాలలోను నడుస్తున్న చరిత్రలని విప్లవాత్మకంగా చిత్రించటమే ధ్యేయంగా పెట్టుకున్నట్టు కనిపిస్తుంది.

వీటిలో-'నిశ్శబ్దం పేలి వాస్తవాన్ని ధ్వనిస్తుంది', గుడిసెనూ మేడనూ ఒకే వీధిలో నిర్మిస్తుంది.

ఐతే, ప్రతి నీటి బిందువులోనూ ఉన్నాదనుకొనే అంగారం, అక్కడక్కడ అంగారితం కాకతప్పలేదు. కాని దానినీ ప్రజ్వలింపచేసే తీక్షత వీరి భాషలో కనిపిస్తుంది.

శ్రీ రంగారావుగారి రచనా పథంలో కేవలం చంచలా లతికలే కాకుండా సుస్థిర మహోజ్వల దీపకాంతులు నిండాలనీ, అవి కిమ్మీర మయాలు కావాలనీ ఆశిద్దాం!

పై రెండు పుస్తకాలూ దొరికే చిరునామా : రసధున్ ప్రచురణలు, క్వా. నెం. 14, విద్యారణ్యపురి, కాకతీయ యూనివర్శిటీ, వరంగల్-9.

— కవిశ్రీ

జాతర

[నవలిక రచన : బోయ జంగయ్య, ప్రచురణ : సాహితీ మిత్రులు, నల్లగొండ ప్రతులకు : చేతన జిరాక్స్, ప్రకాశంబజార్, నల్లగొండ-508 001, పుటలు : 128, వెల : రు. 15].

'జాతర' అన్న ఈ నవలిక పాఠకుణ్ణి ఒక ప్రత్యేక ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. మట్టి బాటలు, ఎద్దుల బళ్లు, తాటిచెట్లు, గొర్రెల గుంపులు, ఆలమందలు, పైరుపచ్చలు-అంతా ప్రశాంత వాతావరణమే. అయితే ప్రశాంత సాగర గర్భంలో తిమింగలాలున్నట్టుగా పల్లెసీమల జన జీవనంలో సైతం అర్థంలేని ఆచారాలు, అంధవిశ్వాసాలు యింకా వేరూనుకునే వున్నాయి. బలం కలిగిన వాళ్లు బలహీనుల్ని పేపుకు తినడం అదొక మామూలు విషయంగా చెల్లిపోతూ వుంది. కొందరి అమాయకత్వం మరి కొందరికి మహదవకాశంగా ఉపకరిస్తోంది. ఈ సమాజ ఆంతరంగిక స్వరూపాన్ని ఆవిష్కరించడానికి వీలుగా రచయిత ఒక జాతరను ఆలంబనంగా తీసుకున్నారు. సాధారణంగా జాతరకు వచ్చేవాళ్ళల్లో రామభక్తుల శాతం తక్కువ. రమా భక్తుల (జేబులు, నగలు కత్తిరించేవాళ్లు) రామా భక్తుల (అందమైన ఆడవాళ్ళను వెన్నంటి తిరిగేవాళ్లు) సంఖ్యే ఎక్కువ. కానీ సచ్ఛీలం కలిగివుండి ఇతరులకు ఆదర్శప్రాయులు కావలసిన పూజారులు, న్యాయాన్ని, ధర్మాన్ని పరిరక్షింపవలసివున్న రక్షక భటులు గూడా రమా భక్తులుగా, రామా భక్తులుగా వుంటే ఎలా? కంచె చేను మేయడంలోని ఈ విడ్డూరాన్ని 'జాతర'లో రచయిత స్పష్టంగా చిత్రించారు. పోగా అయినింటి ఆడపడుచుల విషాద జీవన గాథ ఈ నవలికలో అంతర్వాహినిలా ప్రవహిస్తుంది. ఇష్టమున్నంత చదువనీయరు. ఇష్టమున్నవాణ్ణి చేసుకోనివ్వరు. స్వజనంతో తప్ప వేరే వాళ్ళతో మాటాడనివ్వరు. పోగా భార్యను పెట్టుకుని గూడ్సాపరాయి స్త్రీ ల తో తిరుగుళ్లు ఒళ్లు తూలేవరకు తాగివచ్చినా సేవలు చేసి పడుకోబెట్టాలి. పిల్లలు కలగకుంటే అదీ ఆడదాని లోపమే!' అయినా అందరూ యిక బిడ్డలు లేరనుకున్న సీతయ్యపటేలు కోడలు జాతరకు వెళ్ళి వచ్చాక గర్భవతి కాగలిగింది. ఇదెలా సంభవించిందంటే అందుకు సమాధానం బట్టలుతికే మంగి మాటల్లో వుంది— 'అంతా మాయ, బతుకే మాయ, సంసారం మాయ, పిల్లలు మాయ' ఈ మాయ తెలుసుకోవాలంటే 'జాతర' నవలికను చదవాలి.

— మధురాంతకం రాజారాం.

Printed & Published by S. Radhakrishna for Nageswara Rao Estates Ltd., at the Andhra Patrika Press. Gandhinagar, Vijayawada-3. Editor : S. Radhakrishna, Vijayawada. Phones : 75667 & 61247